
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 25-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 324 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు | వెల : 6.50

బర్రెలక్కకు భద్రత కల్పించండి

హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొల్లాపూర్ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్న శిరీష అలియాస్ బర్రెలక్కకు రక్షణ కల్పించాలని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి. భాస్కర్ రెడ్డి పోలీసులను ఆదేశించారు. తనకు సోషల్ మీడియాలో మంచి ఆదరణ లభించిందని, తన ప్రచారాన్ని కొంతమంది అడ్డుకుంటున్నారని, తన సోదరుడిపై దాడి చేశారని, అయినప్పటికీ పోలీసులు రక్షణ కల్పించలేదంటూ బర్రెలక్క దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు విచారించింది. అభ్యర్థుల రక్షణ బాధ్యత పోలీసులదేనని కోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారం పై నిఘా పెట్టడమే కాకుండా అభ్యర్థులకు రక్షణ కూడా కల్పించాలని స్పష్టం చేసింది. కార్లు తనిఖీలు చేసి విధులు నిర్వహించామని చెబితే సరిపోదని అభిప్రాయపడింది. పోలీసులు రక్షణ కల్పించలేమని చెబితే తాము ఈసీ ద్వారా కేంద్ర బలగాలను రక్షణగా ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఇవ్వాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ అభ్యర్థులకు రక్షణ కల్పిస్తున్నట్టు పోలీసుల తరపున తెలియజేశారు. పిటీషనర్ సోదరుడిపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారని వివరించారు. పిటీషన్‌ను మూసివేస్తున్నట్టు ప్రకటించిన కోర్టు వెంటనే భద్రత కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది.



స్కూళ్లు, కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించండి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్కూళ్లు, కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు, భద్రతా చర్యలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన కీతినీడి అఖిల్, శ్రీ గురు తేజ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. హైదరాబాద్ లోని జవహర్‌నగర్, రామ్‌నగర్, యూసుఫ్‌గూడ, మాసబ్‌ట్యాంక్, రాజ్‌భవన్, సోమాజీగూడ, నాంపల్లి, అమీర్‌పేట్, బోరబండ, విజయానగర్, ప్రభాత్‌నగర్‌లోని పాఠశాలలతోపాటు ఆలియా జూనియర్ కళాశాలలో 8,163 మంది విద్యార్థులు చదువుకుంటున్నారనీ. వీటి భవనాల్లో ఎక్కడా అగ్నిమాపక యంత్రాలు, బిల్డింగ్ పటిష్ఠత సర్టిఫికెట్ లేదని పిటీషన్‌లో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు గతంలో పేర్కొన్న విధంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో వసతులు కల్పించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గురువారం పిటీషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం పై ఉత్తర్వులు జారీ చేసింది. రక్షణ చర్యలతో పాటు అగ్నిమాపకాలు, శానిటేషన్, శుద్ధి చేసిన నీరు తదితరాలు కల్పించాలనీ, నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ గైడ్‌లైన్స్(ఎన్‌డీఎంఏ) పేర్కొన్న పాఠశాల భద్రతా విధానం-2016 నిబంధనల మేరకు అమలు చేయాలని ఆదేశించింది. తీసుకున్న చర్యలపై 4 వారాల్లో నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల, ఉన్నత విద్యా శాఖల ప్రధాన కార్యదర్శులు, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ కమిషనర్, డైరెక్టర్, ఇంటర్ బోర్డు, హోం శాఖ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విపత్తు, అగ్నిమాపక సేవల డీజీ, కేంద్ర మహిళా వనరుల అభివద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

రైతు బంధుకు లైన్ క్లియర్..

అనుమతించిన ఈసీఐ
28 లోపు జమ చేయాలని ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో రైతుబంధు సాయం పంపిణీకి అడ్డంకులు తొలగిపోయాయి. రైతు బంధు డబ్బుల పంపిణీ చేసేందుకు భారత ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రైతుబంధు సాయం పంపిణీకి అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది. తెలంగాణ సర్కార్ అభ్యర్థనను పరిశీలించిన ఎన్నికల సంఘం పాత పథకమే కావడంతో రైతుబంధు సాయం పంపిణీ చేసేందుకు గురువారం అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ నెల 28 సాయంత్రం ప్రచారం ముగిసే లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని ఈసీ సూచించింది. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతు ఖాతాల్లో 7,720 కోట్ల రూపాయలు జమ కానున్నాయి.

అభివృద్ధి, సంక్షేమం అరుదైన సమతూకం

- దాన్ని సాధించిన రాష్ట్రం తెలంగాణ
- మార్పు తెచ్చిన కేసీఆర్‌కు ఓటేస్తారా? లేక
- పట్టించుకోని అసమర్థులకు వేస్తారా :

సంపాదకులతో ఇష్టాగోష్టిలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అభివృద్ధి, సంక్షేమం అరుదైన సమతూకం, దాన్ని సాధించిన రాష్ట్రం తెలంగాణ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సంపాదకులు, సీనియర్ పాత్రికేయులతో నిర్వహించిన ప్రత్యేక ఇష్టాగోష్టి కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 25 ఏండ్లలో పట్టణాలు, ఐటీ, వ్యాపార అనుకూల విధానాలకు గానూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును, గ్రామాలు, వ్యవసాయం, పేదల అనుకూల విధానాలకుగాను మాజీ సీఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిని ప్రజలు గుర్తు పెట్టుకుంటారని తెలిపారు. అవన్నీ మళ్లీ కేసీఆర్‌లో కనిపిస్తున్నాయని తెలిపారు. 2014లో హైదరాబాద్ మినహా మిగిలిన 9 జిల్లాలు వెనుకబడి ఉన్నాయనీ, ప్రస్తుతం 33 జిల్లాలు తలసరి ఆదాయం జాతీయ సగటు కన్నా ఎక్కువగా ఉందని తెలిపారు. గతంలో విద్యుత్, నీరు, వ్యవసాయం పట్టించుకోని అసమర్థులకు ఓటేస్తారా? లేక మార్పు తెచ్చిన కేసీఆర్‌కు ఓటేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ప్రగతికి ఓటు వేయాలని ఆయన కోరారు.

గతానికి భిన్నంగా ప్రచార పద్ధతిని ఎంచుకోవడానికి ప్రజలకు, తమకు బోర్ కొట్టకుండా ఉండేందుకేనని కేటీఆర్ తెలిపారు. వివిధ వర్గాలతో కనెక్ట్ అయ్యేందుకేనని చెప్పారు. తామూ మనుషులమేననీ, తప్పులు జరుగుతుంటాయనీ, సరిదిద్దుకోవడమే జీవితమన్నారు. తెలంగాణలో కన్నా ఎక్కువ నియామకాలు జరిపిన రాష్ట్రముంటే చెప్పాలని బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. ప్రభుత్వంతో తమకొచ్చిన ఫలితాల ఆధారంగానే ప్రజలు ఓటస్తారని అభిప్రాయపడ్డారు. 2018లో గెలిచిన సీట్ల కంటే ఎక్కువే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదరికం ఎక్కువనీ, దాని కారణంగానే నక్సలిజం పుట్టుకొచ్చిందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక మూసీ సుందరీకరణపై దష్టి పెడతామన్నారు. కోవిడ్ కారణంగా ప్రభుత్వ ఖజానాకు రూ.లక్ష కోట్లు నష్టమొచ్చిందని తెలిపారు. శత్రు దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించినట్టుగా కేంద్రంలోని బీజేపీ తమపై ఆంక్షలు పెట్టిందని విమర్శించారు. మేధావులు కొంత మంది తమ బాధను ప్రజల బాధగా చెబుతున్నారనీ, సమాజంలో 99.99 శాతం మందికి ముఖ్యమంత్రిని నేరుగా కలవాల్సిన అవసరమే ఉండదని చెప్పారు. సీఎం నేరుగా కలవకపోతే ప్రజాస్వామ్యమే లేదన్నట్టు చెప్పడం సరి కాదన్నారు.

రేవంత్ రెడ్డి అవినీతిపరుడు కాదా?

సీఎం కేసీఆర్‌ను అవినీతిపరుడంటూ విమర్శిస్తున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అవినీతి పరుడు కాదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆటో యూనియన్ కార్మికులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. నోట్ల కట్టలతో దొరకిన చిల్లరగాడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. సీఎం కేసీఆర్ రూ.100 కోట్ల తో ఆటో కార్మికులను ఆదుకున్నారని తెలిపారు.

హైదరాబాద్ మెట్రో రైల్ లో మంత్రి కేటీఆర్

మంత్రి కేటీఆర్ శుక్రవారం హైదరాబాద్‌లోని రాయదుర్గం నుంచి బేగంపేట్ వరకు మెట్రో రైల్లో ప్రయాణించారు. ప్రయాణికులతో ముచ్చటించారు. సాధారణ ప్రయాణికునిగా వారితో కలిసిపోయారు. ఆత్మీయంగా పలకరించారు. ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనాలనీ, మంచి నాయకులను ఎన్నుకోవాలని కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతకు సూచించారు.

హరితనిధిలో 20 శాతం ఆర్టీసీకి కేటాయించాలి

సీఎస్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్ వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ హరితనిధిలో 20 శాతం సొమ్మును ఆర్టీసీకి కేటాయించాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రం సమర్పించారు. పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న టీఎస్‌ఆర్టీసీకి హరితనిధి సొమ్ము కేటాయించి, ప్రజారవాణా మెరుగుదలకు కొత్త బస్సులు కొనుగోలు చేయాలని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు కోరారు. 8 ఏండ్లుగా ఆర్టీసీ కార్మికులకు వేతనాలు పెరగలేదనీ, 2013 వేతన సవరణ బకాయి సొమ్మును చెల్లించలేదనీ, 9 డిఏల బకాయిలు ఇవ్వాల్సి ఉందనీ వివరించారు. ఆర్టీసీ కార్మికుల నుంచి హరితనిధి వసూలుపై కార్మికులకు అవగాహన కల్పించి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆర్టీసీ బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నదనీ, వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించాలంటే ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాల్సి ఉందని పేర్కొన్నారు. టార్గెట్లు పెట్టుకొని మొక్కలు నాటుతున్నారనీ, వాటి సంరక్షణను మాత్రం విస్మరిస్తున్నారని, చెట్ల నరికివేతకు పక్కా ప్రణాళిక లేకుండా ఉన్నదని అభిప్రాయపడ్డారు.

ఎస్సీ వర్గీకరణకు కేంద్రం కసరత్తు..!

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎస్సీ వర్గీకరణకు కమిటీ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ప్రధాని మోడీ సూచించారు. శుక్రవారం క్యాబినెట్ సెక్రెటరీ, ఇతర ముఖ్యమైన అధికారులను పిలిచిన ప్రధాన మంత్రి, మాదిగ సామాజిక వర్గానికి రిజర్వేషన్‌లో ఉప-వర్గీకరణకు సంబంధించిన కమిటీ ఏర్పాటు, ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించినట్టు ప్రభుత్వ వర్గాలు సమాచారం. అయితే అందు కు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 25-11-2023 | 10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు | వెల : 6.50

సంపుటి : 9 | సంచిక : 324 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar



కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపండి

విభజించి పాలిస్తున్న బీజేపీ

- ప్రజలపై భారాలేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- 9 ఏండ్లలో పెరిగిన నిరుద్యోగం
- దళితులకిచ్చిన హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం: ఖమ్మం రోడ్ షోలో త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఈ ఎన్నికలు తెలంగాణకే కాదు దేశానికీ అతి ముఖ్యమైనవిగా భావించాలని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ తెలిపారు. దేశాన్ని విభజించి పాలించే రీతిలో బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. స్వతంత్ర వ్యవస్థను అణచివేస్తుందని తెలిపారు. అందుకే బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలోనూ ఈ రకంగా ముందుకు వచ్చామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల తొమ్మిదేండ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగిత బాగా పెరిగాయన్నారు. ఖమ్మం నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి యర్రా శ్రీకాంత్ విజయాన్ని కాంక్షిస్తూ త్రీటౌన్‌లో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోకు మాణిక్ సర్కార్ హాజరయ్యారు. ముందుగా ఖమ్మం గాంధీచౌక్‌లో ప్రారంభమైన రోడ్ షో 3 టౌన్ వ్యాప్తంగా కొనసాగింది. అనంతరం స్థానిక బోస్ బొమ్మ సెంటర్‌లో మాణిక్‌సర్కార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నించే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపాలని కోరారు. దేశంలో వ్యవసాయదారులు, కూలీలు, కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు చేసిన బీజేపీని ఓడించాలనే నినాదంతో దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 19 స్థానాల్లో పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థులను అసెంబ్లీకి పంపితే ప్రజాస్వామ్య హక్కులకై నిలబడతారనీ, ప్రభుత్వాల అవినీతిని ప్రశ్నిస్తారని తెలిపారు. 50 ఏండ్లలో పెరిగిన నిరుద్యోగం కంటే బీజేపీ పాలనలోని ఈ తొమ్మిదేండ్లలో గణనీయంగా పెరిగిందని ఆరోపించారు. నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా తగ్గిందన్నారు. దేశాన్ని విభజించి పాలించాలనే యోచనతో ఉన్న బీజేపీ.. కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతుందని చెప్పారు. ప్రజా పోరాటాలను అదుపు చేయలేక పౌర హక్కులను అణచివేస్తుందని, రాజ్యాంగం పైనా దాడి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి బీఆర్ఎస్ పాలన కూడా ఏమాత్రం మినహాయింపు కాదన్నారు. రాష్ట్రంలోనూ నిరుద్యోగిత బాగా పెరిగిందని, షెడ్యూల్ కులాలకు ఇచ్చిన హామీలను నిలుపుకోవడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని తెలిపారు. విద్యా వైద్యం.. ప్రయివేటు, కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిందని చెప్పారు. ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం అణచివేస్తోందని, మీడియానూ స్వేచ్ఛాయుతంగా పనిచేసుకోనివ్వడం లేదని ఆరోపించారు. 40 ఏండ్లుగా ప్రజా సమస్యలపై ...9లో





ఎర్రజెండా హోరు

సీపీఐ(ఎం) జాతీయ నేతల ప్రచారం షురూ... 27 వరకు రాష్ట్రంలోనే...

సీపీఐ(ఎం) ప్రచార ఉధృతి పెంచింది. తమ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ జాతీయ నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ నెల 27 వరకు సీపీఐ(ఎం) అగ్ర నాయకత్వం రాష్ట్రంలోనే ఉండబోతుంది. ఆ పార్టీ పోటీ చేస్తున్న పలు నియోజకవర్గాల సభల్లో పాల్గొననుంది. ఖమ్మం, మధిరలోని ముదిగొండ సభల్లో త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ శుక్రవారం పాల్గొన్నారు. వరంగల్ జిల్లా జనగామ, హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో జరిగిన సభల్లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణిఅలీ ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలకు జనం భారీ స్థాయిలో హాజరయ్యారు. శనివారం నుంచి సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్‌లు కూడా పాల్గొననున్నారు. ఇప్పటికే బివి రాఘవులు, విజయ రాఘవన్ పలు సభలకు హాజరై సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరాన్ని వివరిస్తున్నారు. కేంద్ర నాయకత్వం రాకతో కార్యకర్తల ఉత్సాహం, ఎర్రజెండా ప్రచారం ఊపందుకున్నది.

దేశ రక్షణకు పోరాడుదాం

సంపదను అంబానీ, అదానీకి కట్టబెడుతున్న బీజేపీ

- క్రికెట్ చూసే మోడీకి మణిపూర్ వెళ్లే సమయం లేదా?
- ప్రభుత్వరంగ సంస్థలు ప్రయివేటుపరమైతే యువతకు ఉద్యోగాలెలా
- సమస్యలు పరిష్కారం కావాలంటే దశరథ్‌ను అసెంబ్లీకి పంపాలి

:సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణీఅలీ పిలుపు

వివరాలు 5లో



మన సంపద మనకే దక్కాలి

కొల్లగొడుతున్న మోడీ, కేసీఆర్

- కాళేశ్వరం, మిషన్‌భగీరథ అవినీతిమయం
- మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి
- బీజేపీ, ఎంఐఎం, బీఆర్ఎస్ ఒక్కటే : విజయభేరీ సభల్లో ప్రియాంక గాంధీ





పార్టీ శ్రేణులతో ప్రియాంక

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/ హుస్నాబాద్ రూరల్

దేశంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ సంపదను కొల్లగొడుతూ దోచుకుంటున్నారని, మన సంపద మనకే దక్కాలనే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు వెళుతోందని, దానికోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ సీఎం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారాయని ఆరోపించారు. శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కే పోటీ అని, కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీ పథకాల అమలుతో పాటు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులు మోసానికి గురయ్యారన్నారు. ఉద్యోగ పరీక్షల వాయిదాతో ఒక యువతి ఆత్మహత్య చేసుకుంటే ...9లో

ఆ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనివ్వొద్దు

- మేడిగడ్డ మతి ఉండి కట్టాడో.. మందేసి కట్టాడో ?
- 60ఏండ్లలో రూ. 69 వేల కోట్ల అప్పు... పదేండ్లలో ఆరు లక్షల కోట్ల అప్పు : ప్రజా భరోసా సభలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

వివరాలు 10లో



సుప్రీంకోర్టు తీర్పును చదవండి

కేరళ గవర్నర్‌కు సీజేఐ ధర్మాసనం ఆదేశం



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

బిల్లులను ఆమోదించకుండా నిలుపు దల చేస్తూ చట్టసభలను దాటవేసే అధికారం గవర్నర్‌కు లేదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టంచేసింది. పంజాబ్ గవర్నర్‌కు సంబంధించిన కేసులో గురువారం ఇచ్చిన తీర్పును చదవాలని కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌ను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. బిల్లులను ఆమోదించటంలో రాష్ట్ర గవర్నర్ ఉద్దేశపూర్వక ...9లో

సింగరేణి ప్రయివేటీకరణకు యత్నం

యాభై ఏండ్ల కాంగ్రెస్ పాలనలోనే ఆగమైంది



- మేం సింగరేణి లాభాలను వాటా కింద కార్మికులకిచ్చాం
- బీజేపీకి ఓటేస్తే బురదలో వేసినట్లే..!
- కాంగ్రెస్ వస్తే మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ
- ఆగమాగం కావద్దు.. చరిత్ర చూసి ఓటేయాలి:ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/గోదావరిఖని/భూపాలపల్లి/ములుగు/ హాజీపూర్

ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి 144 ఏండ్ల చరిత్ర గల సింగరేణిని నడుప చేతకాక కేంద్రానికి 49శాతం వాటా అమ్మేసి కార్మికుల హక్కలను హరించిందని, ఇప్పుడు బీజేపీ ఏకంగా ప్రయివేటీకరించే కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణి రూ.2184కోట్ల లాభాల్లోకి వచ్చిందని తెలిపారు. లాభాల వాటాను పండుగ బోనస్‌ల కింద కార్మికులకే రూ.వెయ్యికోట్ల వరకు చెల్లించామని తెలిపారు. ఎన్నికల్లో చెప్పే మాటలకు ఆగమం కావొద్దని, పార్టీలు, వ్యక్తుల చరిత్ర తెలుసుకొని ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. శుక్రవారం రామగుండం, భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం పాల్గొన్నారు. రామగుండంలో సీఎం మాట్లాడుతూ.. మరిన్ని పరిశ్రమలు ...9లో

ఆందోళనా..? జాగ్రత్తా...?

- మంత్రి కేటీఆర్ ప్రచారంలో కొత్త ఎత్తులు
- తాజాగా మెట్రో రైల్లో ప్రయాణం.. రియల్ ఎస్టేటర్లతో భేటీ.. ఆటో నేతలతో ఆత్మీయ సమ్మేళనం
- పత్రికాధిపతులు, సంపాదకులతో సమాలోచనలు
- సర్వేలు, నివేదికల నేపథ్యంలో రూటు మార్చిన వర్కింగ్ ప్రెసిడెంట్

వివరాలు 9లో



సంపాదకీయం

మృత్యు కోరల్లోంచి..!

వారు భక్తులవునో కాదో తెలీదు కానీ, 'మార్కండేయులే!' శివలింగాన్ని కౌగిలించుక్కూచోలేదు. అది వాళ్లక్కడ అందుబాటులో లేదు కూడా! పాశం విరిసింది 'యముడు' కాదు. నయా ఉదారవాదవిధానాలు. సిల్కియారా బార్‌కోట్ టన్నెల్ కూలి దాన్లో 'డాష్' సంఖ్యలో కార్మికులు ఇరుక్కున్నారు. ఈ 'డాష్‌'కు కారణమేమంటే ఆ టన్నెల్ పనుల గుత్తేదారు హైదరాబాద్‌లో రిజిస్టర్ అయిన నవయుగ కన్‌స్ట్రక్షన్ కంపెనీ. ఆ నవయుగ వారి దగ్గర ఆ పాపిష్టి తేదీ నాడే (నవంబర్ 12), ఆ తెల్లవారుజామున ఎందరు డ్యూటీకెళ్లారో లెక్కలేదట! రోజూ 150-200 మంది పని చేస్తారు గాని, దీపావళి రోజులు కావడం వల్ల కొందరు డుమ్మాలు కొట్టారట! అప్పటిదాకా నలభై అన్నారు. తర్వాత నలభై ఒక టంటున్నారు. కాకిలెక్కలా! కొన్ని ఇంగ్లీషు ఛానల్స్ పదహారు మందిని ఎండోస్కోప్ చిత్రంలో చూపించాయి. ఈ మానవకోణం బహుశా మీడియాకి పట్టదు కాబోలు!

ప్రమాదం జరిగే వరకు నవయుగా వారి దగ్గర కటింగ్ యంత్రాల్లేవు. ప్రమాదం నవంబర్ 12న జరిగితే ఎలుకలు కలుగుల్లో బతికినట్లు ఎందరున్నారో తెలీదు. ఎవరున్నారో తెలీదు. గాడాంధకారంలో బతుకు తున్నారు. బహుశా 18న ఎన్డోస్కోప్ ద్వారా కొంత వెలుగు, కుటుంబాలతో మాట్లాడించడం చేస్తున్నారు. యోగా చేయమని, ధ్యానం చేయమని బయట్నించి ఉచిత సలహాలకు కొదవలేదు.

అక్కడ అడ్డం పడింది డెబ్బయి మీటర్ల మందమున్న బండలు, ఇతర శిథిలాలు. కుటుంబ సభ్యులు బయట పూజలు చేయడం టీవీల్లో చూపిస్తున్నారు. ఎందరో లెక్కతెలీక పోయినా, అందరూ పోయుంటేనో, కొందరైనా పోయుంటేనో ఎంత ఖర్చవుతుందో యాజమాన్యం లోపల లెక్క వేసుకుంటోంది కావచ్చు. ఇక్కడ మొదటి దోషి డబుల్ ఇంజన్ సర్కారే. వారు ఆబగా అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలు. ఇక్కడ మానవ జీవితానికి విలువలేదు. బలిసే యాజమాన్యాల పొట్టలు, లోతైన వారి జేబులే! అందుకోసం మోడీ సర్కార్ ఎంతకైనా తెగిస్తుందనేందుకు ఇంతకు మించిన ఉదాహరణ ఉండదు.

సరళీకృత ఆర్థిక విధానాలను మతోన్మాదంతో రంగరించడంలో బీజేపీ నేతలు సిద్ధహస్తులు. అది అస్మదీయులకు లాభాలకు లాభాలు పండిస్తోంది. ఓట్లకు ఓట్లు రాలు స్తుంది. చార్‌ధామ్ ప్రాజెక్టు ఆ కోవలోదే! నాలుగు పుణ్య క్షేత్రాలను కలుపుతూ (బదరీనాథ్, కేదార్‌నాథ్, యమునోత్, గంగోత్రి) 12 మీటర్ల వెడల్పయిన రోడ్‌కు 2016లో ప్రారంభోత్సవం చేశాడు మోడీ సాబ్. ఖర్చు రూ.12 వేల కోట్లు. నేల వదులుగా ఉండే (లూజ్ సాయిల్) హిమాలయ పర్వత సానువులో ఆ పని వల్ల తీవ్ర ప్రమాదమని అనేక మంది నిష్ణాతులు వాదించారు. చివరికి



సుప్రీంకోర్టు ముందు 'డబుల్ ఇంజన్' వాదనేమంటే ఉత్తరాఖండ్ పొరుగునున్న చైనాతో యుద్ధమొస్తే సైన్యాన్ని యుద్ధ ట్యాంకులను కదిలించాలంటే ఇది అవసరమని, యాత్రీకులు త్వర త్వరగా 'దర్శనాలు' చేసుకుని బయట పడేందుకు అవసరమని చెప్పింది. ఎలాగో అనుమతులు సంపాదించుకున్నారు.

కొండలు, వాటిలోని బండల నిర్మాణం ఎలా ఉందో తెలుసుకోకుండా కొండల్ని కట్ చేయరాదని, నిష్ణాతుల పర్యవేక్షణలోనే రోడ్ల నిర్మాణం, సొరంగాల నిర్మాణం జరపాలని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్ పి.సి. నవానీ చెప్పారు. బయటికి తప్పుకునే మార్గం (ఎస్కేప్ రూట్) లేకుండా 4.5 కి.మీ. సొరంగం తప్పని ఆయన మొత్తుకుంటున్నాడు. భూకంపాలు, భూ ప్రకంపనలు నిరంతరం ఉండే హిమాలయాల్లో ఈ చర్య అత్యంత ప్రమాదభరితమని మరొక నిష్ణాతుడు సి.పి.రాజేంద్రన్ చెప్తున్నారు. వంద కి.మీ.కు మించిన రోడ్ వేయాలంటే పర్యావరణ అనుమతులు తప్పనిసరి. చార్‌ధామ్ రోడ్ 900 కి.మీ. తప్పనిసరిగా తీసుకోవాలి. అందుకే డబుల్ ఇంజన్ సర్కార్ దాన్ని 53 ముక్కలు చేసింది. ఏ అనుమతులు అవసరం లేకుండా 'బిందాస్‌'గా కాంట్రాక్టులిచ్చుకుంది. నేడు ప్రమాదం జరిగిన చోటే 2019లో జరిగింది. బాధ్యులెవరో తేల్లేదు. ఏ శిక్షలూ ఎవరికీ లేవు.

బార్‌కోట్ - సిల్కియారా టన్నెల్ నిర్మాణాన్ని నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వారు 'నవయుగ'కిస్తే టన్నెల్స్ నిర్మాణంలో పేరున్న ఆస్ట్రియా-జర్మనీకి చెందిన మరో కంపెనీకి అప్పగించారు. తామనుకున్న దానికంటే ఈ టన్నెల్ నిర్మాణం ఒక సవాలుగా ఉందని సదరు ఆస్ట్రియా కంపెనీ వెబ్‌సైట్‌లో పెట్టారు. అయినా ఏ జాగ్రత్తలూ తీసుకోలేదు. ఆశ్చర్యమేమంటే ప్రమాదం జరిగే వరకు నవయుగా వారి దగ్గర కటింగ్ యంత్రాల్లేవు. ప్రమాదం నవంబర్ 12న జరిగితే ఎలుకలు కలుగుల్లో బతికినట్లు ఎందరున్నారో తెలీదు. ఎవరున్నారో తెలీదు. గాడాంధకారంలో బతుకుతున్నారు. బహుశా 18న ఎన్డోస్కోప్ ద్వారా కొంత వెలుగు, కుటుంబాలతో మాట్లాడించడం చేస్తున్నారు. యోగా చేయమని, ధ్యానం చేయమని బయట్నించి ఉచిత సలహాలకు కొదవలేదు. ఎవరు ఏ షేపులో బయటికొస్తారో తెలీదు కాబట్టి 41 అంబులెన్స్‌లు ఆసుపత్రిలో 41 పడకలు సిద్ధంగా ఉంచారు.

మళ్లీ ఎన్నికలు జరిగేలోగా ఛార్‌ధామ్ రోడ్ వినియోగం రావడానికి 24/7 పనులు సాగుతున్నాయి. అందుకే అత్యంత ప్రాధాన్యతున్న దీపావళి 'పర్వదిన' రోజుల్లో కూడా ఆ అభాగ్య కార్మికులు పనుల్లోకి దిగారు. 13 రోజుల తర్వాతనైనా ఆ కార్మి కులందరూ సజీవంగా బయటికొస్తారనే ఆశిద్దాం. ఏ అవాంతరాలు లేకుండా ఈ టన్నెల్ నిర్మాణం పూర్తి కావాలి.



ఓటంటే మాట కాదు

ఓటు అంటే
వాగ్దానాల పులకరింతల్లో
పలవరింతలు కానే కాదు
భరోసాల భజనల్లో
తాత్విక చింతన అస్సలు కాదు
ఓటంటే నమ్మకానికి అభివృద్ధికి
వేసుకున్న బాట లాంటిది

ఓటు అనేది
పెద్ద పెద్ద ఫోటోలతో
దారుల్ని దిగ్బంధించడం కాదు
గతుకులకు అతుకులేసి
మెత్తగా నడిపించడం
మైకులతో
కర్ణభేరిని పగలగొట్టడం కాదు
మెతుకులేని కడుపుకింత
గంజి పోసి బ్రతికించడం

ఓటనేది
ఖద్దరుకు హూందాతనానికి
ముడిపడిన సంబంధం కాదు
ఏ సంబంధం లేని గుడిసెల్లో
సమస్యల చితిని ఆర్పేసి
కుండలో కాయిన్ని గింజల్ని నింపడం

ఓటు అనేది
చిటపటలాడే కరెన్సీ నోటుకు
పటపటమని పేలే
టపాసులకు మధ్య
ఏర్పడిన సాన్నిహిత్యం కాదు
కటకటమనే జీవితాలకు
కూసింత అందనివ్వడం

ఓటనేది
నమస్కారాలతో
ఆలింగపరుచుకునే ప్రక్రియ కాదు
భుజం నిమిరి
భరోసాలన్నింటిని కుమ్మరించే
అలవోకతనపు గెలుపు కాదు
చిరిగిన జీవనాల బతుకులకింత
కుట్లు వేసి మరమ్మతులు చేయడం

ఓటు అనేది
వ్యవస్థకు అవస్థకు మధ్య
పరిష్కారం లాంటిది
సమాజానికి సమానతకు మధ్య
వారధిలాంటిది
ఓటు పవిత్రం
నిలుపుకోవడం మన ధర్మం
ఓటంటే మాట కాదు సుమీ

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

రాజ్యము - రాజ్యాంగము

స్వతంత్ర భారత చరిత్రలో నవంబర్ 26 ఓ అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజు. మరీ ముఖ్యంగా ఆధునిక, లౌకిక, ప్రజాస్వామ్య, భారతదేశ నిర్మాణంలో ఈ రోజుకు చాలా ప్రాధాన్యత ఉంది. కారణం 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు. మన దేశానికి స్వతంత్రం వచ్చినది 1947 ఆగస్టు 15. ఆ రోజుతో 190 సంవత్సరాల తెల్లవాడి పాలన, అంటే సామ్రాజ్యవాదుల పాలన అంతమై అధికారం బడా పెట్టుబడిదారీ పాలకవర్గాల చేతుల్లోకి బదలాయించబడింది. ఈ నూతన పాలకవర్గాల రాజ్యం భారత రాజ్యాంగ సభను రూపొందించింది. ఆ రాజ్యాంగ సభే నూతన భారత రాజ్యాంగాన్ని తయారు చేసింది. భారత రాజ్యాంగం ఏర్పడిన తర్వాత చర్చ యావత్తూ సహజంగానే రాజ్యాంగం చుట్టే జరుగుతుంది. దాన్ని రూపొందించిన రాజ్యం, ఆ రాజ్యాన్ని నిర్వహిస్తున్న బడా పెట్టుబడిదారులు, వారి మిత్ర వర్గాల గురించి చర్చ జరగటం తగ్గిపోయింది. గడచిన ఈ ఏడు దశాబ్దాల కాలంలో భారత రాజ్యాంగం అనేకసార్లు సవరించబడింది. మరెన్నోసార్లు పాలకవర్గాలు తమ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగసభలో ముసాయిదాని ప్రవేశపెడుతూ "రాజ్యాంగం ఎంత ఉన్నతమైనదైనా దాన్ని అమలు చేసేవారు ఉన్నతులు కాకపోతే అది ఒక చెడ్డ రాజ్యాంగంగానే నిరూపించబడుతుంది" అని చేసిన హెచ్చరిక ఆధారంగా భారత రాజ్యాంగం అమలు చరిత్రని విశ్లేషించాల్సి ఉంటుంది.



ఆర్. రఘు
9490098422

ప్రత్యేకించి భారత రాజ్యాంగం, రాజ్యాంగ సభ ముందుకు వచ్చిన సమయంలోనే ఈ రాజ్యాంగాన్ని తాము అంగీకరించమని, ఇది హిందువులకు ఆమోదయోగ్యం కాదని, ఇది ఒక అతుకుల బొంత అని, తరతరాలుగా భారత సమాజాన్ని నడిపించిన అసలు సిసలైన రాజ్యాంగమైన 'మనుస్మృతి'ని ఈ రాజ్యాంగ నిర్మాతలు విస్మరించారని మనుస్మృతి ప్రస్తావన లేదు కాబట్టి దీన్ని తాము తిరస్కరిస్తున్నట్లు బహిరంగంగానే నాడు ఆర్‌ఎస్‌ఎస్ ప్రకటించింది. తర్వాత తాత్కాలికంగా కొంత వెనక్కి తగ్గినట్లు నటించినా హిందూత్వ ఫాసిస్టు శక్తులు భారత రాజ్యాంగాన్ని మట్టుపెట్టాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. గత పదేండ్లుగా అధికారం చెలాయిస్తున్న ఈ శక్తులు రాజ్యాంగంపై పూర్తి స్థాయిలో దాడి ఎక్కుపెట్టారు. అందువలన ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగం గురించి అలాగే ఈ రాజ్యాంగాన్ని అమలు చేసే రాజ్యం గురించి కూడా తెలుసుకోవాలి. దీనిపై చర్చ జరగాలి.

రాజ్యాంగం...

మనది ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన రాతపూర్వక రాజ్యాంగం. ఈ రాజ్యాంగం అంతిమంగా రూపుదిద్దుకోవటానికి దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు చర్చలు జరిగాయి. 299 మంది రాజ్యాంగ సభలో ముసాయిదాపై చర్చ అనంతరం ఈ రాజ్యాంగాన్ని ఆమోదించడం జరిగింది. భారత రాజ్యాంగంలో మూడు విభాగాలున్నాయి. ఒకటి పీఠిక. రెండు ప్రాథమిక హక్కులు. మూడు ఆదేశిక సూత్రాలు. ఈ మూడింటినీ విడివిడిగా తెలుసుకోవడమే కాదు. ఈ మూడింటి మధ్య ఉన్న సంబంధంతో కలిపి చూస్తేనే భారత రాజ్యాంగం స్ఫూర్తి, స్వభావం,



లక్ష్యం అర్థమవుతాయి. భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఒక తీర్పులో "రాజ్యాంగాన్ని కేవలం ఒక డాక్యుమెంట్‌గా పరిగణించరాదు. ఇది ఒక వీలునామానో, ఇద్దరి మధ్య జరిగిన ఒక ఒప్పంద పత్రంగానో చూడరాదు. రాజ్యాంగం జాతి జీవన వాహకం. రాజ్యాంగం ద్వారం కాదు మార్గమని మర్చిపోరాదు. రాజ్యాంగాన్ని రూపొందించే క్రమంలో ప్రతిదీ నిరంతరం మారుతుందని, ఒక వ్యక్తి, లేదా దేశం జీవితం నిశ్చలంగా ఉండకుండా అభివృద్ధి చెందుతూ ఉండాలని నిర్మాతలు భావించారు... రాజ్యాంగం మూలాలు గత చరిత్రలోను, వర్తమానంలో దాని కొనసాగింపు ప్రతిఫలించే విధంగానూ, అంతం లేని భవిష్యత్తు వైపు దేశాన్ని నడిపించేదిగాను ఉంటుంది." అని పేర్కొంది. పీఠికలో మొదట, చివర "ప్రజలమైన మేము" అని "ప్రజలుగా మాకు మేము సమర్పించుకుంటున్నామని" వుండటం యాదృచ్ఛికం కాదు. అనేక ఇతర దేశాల రాజ్యాంగాల మాదిరిగా ఎక్కడా భగవంతుని ప్రస్తావన లేదు. ఈ రాజ్యాంగం ప్రజలదని, దాని అమలు చేయించుకోవాల్సింది ప్రజలేనని, మార్చాల్సి వస్తే అది కూడా ప్రజల కుండే హక్కేనని పీఠిక తెలియ చేస్తున్నది. ప్రాథమిక హక్కుల్లో పొందుపరచబడ్డ పౌరులహక్కులు - సమాన హక్కు, అంటే చట్టం ముందు మత, జాతి, కుల, లింగ భేదం లేకుండా అందరూ సమానమే అనడం. అంటరానితనం నిర్మూలన, వాక్‌స్వాతంత్ర్యం, సంఘాలు ఏర్పరచుకోవడం, దేశంలో ఎక్కడికైనా సంచరించడం, ఏ పనినైనా ఎంచుకోవడం, ఏ మతాన్ని అయినా ఆచరించడం, ప్రచారం చేసుకోవడం వంటివి అనేకం ఉన్నాయి. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందని భావించిన ఏ పౌరుడైన, పౌరురాలైన, సంస్థ అయినా రాజ్యాంగ ధర్మాసనంలో కేసు వేయడం కోసం ఉన్న 32వ అధికరణ అత్యంత విలువైనది. అంబేద్కర్ మొత్తం రాజ్యాంగంలో ఉన్న అధికరణలన్నింటిలో కన్నా అత్యంత విలువైనది ఏంటి అన్నప్పుడు ఈ "32వ అధికరణ రాజ్యాంగం గుండె, ఆత్మ." అని పేర్కొన్నారు. ఆదేశిక సూత్రాలు రాజ్యాంగానికి జీవం. రాజ్యాంగం ఆధారంగా పాలక వర్గాలు ఈ దేశంలో పార్ల మెంటరీ, గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థని రూపొందించ డానికి ఉద్దేశించబడినవే ఈ ఆదేశిక సూత్రాలు.



ప్రాథమిక హక్కుల్లో పొందుపరచబడ్డ పౌరుల హక్కులు - సమాన హక్కు అంటే చట్టం ముందు మత, జాతి, కుల, లింగ భేదం లేకుండా అందరూ సమానమే అనడం. అంటరానితనం నిర్మూలన, వాక్ స్వాతంత్ర్యం, సంఘాలు ఏర్పరచుకోవడం, దేశంలో ఎక్కడికైనా సంచరించడం, ఏ పనినైనా ఎంచుకోవడం, ఏ మతాన్ని అయినా ఆచరించడం, ప్రచారం చేసుకోవడం వంటివి అనేకం ఉన్నాయి. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందని భావించిన ఏ పౌరుడైన, పౌరురాలైన, సంస్థ అయినా రాజ్యాంగ ధర్మాసనంలో కేసు వేయడం కోసం ఉన్న 32వ అధికరణ అత్యంత విలువైనది. అంబేద్కర్ మొత్తం రాజ్యాంగంలో ఉన్న అధికరణలన్నింటిలో కన్నా అత్యంత విలువైనది ఏంటి అన్నప్పుడు ఈ "32వ అధికరణ రాజ్యాంగం గుండె, ఆత్మ," అని పేర్కొన్నారు.

ఇంత విలువైన, దూరదృష్టితో కూడిన, మొత్తం వేల ఏండ్ల భారత సమాజాన్ని రంగరించి రూపొందించిన ఈ రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత ఉన్నతమైనదిగా కీర్తించబడుతున్నది. అనేక దేశాల్లో రాజ్యాంగాలు అమలులోనే అంతమైపోయాయి. కానీ 74 సంవత్సరాలుగా మన రాజ్యాంగాన్ని నిలుపుకుంటూనే ఉన్నాం. ఇందుకు మరో కారణం కూడా ఉన్నది. భారత రాజ్యాంగాన్ని సమూలంగా రద్దు చేసే అవకాశం లేదు. కానీ అవసరమైన సందర్భాలలో మారిన పరిస్థితులకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని సవరించుకునే అవకాశం ఇవ్వబడింది. ఇప్పటికే వందసార్లకు పైగా సవరణలు చేశారు. అయితే మొత్తం రాజ్యాంగాన్నే అంతం చేయడానికి గత 75 సంవత్సరాలుగా హిందూత్వ శక్తులు ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

రాజ్యాంగంపై హిందుత్వ దాడి


1999లో అధికారంలోకి వచ్చిన బీజేపీ వాజ్‌పేయి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని సమీక్షించాలని ఓ భయంకరమైన కుట్రకి తెర లేపింది. మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంకటాచలయ్య నేతృత్వంలో ఓ కమిషన్ కూడా వేసేసింది. నిజానికి రాజ్యాంగాన్ని సమీక్షించే హక్కు ప్రభుత్వానికి రాజ్యాంగం ఇవ్వలేదు. కానీ బీజేపీ నాటి ఎన్డీఏ ప్రభుత్వం వేసిన ఈ కమిషన్ రెండు సంవత్సరాలు చర్చించి 2002లో 1979 పేజీల నివేదికను సమర్పించింది. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం లేవడంతో వెనక్కితగ్గింది. కానీ వారి ప్రయత్నాలు మరలా 2014 నుండి ముమ్మరం చేశారు. ఈ దాడి ప్రస్తుతం బహుముఖంగా ఉంది. భారతదేశం పేరుపై వివాదం సృష్టించడం వంటి చులకనైన వాదనల నుంచి పీఠికలో లౌకికవాదం, సామ్యవాదం పదాలు ఎత్తివేయాలనే దాకా ప్రయత్నాలు సాగుతున్నాయి. మొత్తంగా భారత రాజ్యాంగాన్ని అంతం చేసి దాని స్థానంలో అతి క్రూరమైన అసమానతలకు, వివక్షతలకు ప్రతి రూపమైన మనుధర్మాన్ని ప్రతిష్ఠించాలన్నది వారి ఉబలాటం. ఈ క్రమంలో అడ్డగోలుగా తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలలో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన చట్టాలను రూపొందించి అమలు చేస్తున్నారు. నేడు భారత రాజ్యాంగం ఒక తీవ్రమైన దాడికి గురవుతున్నది. నిలువరించకుంటే పర్యవసానం భయానకంగా ఉంటుంది.

రాజ్యాన్ని నిలదీయాలి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు రాజ్యాంగం గొప్పతనం గురించి, దానిపై జరుగుతున్న దాడి గురించి, ఈ సందర్భంగా న్యాయస్థానాల తీర్పుల గురించి మాత్రమే చర్చించుకుంటే సరిపోదు. ఈ 74 సంవత్సరాల రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న పాలకవర్గాల ప్రయోజనాలు, వాటిని పరిరక్షించుకోవడానికి ఏర్పడిన రాజ్యం గురించి నేడు లోతైన చర్చ జరగాలి. భారత రాజ్యాంగం అమలుకి (26 నవంబర్ 1950) ఒకరోజు ముందు సభలో ప్రసంగిస్తూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ "26 నవంబర్ 1950తో మనం ఓ వైరుధ్య భరిత జీవితంలోకి అడుగు పెడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం, సాంఘిక, ఆర్థిక జీవితంలో అసమానతలు. ఈ క్రమంలో ఒకే వ్యక్తి, ఒకే విలువ అన్న సూత్రాన్ని నిరాకరిస్తూనే ఉన్నాం. ఎంతకాలం మన జీవితాల్లో ఈ వైరుధ్యం కొనసాగుతుంది. సాంఘిక ఆర్థిక జీవితాల్లో ఇంకెంతకాలం మనం సమానత్వాన్ని నిరాకరిస్తూ ఉంటాం. ఇలాగే దీర్ఘకాలం కొనసాగిస్తే మనకి మనమే ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తాం. ఈ వైరుధ్యాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా నిర్మూలించాలి. లేకుంటే ఈ అసమానత్వంతో బాధపడుతున్న వారు ఈ రాజ్యాంగసభ ఎంతో కష్టపడి రూపొందించిన ఈ ప్రజాస్వామ్య రాజ్యాన్ని బద్దలు కొడతారు" అని తీవ్రంగా హెచ్చరించారు. దీన్ని బట్టి రాజ్యాంగం కన్నా రాజ్యంపై చర్చ ప్రజాక్షేత్రంలో కేంద్ర బిందువు కావాలి. ఎందుచేతనంటే మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఏంగెల్స్ "పెట్టుబడిదారుల్లోనే కాదు, ఊగిసలాడే సోషల్ డెమోక్రాటిక్ శక్తుల్లో కూడా రాజ్యాంగాల మీద అమితమైన మూఢభక్తి వ్యక్తం అవుతున్నది" అన్నారు. అది మన దేశంలో కూడా కనబడుతున్నది. రాజ్యం గురించి కారల్‌మార్క్స్ స్పష్టమైన నిర్వచనాన్ని ఏనాడో వెలువరించారు. "రాజ్యం అనేది ఒక వర్గాన్ని మరో వర్గం అణచి వుంచే ఆయుధం తప్ప మరోటి కాదు. ఇది రాచరిక పాలనలో ఎంత నిజమో, ప్రజాతంత్ర గణతంత్ర రాజ్యాల్లో కూడా అంతే నిజం" అని చెబుతూ అమెరికాని ఉదహరిస్తూ అక్కడ "రాజకీయ చట్టా వ్యాపారుల గ్యాంగులు రెండు ఒకరి తర్వాత ఒకరు రాజ్యాధికారానికి రావడం, అత్యంత అవినీతి పద్ధతుల ద్వారా, అత్యంత అవినీతి లక్ష్యాల కోసం దోచుకుంటూనే ఉంటారు." అని చెప్పిన అంశాలు మన దేశానికి కూడా దాదాపుగా సరిపోతాయి. అంతేకాదు రాజ్యం గురించి వివరిస్తూ కారల్ మార్క్స్ "పోలీసు, న్యాయవ్యవస్థ, పరిపాలన వ్యవస్థ వంటివి పౌరసమాజ ప్రతినిధులు కాదు... అవి రాజ్యం ప్రతినిధులు. దాని కర్తవ్యమల్లా పౌర సమాజానికి వ్యతిరేకంగా రాజ్యం కోసం పనిచేయటమే" అంటాడు. "ప్రజాప్రతి నిధులను ఓట్లేసే ప్రజల నుండి వేరు చేయడం ద్వారా రాజ్యం నుండి పౌర సమాజాన్ని వేరు చేయడం జరుగుతుంది. ప్రజా సంబంధాలను నిర్వహించే అధికారం ఉన్న ప్రజా ప్రతినిధులు వాస్తవానికి వేరే ప్రత్యేక (దోపిడీ వర్గాల) ప్రయోజనాల కోసం పనిచేస్తూ ఉంటారు." అన్నారు. మన దేశంలో కూడా రాజ్యం బడా పెట్టుబడిదారుల చేతుల్లో ఉందనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. మన రాజ్యాంగం అమలులోకి వచ్చిన సంవత్సరంలోనే పాలకవర్గాలు సవరించడం ప్రారంభించారు. ఏడేండ్లు గడవకముందే కేరళలో అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని సహించలేక రాజ్యాంగం పేరుచెప్పి కూలదోశారు. తాజాగా ఈబిఎస్ (ఎలక్ట్రోరల్ బాండ్ స్కీమ్) గురించి చెప్పుకోవచ్చు. 2013లో కాంగ్రెస్ నాయకత్వాన ఉన్న యూపీఏ ప్రభుత్వం 'ఎలక్ట్రోరల్ ట్రస్ట్ స్కీమ్' రూపొందించింది. దాని ద్వారా కార్పొరేట్ సంస్థలకి, రాజకీయ పార్టీలకి మధ్య బంధాన్ని కనబడకుండా చేయడానికి ఉద్దేశించబ డింది. ఇప్పుడు బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మరింత పకడ్బందీగా ఈబిఎస్‌ను ప్రారంభించింది. అందుకు విదేశీ నిధుల క్రమబద్ధీకరణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఏ), కంపెనీల చట్టం, ఆర్‌బిఐ చట్టం, ఆదాయపు పన్ను చట్టం, చివరకు ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని కూడా 2017 ఫైనాన్స్ చట్టంలో భాగంగా మార్చి పారేశారు. తాజా లెక్కల ప్రకారం వందల, వేల కోట్ల రూపాయలు ముఖ్యంగా అధికారంలో ఉన్న బీజేపీకి అందుతున్నాయి. దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. తీర్పు ఏ విధంగా ఉంటుందో చూడాలి. ఒక విషయం మాత్రం స్పష్టం. రోజు రోజుకీ బడా పెట్టుబడిదారులు, గుత్త సంస్థలు, విదేశీ కార్పొరేట్ సంస్థలు తమ ప్రయోజనాల నిమిత్తం ప్రత్యేకించి ఈ సంక్షోభ కాలంలో భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఇందుకు మతోన్మాద ఫాసిస్టు పాలన తోడైంది. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగాన్ని రక్షించాలంటే, దానిని మరింత మెరుగుపరుచుకుంటూ ఉదాహరణకి రాజ్యాంగంలో సమ్మె హక్కు వంటి వాటిని ప్రాథమిక హక్కుల్లో చేర్చుకుంటూ ముందుకుపోవాలి. భారత పాలకవర్గాలపైన, వారి రాజ్యంపైన పోరాటం తప్పదు.

(నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం)

2013లో కాంగ్రెస్ నాయకత్వాన ఉన్న యూపీఏ ప్రభుత్వం 'ఎలక్ట్రోరల్ ట్రస్ట్ స్కీమ్' రూపొందించింది. దాని ద్వారా కార్పొరేట్ సంస్థలకి, రాజకీయ పార్టీలకి మధ్య బంధాన్ని కనబడకుండా చేయడానికి ఉద్దేశించబడింది. ఇప్పుడు బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మరింత పకడ్బందీగా ఈబిఎస్‌ను ప్రారంభించింది. అందుకు విదేశీ నిధుల క్రమబద్ధీకరణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఏ), కంపెనీల చట్టం, ఆర్‌బిఐ చట్టం, ఆదాయపు పన్ను చట్టం, చివరకు ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని కూడా 2017 ఫైనాన్స్ చట్టంలో భాగంగా మార్చి పారేశారు. తాజా లెక్కల ప్రకారం వందల, వేల కోట్ల రూపాయలు ముఖ్యంగా అధికారంలో ఉన్న బీజేపీకి అందుతున్నాయి. దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది.



భారత రాజ్యాంగం అమలుకి (26నవంబర్1950) ఒకరోజు ముందు సభలో ప్రసంగిస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ "26 నవంబర్ 1950తో మనం ఓ వైరుధ్య భరిత జీవితంలోకి అడుగు పెడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం, సాంఘిక, ఆర్థిక జీవితంలో అసమానతలు. ఈ క్రమంలో ఒకే వ్యక్తి, ఒకే విలువ అన్న సూత్రాన్ని నిరాకరిస్తూనే ఉన్నాం. ఎంతకాలం మన జీవితాల్లో ఈ వైరుధ్యం కొనసాగుతుంది. సాంఘిక ఆర్థిక జీవితాల్లో ఇంకెంతకాలం మనం సమానత్వాన్ని నిరాకరిస్తూ ఉంటాం. ఇలాగే దీర్ఘకాలం కొనసాగిస్తే మనకి మనమే ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తాం. ఈ వైరుధ్యాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా నిర్మూలించాలి. లేకుంటే ఈ అసమానత్వంతో బాధపడుతున్న వారు ఈ రాజ్యాంగసభ ఎంతో కష్టపడి రూపొందించిన ఈ ప్రజాస్వామ్య రాజ్యాన్ని బద్దలు కొడతారు" అని తీవ్రంగా హెచ్చరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించే వారికే ఓటు

తెలంగాణతో పాటు దేశంలోని ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలన్నీ తమ తమ ఎన్నికల మేనిఫెస్టోలు దాదాపు ప్రకటించాయి. ఓటర్లను ఆకర్షించడానికి కొన్ని తాయిలాలు ప్రకటించాయి. సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ప్రకటించాయి. కానీ వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులను మాత్రం ఈ రాజకీయ పార్టీలు మర్చిపోయాయి. కార్మికుల ఓట్లు అవసరం లేదన్నట్లుగా భావిస్తున్నాయి. దాదాపు రాష్ట్రంలో వీళ్లు 70 లక్షల పైచిలుకు పని చేస్తున్నారు. ఇంకో 70 వేల మంది కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఉంటారు, మరో లక్ష మంది కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో, కార్యాలయాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కంటింజెంట్ ఉద్యోగులు ఉంటారు. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గానీ, తెల్ల రేషన్‌కార్డులు లాంటివి వర్తించవు. కారణం వారిని కేంద్ర ప్రభుత్వ పర్మినెంట్ ఉద్యో గులుగా రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. కానీ వీరు గౌరవ వేతనమే అతి తక్కువ పొందుతున్నారు.



ఎస్ఆర్ఏ ప్రసాద్
9490300867

ఇక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కానీ, కన్సాలిడేటెడ్ (ఏకీకృత) వేతనం మాత్రమే పొందే స్కీంవర్కర్లు లక్ష పైచిలుకు ఉంటారు. వీరికి కనీస వేతనం రూ.26వేలు కావాలని డిమాండ్ చేస్తున్నారు. దాదాపు 70వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కనీస వేతనం, ఇతర డిమాండ్స్ సాధన కోసం 24 రోజుల పాటు సమ్మె చేశారు. మంత్రుల హామీతో సమ్మె విరమించారు. అదేవిధంగా 28వేల మంది ఆశా వర్కర్లు కూడా కనీస వేతనం కావాలని డిమాండ్ చేస్తూ 11 రోజులు పాటు సమ్మె చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన కారణంగా సమ్మె విరమించారు. జిహెచ్‌ఎంసి వర్కర్స్, గ్రామ పంచాయతీ వర్కర్స్, మిషన్ భగీరథ వర్కర్స్ అందరు కనీస వేతనం డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రయోజనం పొందే 73 షెడ్యూల్ ఎంప్లాయి మెంట్స్‌లో పనిచేసే వర్కర్స్ అందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కేంద్ర కార్మిక సంఘాలు సీఐటీయు, హెచ్‌ఎంఎస్, ఐఎన్‌టియుసి లాంటివి ఎంతో కాలంగా ఐక్యంగా, స్వతంత్రంగా అనేక పోరాటాలు, ఆందోళనలు నిర్వహించాయి.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని ప్రకటించడం లేదు. నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులకు ఎంతో నష్టదాయకమని చెబుతూ, ఆందోళనలు నిర్వహించినా కూడా కొన్ని యాజమాన్యాలు అనధికారికంగా అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్స్ కార్మికులకు, ఉద్యోగులకు ఎంతో నష్టదాయకం. నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం, పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు అనుకూలమా! లేక వ్యతిరేకమా! అని తమ మేనిఫెస్టోల్లో స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఉద్యోగులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకుని వచ్చి ఆమోదింపచేసుకున్నది బీజేపీ. ఆ పార్టీ కార్మికులకు, ఉద్యోగులకు పూర్తిగా వ్యతిరేకమని తేలిపోయింది. తెలంగాణలో అధికారంలో ఉన్న ప్రభుత్వం కూడా 2021లో నోటిఫికేషన్ విడుదల చేసిన జీవో నెం.21, 22, 23, 24లను గెజిట్ చేయాల్సిన అవసరం ఉంది. గెజిట్ చేయాలనే డిమాండ్ పైన కార్మిక సంఘాలు అనేక పోరాటాలు, ఆందోళనలు నిర్వహించినా కూడా పాలకుల్లో చలనం లేదు. అని రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు రోజుకు ఏడు గంటల పనిని, వారానికి ఐదురోజుల పనిదినం అమలు చేయాలనే డిమాండ్ ఊసే ఎత్తడం లేదు. కాంట్రాక్ట్ కార్మికులకు అన్ని చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉన్న కాంటాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేసిన వాగ్దానాన్ని అటకెక్కించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన రెండవ పిఆర్‌సి మోసపూరితమైనది. బకాయిపడిన మూడు విడతల కరువు భత్యం ఊసెత్తకుండా ఐదు శాతం తాత్కాలిక భృతి ప్రకటన, రెండో పిఆర్‌సి కమిటీని వేయడమనేది ఆ ఉద్యోగులను మోసం చేయడమే. ఎన్నికల నోటిఫికేషన్ ముందు హడావిడిగా ప్రకటించడం ఓట్ల రాజకీయంలో భాగంగా చిత్తశుద్ధితో వేసిన పిఆర్‌సి కమిటీ కాదని ఇప్పటికే అందరికీ అర్థమైంది. ఈ రెండో పిఆర్‌సి పరిధిలోకి అనేకమంది కార్మికులు ముఖ్యంగా జిహెచ్‌ఎంసి కార్మికులు, గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కాం ట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీసుకొని రావాలనే డిమాండ్ అలాగే ఉండిపోయింది. సమాన పనికి - సమాన వేతనం చెల్లించాలనే డిమాండ్ అలాగే ఉంది.తాము అధికారంలోకి వస్తే ధర్నాలు, ఆందోళనలు చేయాల్సిన అవసరం ఉండదని ధర్నా చౌక్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసింది. ఆ తర్వాత ధర్నా చౌక్‌ను కాపాడుకోవడానికి అనేక పోరాటాలు చేసి కోర్టు ఉత్త ర్వుల ద్వారా ధర్నా చౌక్‌ను తిరిగి సాధించుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఆ తర్వాత రాష్ట్రంలో అనేక మంది కార్మి కులు, ఉద్యోగులు వారి వారి సమస్యలపై అనేక ధర్నా చౌక్‌లో నిర్వహించారు.



అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలు, కార్మికుల కోసం పనిచేసే వామపక్ష పార్టీల గెలుపు బాధ్యత కార్మికుల మీద ఉంది. ఎందుకంటే వామపక్ష పార్టీలే కార్మికుల, ఉద్యోగులకు అన్ని సందర్భా లలో అండగా నిలుస్తున్నాయి. వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తున్న సందర్భాలలో వారితో భుజం కలిపి వారికి ధైర్యాన్ని ఇస్తున్నాయి. వామపక్ష పార్టీలు పోటీ చేస్తున్న అన్నిచోట్ల ఉద్యోగులు, కార్మికులు వారికి మద్దతుగా నిలవాలి. అసెంబ్లీలో వారుంటే ప్రజా సమస్యల పరిష్కారానికి కొట్లాడే విధానాన్ని ప్రజల ముందుంచాలి. లేదంటే ఎప్పటిలాగే మరో ఐదేండ్లు కార్మికులు తిరిగి కష్టాలు అనుభవించాల్సి వస్తుందనే విషయాన్ని అర్థం చేయించాలి.

2022-2023 సంవత్సరాల్లో జరిగిన ఆందోళనలు-సమ్మెలు గతంలో కన్నా అధికంగా జరిగాయి. కార్మికుల అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా పేరుకొనిపోయా యి. రాష్ట్రంలో కార్మికులు ఎంతో అసంతృప్తితో ఉన్నారనడా నికి ఈ సమ్మెలే ఒక నిదర్శనం. ఎన్ని సమ్మెలు జరుగుతున్నా కార్మికులతో చర్చించకుండా, చర్చలు జరుపకుండా, సమస్యలు పరిష్కరించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మొండిగా ప్రవర్తిస్తున్నది. ఉద్యోగులు సమ్మె విరమించండి, సమస్యలు పరిష్కరిద్దాం, చూద్దాం అని చెబుతూ కష్టజీవుల మీద లెక్కలేనితనంతో ప్రవర్తించింది, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. చట్టాలను రూల్స్‌ను కూడా అమలు చేయకుండా నిరంకుశంగా వ్యవహరిస్తూ కార్మికులు పోరాటాలను అణిచివేస్తోంది. దాదాపు 17వేల మంది ఐకెపి వివోఏలు సమ్మె చేశారు. వారికిచ్చిన హామీలు అమలు చేయలేదు. విఆర్ఏల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు పరిష్కరించకుండా ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. నేరుగా (ఎన్ఆర్ఇజిఎస్) పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు పెంచకుండా అలానే ఉంచింది. కాంట్రాక్ట్ ఏఎన్ఎం వర్కర్లు దాదాపు 20 రోజులపాటు సమ్మె చేశారు. ఏ ఒక్క సంస్థలోనూ, స్కీములోనూ పనిచేస్తున్న వర్కర్స్ సమస్యలు పరిష్కరించలేదు. ఈపీఎస్-95 పెన్షన్‌దారులు ఇప్పటికే కనీస వేతనం రూ.9వేలకు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయా పార్టీలకే మా ఓటు అని మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతున్నారు.

ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ట్రేడ్ యూనియన్లన్నీ ఐక్యంగా కలిసి కార్మికుల మేనిఫెస్టోను రూపొందించి పోటీ చేసే రాజకీయ పార్టీలకు అందజేశాయి. వాటిని పెద్ద ఎత్తున ప్రజల్లో, కార్మికుల్లో, కష్టజీవుల్లో ప్రచారంలో పెట్టాలి. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలు, కార్మికుల కోసం పనిచేసే వామపక్ష పార్టీల గెలుపు బాధ్యత కార్మికుల మీద ఉంది. ఎందుకంటే వామపక్ష పార్టీలే కార్మికుల, ఉద్యోగులకు అన్ని సందర్భాలలో అండగా నిలుస్తున్నాయి. వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తున్న సందర్భాలలో వారితో భుజం కలిపి వారికి ధైర్యాన్ని ఇస్తున్నాయి. వామపక్ష పార్టీలు పోటీ చేస్తున్న అన్నిచోట్ల ఉద్యోగులు, కార్మికులు వారికి మద్దతుగా నిలవాలి. అసెంబ్లీలో వారుంటే ప్రజా సమస్యల పరిష్కారానికి కొట్లాడే విధానాన్ని ప్రజల ముందుంచాలి. లేదంటే ఎప్పటిలాగే మరో ఐదేండ్లు కార్మికులు తిరిగి కష్టాలు అనుభవించాల్సి వస్తుందనే విషయాన్ని అర్థం చేయించాలి. మతోన్మాదం పెచ్చుమీరుతున్న తరుణంలో ఈ ఎన్నికలు దేశానికి లౌకిక ప్రజాస్వామ్యాన్ని అందించే దిక్సూచిగా నిలవాలి. ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక పార్టీలను, ప్రభుత్వా లను ఓడించాలి. ఇదే కర్తవ్యంతో ప్రచారం నిర్వహించాలి. కనీస వేతనం రూ.26వేలు ఇచ్చే, కార్మికుల సమస్యలు పరిష్కరించే పార్టీలకే ఓటు వేసి గెలిపించాలి.





దాతరంగఢ్ అమ్రారామ్ సొంతం

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల ప్రచారం ముగియడంతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి అమ్రారామ్ చివరకు సికార్ జిల్లాలోని డాటా అనే చిన్న పట్టణంలో ప్రచారం చేస్తున్నారు. ఆయన పండ్లు, కూరగాయలు అమ్మే వీధికి చేరుకున్నప్పుడు, ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆయన ఎర్రటి తలపాగా, శాలువా ధరించాడు. అమ్రారామ్ విజయాన్ని కాంక్షిస్తూ తరలివచ్చిన ప్రజలకు వెంటనే పండ్లు పంపిణీ చేశారు.

అమ్రారామ్ రెండు మాటలు మాట్లాడాలని వీధి వ్యాపారులు ప్రేమతో డిమాండ్ చేశారు. లేచి నిలబడి మాట్లాడేందుకు వేదిక లేదు. అమ్మకందారులు పండ్లు, ఇతర వస్తువులను ఉంచడానికి బాక్సులను తీసుకువచ్చారు. వాటిపై నుంచి మాట్లాడారు. నీటి కొరత ప్రధాన సమస్య. నీటి ఎద్దడిని తీర్చేందుకు తాను తలపెట్టిన పథకాలను అమ్రారామ్ వివరించారు. ఏడాదిలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి లోపాన్ని వివరించారు. రైతుల కోసం కిసాన్ సభ చేసిన పోరాటాలను వివరిస్తూ ఓట్లు అడగడంతో ప్రసంగం ముగిసింది. అనంతరం నినాదాల హోరుతో అమ్రారామ్‌కు వీడ్కోలు పలికారు.



నాలుగుసార్లు ఎమ్మెల్యేగా అమ్రారామ్ గెలిచారు. 2008లో దాతరంగఢ్‌లో గెలుపొందారు. అంతకు ముందు సికార్‌లోని ధోడ్ నుంచి వరుసగా మూడుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. 2008 నుంచి, ధోడ్ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా మారినప్పటి నుంచి, ఆయన దాతరంగఢ్‌లో పోటీ చేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచారు. 2018లో కాంగ్రెస్ టిక్కెట్‌పై గెలిచిన వీరేంద్ర సింగ్‌కి దాదాపు ఇరవై వేల ఓట్ల తేడా వచ్చింది. వీరేందర్ సింగ్ 920 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి హరీశ్ చంద్ కుమావత్‌పై విజయం సాధించారు.


వీరేంద్ర సింగ్ బీసీసీఐ మాజీ ప్రెసిడెంట్ నారాయణ్ సింగ్ కుమారుడు, ఆయన ఏడుసార్లు దాతరంగఢ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అమ్రారామ్ 2008లో నారాయణ్ సింగ్‌ను ఓడించాడు. 2013లో నారాయణ్‌సింగ్ మళ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2018లో తన కుమారుడిని బరిలోకి దింపాడు. 1952లో జరిగిన మొదటి ఎన్నికలలో ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు భైరన్ సింగ్ షెకావత్ జన్ సంఘ్ టిక్కెట్‌పై గెలిచిన నియోజకవర్గం దాతరంగఢ్. జనసంఘ్ మరోసారి విజయం సాధించింది.



కానీ బీజేపీకి దాతరంగఢ్ ఎప్పుడూ ఓడిపోతూ వస్తుంది. బీజేపీ సీనియర్ నేత హరిశ్‌చంద్ కుమావత్ గత రెండు ఎన్నికల్లో పోటీ ఇచ్చారు. దాతరంగఢ్‌లో భార్యాభర్తలు ఒకరితో ఒకరు పోటీపడడాన్ని కూడా ఆసక్తిగా ఉంది. కాంగ్రెస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే వీరేంద్ర సింగ్ పోటీ చేస్తుండగా, ఆయన భార్య రీటా చౌధురి కూడా జేజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. జిల్లా మాజీ నాయకురాలు రీటా కాంగ్రెస్ టికెట్ పై ఆసక్తి చూపారు. కానీ సచిన్ పైలట్ పట్టుబట్టడంతో వీరేంద్ర సింగ్ స్వయంగా అభ్యర్థి అయ్యాడు. దీంతో రీటా హర్యానాలో ఎన్డీయే భాగస్వామ్య పార్టీ అయిన జేజేపీలో చేరారు. రీటా అభ్యర్థిత్వం కాంగ్రెస్ ఓట్లను చీల్చుతుంది. బీజేపీ తరపున కొత్త గజానంద్ కుమావత్ రంగంలో ఉన్నారు.

రాజస్థాన్‌లో సీపీఐ(ఎం) మెరుగైన ఫలితాలు

రాష్ట్ర కార్యదర్శి అమ్రారామ్



రాజస్థాన్‌లో సీపీఐ(ఎం) మంచి ఫలితాలు సాధిస్తుందని రాష్ట్ర కార్యదర్శి అమ్రారామ్ అన్నారు. "రెండు సిట్టింగ్ స్థానాలతో కలిపి 17 నియోజకవర్గాల్లో సీపీఐ(ఎం) పోటీ చేస్తోంది. సీపీఐ(ఎం) అత్యుత్తమ ప్రదర్శన చేయడం ఖాయం. దాతరంగఢ్‌లో కూడా పరిస్థితి అనుకూలంగా ఉంది. కాంగ్రెస్ ఓట్లు చీలిపోతాయి. బీజేపీ అభ్యర్థికి ఆ నియోజకవర్గం గురించి పెద్దగా పరిచయం లేదు. దాతరంగఢ్‌లో నీటి కొరత తీవ్రంగా ఉంది. కాంగ్రెస్ నియోజకవర్గం అయినప్పటికీ నీటి కొరతను తీర్చేందుకు అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నీటి కొరతతో రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. చాలా మంది రైతులు వ్యవసాయాన్ని వదిలి ఢిల్లీ, ముంబాయి వంటి నగరాలకు కూలీ పనుల కోసం వలస పోయారు. నిరుద్యోగం తాండవిస్తోంది. నియోజకవర్గంలో ఒక్క కళాశాల కూడా లేదు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరు. నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యేపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇది ప్రచార దశలోనే అర్థమైంది. నియోజకవర్గంలోని మొత్తం 277 బూత్‌లలో సీపీఐ(ఎం) కమిటీలు ఉన్నాయి. కిసాన్‌సభ బలంగా ఉండడం కూడా సానుకూల అంశం. రైతాంగానికి నీరందించేందుకు కిసాన్‌సభ గత ఐదేండ్లలో ఎన్నో పోరాటాలు చేసింది.

దీంతో ఎక్కువ మంది రైతులు సీపీఐ(ఎం)కి చేరువయ్యారు" అని అమ్రారామ్ అన్నారు.

నేడు రాజస్థాన్‌లో పోలింగ్



ఎన్నికలకు సర్వం సిద్ధం..

- **పోలింగ్ బూత్‌లకు చేరిన ఈవీఎంలు, సామాగ్రి**
- **చరిత్ర రిపీట్ అవుతుందా..లేక మళ్లీ కాంగ్రెస్ గద్దెనెక్కుతుందా..!**
- **15 వీఐపీ సీట్ల పరిస్థితి ఏమిటి?**

జైపూర్ : రాజస్థాన్‌లో చరిత్ర పునరావతం కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. ఇక్కడ ఓటర్లు ప్రతి ఐదేండ్లకు ఒకసారి కాంగ్రెస్ లేదా బీజేపీని ప్రత్యామ్నాయంగా ఎన్నుకుంటున్నారు. ఈ బీజేపీ విజయం సాధిస్తుందనే ధీమాతో ఉండగా, అధికారాన్ని నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. 200 స్థానాలున్న అసెంబ్లీకి 199 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు అధికారులు తెలిపారు.రాజస్థాన్‌లో పలు స్థానాల్లో పోటీ తీవ్రంగా మారింది. అందరి చూపు అటు ఇటుగా ఉన్న రాష్ట్రంలోని టాప్ సీట్ల గురించి తెలుసుకుందాం

ఝల్రాపటన్: రాజస్థాన్‌లోని అత్యంత కీలకమైన స్థానాల్లో ఒకటి. ఝల్రాపటన్‌లో బీజేపీ సీనియర్ నాయకురాలు, ఆ రాష్ట్ర మాజీ సీఎం వసుంధర రాజే పోటీలో ఉన్నారు. రాజే 2003 నుంచి ఝల్రాపటన్ నిరంతరం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఐదవసారి ఈ స్థానం నుంచే పోటీ చేస్తున్నారు. వసుంధర రాజే ఎన్నికలలో పోటీ చేస్తున్నప్పుడు కాంగ్రెస్ ఎన్నటికీ చొచ్చుకుపోలేని బీజేపీకి బలమైన కోటగా ఝల్రాపటాన్ పరిగణిస్తారు. 2018 అసెంబ్లీ ఎన్నికల గురించి పరిశీలిస్తే.. ఇక్కడ రాజేకు 1,16,484 ఓట్లు వచ్చాయి. అలాగే రాజేపై కాంగ్రెస్ తన అభ్యర్థిగా సొంధియా రాజ్‌పుత్‌తో రాంలాల్ చౌహాన్ (పిడావా)ను బరిలోకి దింపింది. పిడవా ప్రాంతంలో సొంధియా రాజ్‌పుత్ సామాజికవర్గానికి చెందిన మెజారిటీ ఓటర్ల కారణంగా కుల సమీకరణాన్ని పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ రాంలాల్ చౌహాన్‌కు టికెట్ ఇచ్చింది.

సర్దార్‌పురా: రాజస్థాన్‌లోని సర్దార్‌పురా స్థానం రాష్ట్రం వెలుపల కూడా చర్చనీయాంశమైంది, ఎందుకంటే రాష్ట్ర ముఖ్యమంత్రి , కాంగ్రెస్ నాయకుడు అశోక్ గెహ్లాట్ ఇక్కడి నుంచి బరిలో ఉన్నారు. గెహ్లాట్ సర్దార్‌పురా నుంచి ఆరుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. 1977లో తొలిసారి ఇక్కడి నుంచి గెలుపొంది, ఆ తర్వాత 1999, 2003, 2008, 2013, 2018 ఎన్నికల్లో సర్దార్‌పుర నుంచి గెలుపొందారు. గెహ్లాట్ ముందు మహేంద్ర సింగ్ రాథోడ్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది.

టోంక్: రాజస్థాన్‌లోని టోంక్ సీటులో కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్‌పై బీజేపీ అభ్యర్థి అజిత్ సింగ్ మెహతా పోటీలో ఉన్నారు. పైలట్ 2018లో తొలిసారిగా టోంక్ నుంచి పోటీ చేసి ఇక్కడి నుంచి గెలుపొందారు, ఆ తర్వాత పార్టీ ఆయనను రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కూడా చేసింది. అజిత్ సింగ్ మెహతా 2013 నుంచి 2018 వరకు టోంక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. అటువంటి పరిస్థితిలో, టోంక్‌లో మెహతా మరోసారి వికసించవచ్చని బీజేపీ భావిస్తోంది. అయితే 1998, 2003, 2008లో టోంక్ నుంచి కాంగ్రెస్ విజయం సాధించింది.

లక్ష్మణ్‌గఢ్: ఈ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోటసారాపై బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి సుభాష్ మహరియా పోటీ చేస్తున్నారు. దశాబ్దం తర్వాత ఇరువురు నేతలు ముఖాముఖీ కానున్నారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో దోటసార మహరియాను భారీ మెజార్టీతో ఓడించి సీటును నిలబెట్టుకున్నారు. యాదచ్ఛికంగా, ఇద్దరూ ఒకే కమ్యూనిటీ, జాట్‌కు చెందినవారు.సికార్ నుంచి మూడుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన మహరియా 2016లో కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఈ ఏడాది మేలో తిరిగి బీజేపీలోకి వచ్చారు. జాట్‌లు , ముస్లింలు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) విజేంద్ర ఢాకా , ఆర్‌ఎల్‌పీకి చెందిన విజయ్ పాల్ బగారియా కూడా అభ్యర్థులు.

సవాయి మాధోపూర్: సవాయి మాధోపూర్‌లో ముక్కోణపు పోటీ నెలకొంది. ఈ స్థానంలో బీజేపీ సిట్టింగ్ రాజ్యసభ ఎంపీ కిరోరి లాల్ మీనాను పోటీకి దింపింది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన వారికి టికెట్ ఇవ్వడం ద్వారా, 2018లో పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆశా మీనాను కాషాయ పార్టీ టిక్కెట్టు ఆశావహుల నుంచి పక్కన పెట్టింది.అయితే ఈ ఎన్నికల్లో 25 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయిన ఆమె ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే డానిష్ అబ్రార్ బరిలోకి దిగడంతో ఈ స్థానం ముక్కోణపు పోటీకి సిద్ధమైంది. మీనా 2008లో బీజేపీని వీడి 2018లో మళ్లీ బీజేపీలో చేరారు.సవాయి మాధోపూర్ నియోజకవర్గంలో మీనాలు, ముస్లింలు, బనియాలు , బ్రాహ్మణులు ఆధిపత్యం చెలాయించగా, గుర్జర్లు , మాలీలు కూడా ఇక్కడ గణనీయమైన ఉనికిని కలిగి ఉన్నారు. రాజస్థాన్‌లోని శక్తివంతమైన నాయకులలో మీనా ఒకరు, కానీ ఒంటరిగా ఉన్న ఆశా మీనా యొక్క సవాలు అతనికి సమస్యలను సృష్టించవచ్చు.

నాథ్‌ద్వారా: ప్రముఖ మేవార్ రాజు, రాజ్‌పుత్ యోధుడు మహారాణా ప్రతాప్ వారసుడు విశ్వరాజ్ సింగ్ మేవార్‌ను నాథ్‌ద్వారా స్థానంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీపీ జోషిపై బీజేపీ పోటీకి దింపింది. శతాబ్దాల తరబడి మాజీ మేవార్ రాజకుటుంబానికి ప్రజలతో ఉన్న అనుబంధం ,బీజేపీకి ఉన్న ప్రజాదరణ నాథ్‌ద్వారాలో విజయం సాధించేలా చేస్తుంది, ఇది మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న విశ్వరాజ్ సింగ్ మేవార్ ఆశ.సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీపీ జోషి నాథ్‌ద్వారా యొక్క ప్రస్తుత ఎమ్మెల్యే , అసెంబ్లీ స్పీకర్. ఈ స్థానానికి ఆయన ఐదుసార్లు ప్రాతినిధ్యం వహించారు. అయితే, కేంద్రంలోని తమ ప్రభుత్వ పనితీరును ప్రదర్శించడం ద్వారా , ఎన్నికల పోటీని "ప్రైడ్ ఆఫ్ మేవార్" విశ్వరాజ్ సింగ్‌తో ముడిపెట్టడం ద్వారా ఈ స్థానాన్ని గెలుచు కోవాలని బీజేపీ భావిస్తోంది .నాథ్‌ద్వారాలో 2.5 లక్షల మంది ఓటర్లు ఉన్నారు , ఇందులో ప్రధాన భాగం రాజ్‌పుత్‌లు , బ్రాహ్మణులు, తర్వాతి స్థానాల్లో ఓబీసీ, గిరిజన వర్గాల ఓటర్లున్నారు.

జోత్వారా: ఒలంపిక్ పతక విజేత, రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్‌ను బీజేపీ ఝోత్వారా స్థానం నుంచి బరిలోకి దింపింది. జోత్వారా జైపూర్ రూరల్ లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తుంది, ఇక్కడ నుండి రాథోడ్ ఎంపీగా ఉన్నారు. రాజ్యవర్ధన్‌కు ముందు కాంగ్రెస్ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు అభిషేక్ చౌదరి (38)కి టికెట్ ఇచ్చింది.

ప్రస్తుత అసెంబ్లీలో బలాబలాలు..

గత ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు గెలుచుకోగా, బీజేపీ-73, బీఎస్పీ-6, ఆర్‌ఎల్‌పీ-3, ఇండిపెండెంట్-13, సీపీఐ(ఎం)-2, ఆర్‌ఎల్‌డీ-1, భారతీయ గిరిజన పార్టీ రెండు స్థానాల్లో విజయం సాధించాయి

దేశ రక్షణకు పోరాడుదాం

సంపదను అంబానీ, అదానీకి కట్టబెడుతున్న బీజేపీ

- **క్రికెట్ చూసే మోడీకి మణిపూర్ వెళ్లే సమయం లేదా?**
- **ప్రభుత్వరంగ సంస్థలు ప్రయివేటుపరమైతే యువతకు ఉద్యోగాలెలా**
- **సమస్యలు పరిష్కారం కావాలంటే దశరథ్‌ను అసెంబ్లీకి పంపాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణీఅలీ పిలుపు**



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ముషీరాబాద్ నియోజకవర్గంలోని శ్రీకృష్ణ కాలనీ పార్క్ కోసం స్థానిక ప్రజలతో కలిసి సీపీఐ(ఎం) సుదీర్ఘ కాలంగా పోరాటం చేసింది. గూండాల బెదిరింపులను ఎదుర్కొని ఎర్రజెండా అక్కడ ప్రజల కోసం నిలబడింది. భూకబ్జాదారుల నుంచి ఆ పార్క్‌ను కాపాడింది. అది ప్రజలకు చెందేలా కృషి చేసింది. ఆ పార్క్‌ను సుందరంగా అభివృద్ధి చేసింది. అదే తరహాలో దేశాన్ని కాపాడేందుకు ప్రజలంతా ఎర్రజెండాను చేతిలో పట్టుకుని పోరాడాలి.'అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణీఅలీ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎం దశరథ్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం శ్రీకృష్ణ కాలనీలో బహిరంగ సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుభాషిణీఅలీ మాట్లాడుతూ హైదరాబాద్‌లో మతం, కులం, ప్రాంతం అని కాకుండా ప్రజలందరూ కలిసిమెలిసి ఉంటారని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని 1949, నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదించిందని గుర్తు చేశారు. మహిళలు, పురుషులు, పేదలు, సంపన్నులు ఇలా అన్నివర్గాల వారూ రాజ్యాంగం ప్రకారం సమానమేనని అన్నారు. ఆ రాజ్యాంగాన్ని ఆమోదించబోమనీ, మనుస్మృతి తమ రాజ్యాంగమంటూ ఆ సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రకటించిందని గుర్తు చేశారు. దాని ప్రకారం మనుషులంతా సమానం కాదనీ, స్త్రీలకు స్వేచ్ఛగా జీవించే హక్కు లేదని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి మనుస్మృతిని అమలు చేయాలని చూస్తున్నదని విమర్శించారు. దేశంలోని సహజ సంపదను అంబానీ, అదానీకి కట్టబెడుతున్నదని వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, సింగరేణి గనులు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు ఇలా ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తే యువతకు ఉద్యోగాలెలా?వస్తాయని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కూడా కమీషన్ల కోసం మద్దతు ఇస్తున్నాయని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని చెప్పారు.

కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తున్న బీజేపీని ఓడించాలని ఆమె పిలుపునిచ్చారు. కల్వకుంట్ల కవిత ఢిల్లీ వచ్చినపుడు మహిళల సమస్యలపై పోరాడ దామంటూ ప్రకటించారని అన్నారు. ఈడీ నోటీసులు రాగానే బీజేపీ మీద పోరాటాన్ని ఆమె మర్చిపోయారని చెప్పారు. క్రికెట్ మ్యాచ్ చూసే తీరిక ఉన్న ప్రధాని మోడీకి మణిపూర్ వెళ్లి మహిళల బాధను వినడానికి సమయం లేదా?అని ప్రశ్నించారు. ఇప్పుడు రాజకీయ పార్టీలు వాషింగ్ మెషిన్‌లాగా తయారయ్యాయని అన్నారు.

బీజేపీలో టికెట్ రాని వారు కాంగ్రెస్‌లోకి, అక్కడ టికెట్ రాని వారు బీఆర్‌ఎస్‌లోకి వెళ్తున్నారని వివరించారు. వారు వాషింగ్‌మెషిన్‌లోకి వెళ్లి వారి మరకలను శుద్ధి చేసుకుని మంచివారిలా మారుతున్నట్టు కనిపిస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో డబ్బు పంచి గెలవాలని చూస్తున్నారని అన్నారు. గెలిచాక ఖర్చు చేసిన దానికంటే ఎక్కువ సంపాదించే దానిపైనే దృష్టిపెడతారని చెప్పారు. డబ్బు సంపాదించే లక్ష్యంతో ఉండే వారు సమస్యల పరిష్కారం కోసం ఎందుకు పనిచేస్తారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే నిజాయితీగా పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థి ఎం దశరథ్‌ను గెలిపించాలనీ, అసెంబ్లీకి పంపించాలని ఆమె కోరారు.

ప్రభుత్వాలను ప్రశ్నించాలంటే సీపీఐ(ఎం)ను గెలిపించాలి : డిజి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించాలంటే సీపీఐ(ఎం) అభ్యర్థులు గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ, ఎంఐఎంను ఓడించాలని పిలుపునిచ్చారు.

లౌకిక పార్టీలను గెలిపిస్తేనే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ముషీరాబాద్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎం దశరథ్ మాట్లాడుతూ అభివృద్ధి చేయని ముఠా గోపాల్‌కు మళ్లీ ఓటెందుకెయ్యాలని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్, బీజేపీ ఏనాడూ పనిచేయలేదని విమర్శించారు. సీపీఐ(ఎం)కు అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. సీపీఐ(ఎం) నాయకులు ఏఏకే పాషా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణజ్యోతి, నగర కార్యదర్శివర్గ సభ్యులు కె నాగలక్ష్మి, నగర కమిటీ సభ్యులు పద్మ, నాయకులు కృష్ణస్వామి, శ్రీకృష్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి మహమూద్‌అలీ, హైకోర్టు న్యాయవాది అతుల్ అగర్వాల్, స్థానిక నాయకులు రఫత్ అంజన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట కేతనం రైతు సంఘం

ఉద్యమాల ఫలితంగానే ఆత్మహత్యలను గుర్తించిన సర్కారు

- **అన్నదాత మరణిస్తే ఐదు లక్షలు**
- **కొత్త భూసేకరణ చట్టం వెనక్కి...**



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అన్నదాతలకు రైతు సంఘమే అండదండ. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలోనూ దారి తప్పిన సర్కారును పోరాటాలతో దారికి తెచ్చింది రైతు పోరాటమే. ప్రత్యేక రాష్ట్రంలోనూ రైతన్నల ఆత్మహత్యలు ఆగలేదు. రైతు ఆత్మహత్యలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం హేళన చేస్తూ మాట్లాడింది. రైతులు తాగి చనిపోతున్నారు. భార్యాభర్తలు కొట్లాడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటూ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేసింది. కనీసం రైతుల ఆత్మహత్యలను గుర్తించడానికి సిద్ధపడలేదు. ఈ నేపథ్యంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయి. ఆయా జిల్లాల్లో రైతులను పెద్ద ఎత్తున సమీకరించి రోడ్డమీదికి వచ్చింది. రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వ విధానాలే కారణమంటూ నిలదీసింది.ఆ ఉద్యమం గల్లీ నుంచి ఢిల్లీవరకు కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో ఒకొక్క మెట్టు దిగి వచ్చింది. దీంతోపాటు రైతులకు పెట్టుబడి సాయం కూడా ఇస్తున్నది. రైతు బంధు పథకం తెచ్చినప్పటికీ రైతు ఆత్మహత్యలను గుర్తిస్తున్నట్టు ప్రకటించింది. ఎలాంటి మరణం సంభవించినా రూ 5 లక్షల బీమా ఇస్తామని హామీ ఇచ్చింది. అయినప్పటికీ ఇంకా రైతు ఆత్మహత్యలు ఆగడం లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రైతు ఆత్మహత్యల నివారణకు సరైన ప్రణాళికలు రచించడం లేదు. అది అన్నదాతను అన్ని విధాల ఆదుకోలేకపోతున్నదనే విమర్శలున్నాయి. ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీతో కూడిన ఉపకరణాలు ఇవ్వడంలేదు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు నిలిపేసింది. ఈ చెయ్యి తో ఇచ్చిన ఆ చెయ్యితో గుంజుకున్నట్టు రైతు బంధు జమ చేస్తూనే.....సబ్సిడీ మార్గాలను మూసేసింది. దీంతో రైతు కష్టాలు యాడేసిన గొంగడి ఆడనే అన్నట్టు తయారైంది. ఇప్పటికీ కౌలు రైతులను గుర్తించడం లేదు. రైతు



ఆత్మహత్యల్లో అత్యధికంగా కౌలు రైతులవే. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రైతుల చట్టం 2011ను అమలు చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. ఆ చట్టం ప్రకారం కౌలు రైతులకు రుణార్హత కార్డు ఇవ్వడం ద్వారా బ్యాంకుల్లో రుణాలు అందుతాయి. సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అందుతాయి. కానీ ప్రభుత్వం వారికి గుర్తించకుండా మొండికేస్తున్నది. పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలంటూ రైతు సంఘంతోపాటు ఇతర ప్రజాసంఘాలతో కలిసి దశలవారీగా పోరాటాలు నిర్వహించింది. ఈ క్రమంలో ప్రభుత్వం రైతు నాయకులపై కేసులు, పీడీయాక్టులు మోపింది. జైళ్లకు పంపించింది. అయినా మొక్కవోని ధైర్యంతో నిరంతరం పోరాటాలు నిర్వహించింది రైతు సంఘం. ఈ పోరాట ఫలితంగా 4.2 లక్షల మంది రైతులకు సర్కారు పోడు పట్టాలను పంపిణీ చేసింది. మరో ఏడున్నర లక్షల మంది రైతులకు పట్టాలు అందాల్సి ఉన్నది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కొనేందుకు సర్కారు వెనుకడుగేసింది. కొనుగోలు కేంద్రాలు పెంచాలంటూ రైతు సంఘం వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి విజయం సాధించింది. ప్రాజెక్టులు, పరిశ్రమలు, రహదారులు, ప్రభుత్వం భవనాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున భూసేకరణకు శ్రీకారం చుట్టింది. కానీ భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల బాధలు పట్టించుకోలేదు. వారికి భూసేకరణ చట్టం -2013 అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం ద్వారా రైతులకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నది. పరిహారం కూడా తక్కువగా వచ్చే విధంగా ఉన్నది. దీనిపై రైతు సంఘం సమరశీల పోరాటం నిర్వహించింది. ముఖ్యంగా మల్లన్న సాగర్, కొండ పోచమ్మ రిజర్వాయర్ల కింద భూమి కోల్పోతున్న నిర్వాసితులకు అండగా నిలబడింది. ఆ పోరాటం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఉధృతమై సర్కారును ఉక్కిరిబిక్కిరి చేసింది. చివరికి ప్రభుత్వం రైతులపై కాల్పులకు తెగబడింది.అన్నదాతల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. దీంతో దిగొచ్చిన సర్కారు భూసేకరణ చట్టం 2013 ప్రకారం పరిహారం ఇస్తామని ఒప్పుకుంది. అధిక వర్షాలు, అకాల వర్షాలు, కరువు పరిస్థితులకు ప్రతియేటా పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. అడవి పందులు, కోతులు, నెమళ్ల కూడా పంటలను నాశనం చేస్తున్నాయి. తూ తూ మంత్రంగా పంట నష్టం లెక్కలేసి పరిహారం సరిగా ఇవ్వడం లేదు. ఇప్పటికే 5 నుంచి 8 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. దీనిపై రైతు సంఘం అనేక పోరాటాలు నిర్వహించింది. అయినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. పంట బీమా, రైతుకు భరోసా లేదని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ తెలిపారు.



నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 61,970	-	---
22 క్యారెట్లు	- 56,800	-	---
కిలో వెండి	- 79,200	-	---



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 82
రిటైల్ (లైవ్)	రూ. 104
స్కిన్‌తో	రూ. 151
స్కిన్‌లెస్	రూ. 172

బిజినెస్

ఇల్లు కొనేవారికి కొత్త పథకం తెస్తాం


- నికరంగా ఆరున్నరేండ్లే పాలించాం
- తెలంగాణ కోసం చచ్చేంతా మమకారం : క్రెడాయ్ సమావేశంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ - బిజినెస్ బ్యూరో

కొత్తగా ఇల్లు కొనుగోలు చేయాలనుకుంటున్న మధ్యతరగతి ప్రజల కోసం త్వరలో కొత్త పథకం తీసుకు వస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. దీనిపై సీఎం కేసీఆర్ ఆలోచన చేస్తున్నారన్నారు. రుణం తీసుకుని ఇల్లు కొనే మధ్యతరగతి వారికోసం ప్రభుత్వం కొత్త పథకం తేవాలనుకుంటుందన్నారు. శుక్రవారం నగరంలోని హెచ్‌ఐసిసిలో క్రెడాయ్ నిర్వహించిన రియల్ ఎస్టేట్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ.. నగరం అభివృద్ధికి తాము అనేక ప్రణాళికలు కలిగి ఉన్నామన్నారు. గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో కరోనా, ఎన్నికల వల్ల ఆరున్నరేళు మాత్రమే నికరంగా పరిపాలించామని తెలిపారు. రెండేళ్లు కరోనాకే పోయిందన్నారు. సినీనటుడు రజనీ కాంత్‌కి కూడా హైదరాబాద్‌లో మార్పు అర్థమైందని.. కానీ ఇక్కడున్న గజినీలకు అర్థం కాలేదన్నారు. ఏపీ నుంచి వేరుపడినప్పుడు అనేక అనుమానాలు నెలకొనగా.. ప్రస్తుతం దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందన్నారు. మాది 6.5 ఏండ్లయితే.. వారిది 65 ఏండ్ల పాలన అని ప్రతిపక్షాలను ఉద్దేశించి అన్నారు. ఈ తక్కువ సమయం లో ప్రజల కనీస అవసరాలు అన్ని తీర్చగలిగామన్నారు. గడిచిన 25 ఏళ్లలో ఏళ్లలో తెలంగాణ ప్రాంతంపై ప్రభావం చూపిన నేతలు చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, కెసిఆర్ మాత్రమేనన్నారు. చంద్రబాబు ఐటి వృద్ధికి పాటు పడితే, రాజశేఖర్ రెడ్డి పేదల కోసం పని చేయగా.. కానీ కేసీఆర్ హయాంలో ఐటి సహా పేదల వరకు అన్ని రంగాల వృద్ధి జరిగిందన్నారు. టిఎస్ ఐపాస్‌తో 27000 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రతి పక్షాలకు మమ్మల్ని తిట్టేందుకు ప్రజా సమస్యలు లేవని.. అందుకే మాకు అహంకారం అని తిడుతున్నారని పేర్కొన్నారు. మాకుంది అహంకారం కాదని ... తెలంగాణ కోసం చచ్చేంత మమకారమన్నారు. 3వ తేదీన తామే విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వేయాలని కెటిఆర్ కోరారు. 2047 నాటికి ఏపీ, తెలంగాణ, హిందూ, ముస్లిం లాంటి బేధాలు లేకుండా సమగ్ర వృద్ధి ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఐషర్ నుంచి నాన్ స్టాప్ సిరీస్‌లో కొత్త ట్రక్కులు



న్యూఢిల్లీ: విఇ కమర్షియల్ వెహికల్స్ లిమిటెడ్ యొక్క వ్యాపార విభాగంమైన ఐషర్ ట్రక్స్ అండ్ బసెస్ కొత్తగా నాన్ స్టాప్ సిరీస్‌లో కొత్త ట్రక్కులను విడుదల చేసింది. మెరుగైన పనితీరుతో నాలుగు కొత్త హెవీ డ్యూటీ ట్రక్కులను ఆవిష్కరించినట్లు విఇసివి ఎండి, సిఇఒ వినోద్ అగర్వాల్ తెలిపారు. ఈ నాన్ స్టాప్ సిరీస్ శక్తివంతమైన, ఇంధన సమర్థవంతమైన ఇంజిన్‌లను కలిగి ఉన్నాయన్నారు. వీటిలో ఐషర్ ప్రో 6019ఎక్స్‌పిటి , టిప్పర్ ఐషర్ ప్రో 6048ఎక్స్‌పి, హాలేజ్ ట్రక్ ఐషర్ ప్రో 6055ఎక్స్‌పి, ఐషర్ ప్రో 6055ఎక్స్‌పి 4X2 మోడళ్లున్నాయని పేర్కొన్నారు.

గుజరాత్‌లో దళితుడికి అవమానం

- పాదరక్షను నోటిలో పెట్టుకొని క్షమాపణలు చెప్పాలని బలవంతం
- వ్యాపారస్తురాలిపై కేసు నమోదు

గాంధీనగర్ : గుజరాత్‌లో దళితుడికి అవమానకర ఘటన ఎదురైంది. ఆయనపై ఒక వ్యాపారస్తురాలు, ఆమె ఉద్యోగులు అమానవీయంగా ప్రవర్తించారు. బాధితుడిపై దాడికి దిగి ఆయన నోటిలో ఆమె పాదరక్షను పెట్టి, క్షమాపణలు చెప్పించేందుకు బలవంతం చేశారు. దీంతో పోలీసులు సదరు వ్యాపారస్తురాలిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మోర్బీ పట్టణంలో చోటు చేసుకున్నది. నిందితురాలిని విభుతి పటేల్ అలియాస్ రనీబాగా గుర్తించారు. ఆమె రనీబా ఇండస్ట్రీస్ ప్రయివేట్ లిమిటెడ్‌ను నడుపుతున్నది. పోలీసులు, బాధితుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నీలేశ్ దల్సానియా (21).. విభుతి పటేల్‌కు చెందిన ఎక్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో అక్టోబర్ నెలలో 16 రోజులు పని చేశాడు. అక్టోబర్ 2న కంపెనీలో చేరిన దల్సానియాకు నెలకు రూ.12 వేల జీతం కుదిరింది. అయితే, 18న మాత్రం ఆయనను ఇక పనికి రావద్దని కంపెనీ తెలిపింది. అకస్మాత్తుగా ఇలా చెప్పటంతో దల్సానియా షాక్‌కు గురయ్యాడు.

ఆ తర్వాత తన పెద్దన్న మెహుల్, వారి పొరుగున ఉండే వ్యక్తి భవేశ్ మక్వానాతో కలిసి రవాపార్ రోడ్ మీద ఉండే రనీబా ఇండస్ట్రీస్ కార్యాలయానికి వెళ్లారు. తాను పని చేసిన రోజులకు రావాల్సిన జీతాన్ని దల్సానియా డిమాండ్ చేశాడు. అయితే, విభుతి పటేల్ సోదరుడు ఓమ్ పటేల్.. దల్సానియాపై దాడికి దిగాడు. విభుతి పటేల్‌తో పాటు మరో ఐదుగురు ఉద్యోగులు కూడా బాధితుడిని కొట్టారు. ఆఫీసు బిల్డింగ్ మీదకు తీసుకెళ్లి బెల్టుతో దల్సానియాను కొట్టారు. ఇష్టం వచ్చినట్టు తన్నారు. పిడిగుద్దులు గుద్దారు. విభుతి పటేల్ పాదరక్షను నోటిలో పెట్టుకొని క్షమాపణ చెప్పాలని వారు దల్సానియాను బలవంతం చేశారు. రవాపూర్ రోడ్డు మీద కనబడినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా దల్సానియాను చంపేస్తానని నిందితురాలు హెచ్చరించింది. అయితే, ఈ ఘటనపై ఫిర్యాదు అందటంతో పోలీసులు నిందితురాలిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా, ఈ ఘటనను దళిత సంఘాలు తీవ్రంగా ఖండించాయి. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశాయి.

అప్పుచేసి పప్పుకూడు

రికార్డు స్థాయిలో పెరిగిన క్రెడిట్‌కార్డుల వినియోగం

ఒక్క నెలలో రూ.1.78 లక్షల కోట్ల వ్యయం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అప్పుచేసి పప్పుకూడు తినడమంటే ఇదే...ప్రధాని మోడీ హయాంలో ప్రజల ఆర్థిక స్థితి ఏ స్థాయికి దిగజారిందో అక్టోబర్ నెలలో తేలిపోయింది. వరుస పండుగలు, పెరిగిన ఖర్చులతో సతమతమైన ప్రజలు చేతిలో నగదు లేకపోవడంతో భారీగా క్రెడిట్ కార్డుల్ని వినియోగించారు. ఆ ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా రూ.1.78 లక్షల కోట్ల మేరకు క్రెడిట్ కార్డు లావాదేవీలు జరిగాయి. ఈ తరహా క్రెడిట్ కార్డుల వినియోగం గతంలో ఎన్నడూ లేదని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లో పొదుపు లక్ష్యాలు గణనీయంగా తగ్గిపోయాయని గతంలో రిజర్వుబ్యాంకు చెప్పిన విషయం తెలిసిందే. దీనికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు, ద్రవ్యోల్బణం, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు వంటివి ప్రధాన కారణమని ఆర్థికరంగ నిపుణులు చెప్తున్నారు. తాజాగా పొదుపు సంగతి దేవుడెరుగు...ఇప్పుడు ప్రజల వ్యక్తిగత అప్పులు భారీగా పెరుగుతున్నాయి. ఇది దేశ ఆర్థిక వ్యవస్థను మరింత ఆందోళనకు గురిచేస్తున్నది. దేశంలో ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో రూ.1.42 లక్షల కోట్ల క్రెడిట్ కార్డు లావాదేవీలు జరగ్గా, అక్టోబర్‌లో ఈ లావాదేవీలు రికార్డు స్థాయిలో రూ.1.78 లక్షల కోట్లకు చేరాయి. సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో క్రెడిట్ కార్డుల వినియోగం 25.35 శాతం పెరిగినట్టు రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా తెలిపింది. ప్రజల్ని ఆకర్షించేందుకు ఈ-కామర్స్ ప్లాట్‌ఫారాలు 'పాయింట్ ఆఫ్ సేల్' (పీఓఎస్) పేరుతో రకరకాల డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటించాయి. దీనికి ఆకర్షితులైన ప్రజలు తమ చేతిలో నగదు లేకున్నా, క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు చేసి, ఆయా ఉత్పత్తులను కొనుగోలు చేసినట్టు ఈ-కామర్స్ లావాదేవీలు పరిశీలిస్తే తెలుస్తున్నది. రిజర్వుబ్యాంకు చెప్పిన లెక్కల ప్రకారం క్రెడిట్ కార్డు ద్వారా పీఓఎస్ లావాదేవీలు అక్టోబరు నెలలో రూ.57,774 కోట్లు జరగ్గా, ఈ-కామర్స్ ప్లాట్‌ఫారాల ద్వారా రూ.1,20,794 కోట్ల చెల్లింపులు జరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్‌కార్డుల వినియోగదారులు ఎక్కువగా వీటిని వినియోగించారు. ఈ బ్యాంకు క్రెడిట్ కార్డుల ద్వారా రూ.45,173 కోట్లు విలువైన ఆర్థిక లావాదేవీలు జరిగాయి. ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.34,158 కోట్లు, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.21,729 కోట్ల లావాదేవీలు జరిగాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) క్రెడిట్ కార్డుల ద్వారా రూ.35,406 కోట్ల రికార్డు స్థాయి లావాదేవీలు జరిగాయి. అదే సమయంలో దేశంలోని బ్యాంకులు, రుణ సంస్థలు ఈ ఏడాది అక్టోబర్ నాటికి కొత్తగా 17 లక్షల కొత్త క్రెడిట్ కార్డుల్ని జారీ చేశాయి. దీనితో దేశవ్యాప్తంగా మొత్తం క్రెడిట్ కార్డుల సంఖ్య 9.48 కోట్లకు చేరినట్టు రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. బ్యాంకుల వారీగా అక్టోబరు నాటికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డులు 1.91 కోట్లకు, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులు 1.87 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డులు 1.6 కోట్లు, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులు 1.3 కోట్లకు చేరాయి. అయితే ఇటీవల రిజర్వుబ్యాంకు హామీలేని రుణాల నిబంధనల్ని కఠినతరం చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రభావం క్రెడిట్ కార్డుల రుణ చెల్లింపులపై పడే అవకాశం ఉన్నదనీ, ప్రజల్లో చేసిన అప్పులు తిరిగి చెల్లించే ఆర్థిక స్థోమత నెమ్మదించే అవకాశం ఉన్నదని ఆర్థికరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రధాన రాజకీయ పార్టీలకు

మహిళల సమస్యలు పట్టవా..?

ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి



నవతెలంగాణ-భువనగిరి

ప్రధాన రాజకీయ పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు మహిళల సమస్యలు పట్టవా అని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి ప్రశ్నించారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని దుంపల మల్లారెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన ఐద్వా జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గంలో మూసీ నది జల కాలుష్యంతో మహిళలకు అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని, చర్మ, గర్భ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ దారిన పడుతున్నారన్నారు. రెండుసార్లు గెలిచిన బీఆర్ఎస్ ఇంతవరకు మూసీ ప్రక్షాళన గురించి పట్టించుకోవడంలేదని విమర్శించారు. మూసీ ప్రక్షాళన కోసం సీపీఐ(ఎం) అనేక సార్లు పాదయాత్రల తో సహా అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తామని చెప్పి, నేటికే హామీని నెరవేర్చలేదని తెలిపారు. పైగా బ్యాంకు ద్వారా రుణాలు పొందాలంటే డ్వాక్రా మహిళలకు బ్యాంకు డిపాజిట్ లక్ష రూపాయలు ఉండాలని షరతులు పెడుతున్నారని విమర్శించారు. భువనగిరి జిల్లా కేంద్రంలో నేటికీ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలు లేవన్నారు. జిల్లా కేంద్రంలోని ఏరియా స్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మారుస్తామని నేటికీ అమలు చేయలేదని తెలిపారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై అనేక రకాల దాడులు, హత్యలు, లైంగికదాడులు పెరిగాయన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తీసుకు వస్తున్నారన్నారు. సీపీఐ(ఎం) అభ్యర్థిగా నిలబడిన కొండమడుగు నర్సింహ.. ఉపాధి పనుల్లో మహిళలకు కూలి రేట్లు పెంచాలని అనేక పోరాటాలు చేశారన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేసేటువంటి వ్యక్తి కొండమడుగు నర్సింహను బలపరచాలని కోరారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, జిల్లా ఉపాధ్యక్షులు కొండమడుగు నాగమణి, జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి, నాయకులు మాటూరి కవిత, భాగ్య, కొత్త లలిత, వడ్డెబోయిన స్వప్న, సింగన బోయిన లావణ్య, జయమ్మ, లక్ష్మమ్మ, తాడూరి, కలమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంపై అమిత్‌షా ఆరా

- ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి: జి. ప్రేమేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో జరుగుతున్న బీజేపీ ఎన్నికల ప్రచారంపై అమిత్‌షా ఆరా తీశారనీ, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని నాయకత్వానికి సూచించారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్నికల పరిస్థితులపై సమీక్షించారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి మంచి అవకాశాలున్నాయని ఆయన చెప్పారని పేర్కొన్నారు. అమిత్‌షా 25, 26, 27 రోజుల్లో అమిత్‌షా విస్తృతంగా ప్రచారం చేస్తారని తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్‌జవదేకర్, జాతీయ ప్రధాన కార్యదర్శులు తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బంగారు శృతి, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కేసీఆర్ కృషి

చేవెళ్లలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో హోంశాఖ మంత్రి మహమ్మద్ అలీ



నవతెలంగాణ-చేవెళ్ల

ముస్లింల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నారని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ముస్లిం సోదరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రి మహమూద్ అలీ, చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య, చేవెళ్ల ఎన్నికల ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిహాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. 'చేవెళ్ల అన్న కోసం వచ్చిన.. కాలా రహేతో.. క్యాహై.. దిల్ వాలే హయే..(నల్ల గుంటే ఏంది మనసున్న మనిషి యాదన్న)' అని అన్నారు. దేశంలో ఎవరూ చేయని పనులకు సీఎం కేసీఆర్ చేస్తున్నారన్నారు. మైనార్టీలకు కాంగ్రెస్ రూ.933 కోట్లు ఇస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో రూ.12000 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. మైనార్టీలకు స్కూల్స్, కాలేజీలు, గురుకులాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విదేశీ చదువుల కోసం వందల కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. షాదీ ముబారక్ కోసం రూ. 2300 కోట్లు ఇచ్చినట్టు వివరించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది మైనార్టీలు ఉన్నారని గుర్తు చేశారు. కుల మతాలకతీతంగా మానవత్వం, సమన్వయంతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. తనను మరోసారి గెలిపించాలని కోరారు. చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి, జడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ మందుపాతర పేలుడు

- ఇద్దరు కార్మికులు మృతి.. ఒకరికి గాయాలు
- మావోయిస్టు ప్రభావిత నారాయణపూర్‌లో ఘటన

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలోని ఇనుప ఖనిజం గని వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతర (ఐఈడీ) పేలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. ఈ విషయాన్ని పోలీసులు తెలిపారు. రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు 350 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఛోటే డోంగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండపై ఉన్న ఆమ్‌దై ఘాటి ఇనుప ఖనిజం గనిలో ముగ్గురు కార్మికులు పని కోసం ఉదయం 7.30 గంటలకు వెళ్లిన సమయంలో ఈ సంఘటన జరిగిందని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. జయస్వాల్ నెకో ఇండస్ట్రీస్ లిమిటెడ్ (జేఎన్‌ఐఎల్)కు ఆమ్‌దై ఘాటిలోని ఇనుప ఖనిజం గనిని కేటాయించారు. మావోయిస్టులు చాలా కాలంగా ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు. కాగా, మృతులు నారాయణపూర్ జిల్లాకు చెందిన రితేష్ గగ్డా (21), శ్రవణ్ గగ్డా (24)గా గుర్తించారు. గాయపడిన ఉమేష్ రాణా అనే కార్మికుడిని స్థానిక ఆస్పత్రిలో చేర్చినట్టు పోలీసులు తెలిపారు. భద్రతా సిబ్బందితో ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగించినట్టు అధికారులు తెలిపారు.

ఆ నలుగురి చేతిలోనే రాష్ట్రం

- నిజాం రాజు మాదిరి కేసీఆర్ పాలన
- ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం : ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ జయరాం రమేష్



నవతెలంగాణ-మునుగోడు

పదేండ్ల తెలంగాణ పాలన తండ్రి, కొడుకు, కూతురు, అల్లుడు.. ఆ నలుగురి చేతిలోకి నలిగి పోయిం దని, అప్పటి ఏడవ నిజాం వెళ్లి పోయినా.. ఇప్పుడు కేసీఆర్ ఎనిమిదో నిజాం లాగా తయారయ్యాడని ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేంద్ర మాజీమంత్రి జయరాం రమేష్ విమర్శించారు. పదేండ్లుగా అధికారం చేతిలో ఉందని ఫామ్‌హౌస్‌లో పండుకొని నిజం రాజులాగా వ్యవహరిస్తున్నారన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో 405 కిలోమీటర్లు రాహుల్ గాంధీ జోడోయాత్ర నిర్వహించిన తర్వాత కొత్త కాంగ్రెస్ కొత్త రాహుల్ గాంధీ కనిపిస్తున్నారని, ప్రజలు కూడా కాంగ్రెస్ వైపు వస్తున్నారని తెలిపారు. పార్టీ తీసుకొస్తున్న ఆరు గ్యారంటీ పథకాలు.. మహాలక్ష్మి రైతు భరోసా, జీవన్ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, వికాసం, చేయూత పథకాలు రాష్ట్రంలోని ప్రతి ఇంటికి వెళ్లాయని, ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంవత్సరంలోపు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని భరోసా ఇచ్చారు. కేసీఆర్, నరేంద్ర మోడీ ఇద్దరూ ఒక్కటే అని, వారిని ఓడించేందుకు ప్రజలు కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఏఐసీసీ అధికార ప్రతినిధి గౌతమ్, రాష్ట్ర నాయకులు నారబోయిన రవి ముదిరాజ్, వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

- కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి..
- పోలీసులకు అప్పగింత



నవతెలంగాణ-ఆర్మూర్

విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తించగా దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పెర్కిట్ ఉర్దూ మీడియం పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెర్కిట్‌లోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఇబ్రహీం అనే ఉపాధ్యాయుడు కొన్ని రోజుల నుంచి విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. గతంలో ఇలాంటి ఘటన వెలుగు చూసినా ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మాట్లాడుతూ.. అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయునిపై 15 రోజుల కింద హెడ్మాస్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినులు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం పాఠశాలకు వచ్చి కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ సుల్తానా మాట్లాడుతూ రెండు రోజుల కిందనే తమ దృష్టికి వచ్చిందని, అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయమై మండల విద్యాధికారి రాజా గంగారం మాట్లాడుతూ.. బాధితుల వివరాలను తీసుకొని సంబంధిత ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఎన్నికల తనిఖీల్లో.. రూ.79 లక్షల నగదు పట్టివేత



నవతెలంగాణ-తాండూరు/కందుకూరు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని బషీరాబాద్, కందుకూరు మండలాల్లో భారీగా డబ్బు పట్టుబడింది. బషీరాబాద్‌లో రూ. 44 లక్షలు, కందుకూరులో రూ. 35లక్షలను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా బషీరాబాద్‌లో గురువారం అర్ధరాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా.. రైల్వే గేట్ సమీపంలో ఓ పత్రికా విలేకరి శెట్టి రవిశంకర్ వద్ద రూ. 44,84,500 పట్టుకున్నారు. ఆ డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో వాటిని సీజ్ చేశారు. కాగా, విలేకరి వద్ద డబ్బు దొరకడం తీవ్ర చర్చనీయాంశమైంది. విలేఖరి దగ్గర దొరికిన డబ్బులు కాంగ్రెస్‌కి చెందిన బియ్యాని మనోహర్‌రెడ్డివి అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం అవుతోంది. డబ్బును సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేసినట్టు బషీరాబాద్ ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.కందుకూరు- మీర్‌ఖాన్‌పేట మధ్య ఫార్మా రోడ్డులో ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు తనిఖీలు నిర్వహించగా.. ఓ కారులో తరలిస్తున్న రూ. 35 లక్షలు డబ్బును పట్టుకున్నారు. కారులో డబ్బులు తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టగా.. కారు తప్పించు కుంది. దాంతో దాన్ని వెంబడించి పట్టుకొని నగదును సీజ్ చేశారు. డబ్బు తరలిస్తున్న రెడ్డి యాదగిరి రెడ్డి, సభావత్ బిచ్యా నాయక్, యాట నరసింహను అదుపులోని తీసుకున్నారు. వారిని విచారించగా డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపలేదని సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. అయితే కారులో కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి సంబంధించిన కరపత్రాలు ఉండటంతో ఆ డబ్బులు అతనికి సంబంధించినవిగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాజ్యాంగ సంస్థల ధ్వంసమే బీజేపీ లక్ష్యం

కేసీఆర్ పాలనలో పెరిగిన నిరుద్యోగం: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



నవతెలంగాణ- ఖమ్మం

మోడీ పాలన నేరాలోచనతో సాగుతున్నదని, ప్రత్యర్థులను ఇబ్బందులు పెట్టడం, రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా పరిపాలిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆరోపించారు. శుక్రవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించడమే లక్ష్యంగా సీపీఐ పనిచేస్తోందన్నారు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్నామని, ఆ క్రమంలోనే ఒక్క స్థానానికే పరిమితమై కాంగ్రెస్‌తో ఎన్నికల ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ఒక్క ఓటుతో తెలంగాణ ప్రజలు మూడు పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం లోపాయకారి ఒప్పందాలతో పనిచేస్తున్నాయని, అందుకే ఎంఐఎం రాజాసింగ్‌పై పోటీ పెట్టలేదని తెలిపారు. ఒకప్పుడు సీఎం బీజేపీకి వ్యతిరేకంగా పనిచేశారని, ఆ క్రమంలోనే మునుగోడులో మద్దతు ఇచ్చామని, కానీ కూతురు లిక్కర్ కేసులో ఉన్న తరువాత కేసీఆర్ వైఖరి మారిపోయిందన్నారు. అటవీ సంరక్షణ చట్టాన్ని మార్చి ఆదివాసీలను బయటకు పంపే ప్రయత్నం జరుగుతున్నదని, తద్వారా అటవీ సంపద కార్పొరేట్ల పరమౌతుందన్నారు. చంద్రబాబు అరెస్టు, బెయిల్ వెనుక బీజేపీ హస్తం ఉందని ఆరోపించారు. తమతో కలిసి రానందుకు జైలుకు పంపారని, తెలంగాణలో టీడీపీ పోటీ చేయకపోవడంతో బెయిల్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం కూలిపోవడం, పేపర్‌లీక్‌లు, 50 శాతం కమీషన్లు కేసీఆర్‌ను పుట్టి ముంచనున్నాయన్నారు. తెలంగాణ ప్రజలు అవినీతినైనా సహిస్తారు కాని అహంకారాన్ని సహించరని, ఎమ్మెల్యేలకు ప్రవేశం లేని అసెంబ్లీ ఎందుకని ప్రశ్నించారు. కేసీఆర్ కేబినెట్‌లో తెలంగాణ ద్రోహులే ఎక్కువగా ఉన్నారని అన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి సీపీఐ మద్దతు ఇవ్వడం లేదనే అపవాదు సరికాదన్నారు. సీపీఐ నేత పువ్వాడ నాగేశ్వరరావు కుమారుడైనంత మాత్రాన ఖమ్మంలో బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తారనుకోవడం సరికాదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె.జానిమియా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో తోపులాటలు.. ఒకరికి గాయాలు

నవతెలంగాణ-అడ్డగూడూర్

యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ తుంగతుర్తి అభ్యర్థి మందుల సామేల్ ప్రచారం నిర్వహిస్తుండగా తోపులాట జరిగింది. కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి మందుల సామెల్ మండలంలోని చౌళ్ల రామరం గ్రామంలో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఆ సమయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పోలే పోయిన లింగయ్య యాదవ్, సర్పంచి జోజితో పాటు అదే గ్రామానికి చెందిన పలువురి నాయకులను ప్రచార రథం పైకి ఆహ్వానించారు. అందులో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఖమ్మంపాటి కుమార్ కూడా ఉన్నారు. కుమార్ ప్రచార రథం పైకి రావడంతో సర్పంచ్‌తో పాటు ఆయన కుమారుడు ప్రచార రథంపై నుండి నెట్టివేశారు. మరోసారి ఎక్కగా మళ్లీ నెట్టారు. దాంతో కుమార్ కిందపడి స్పృహ తప్పాడు. వెంటనే సూర్యాపేట ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఎడమ చేయి విరిగినట్లు సమాచారం. ఇదంతా మందుల సామేల్ ఎదుటనే జరగడం కొస మెరుపు.

ఆరు గ్యారంటీలకే ప్రజల ఓట్లు

- సీడబ్ల్యూసీ సభ్యులు అల్కాలాంబ



నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

ఈనెల 30న జరుగనున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పథకాలకు ఓటు వేస్తారని సీడబ్ల్యూసీ సభ్యులు అల్కాలాంబ ధీమా వ్యక్తం చేశారు. కర్నాటకలో ప్రకటించిన మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, మహిళలకు రూ. 2.500 నెలవారీ పారితోషికం, ప్రతి ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ. 500లకే వంట గ్యాస్ వంటి పథకాలను అమలుచేస్తామన్నారు. కర్నాటకలో రాష్ట్రంలో రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలు చేశామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ సిద్ధమైందన్నారు. కరోనా సమయంలో ఢిల్లీలో లిక్కర్ స్కాం జరిగిందన్నారు. ఢిల్లీ ముఖ్యమంతి కేజ్రీవాల్, సీఎం కేసీఆర్ కూతురు కవిత లిక్కర్ స్కామ్‌లో ఉన్నారని ఆరోపించారు. రూ.100 కోట్ల అవినీతి లిక్కర్ స్కామ్‌లో జరిగిందని చెప్పారు. జమ్ముకశ్మీర్‌లో ఐదుగురు జవాన్లు మరణిస్తే, రక్షణ శాఖ మంత్రి మాత్రం పరోక్షంగా కారును గెలిపించే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు.

రేవంత్ హెలిక్యాప్టర్‌కు వాతావరణం దెబ్బ

టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి, అద్దంకిదయాకర్, అయోధ్యరెడ్డి ప్రయాణిస్తున్న హెలిక్యాప్టర్ వెనక్కి తిరిగొచ్చింది. వాతావరణం అనుకూలించక పోవడంతో కొద్దీ దూరం వెళ్లాక ఈ నిర్ణయం తీసుకున్నారు. రోడ్‌మార్గం ద్వారా ఆయన ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. నకిరేకల్, తుంగతుర్తి, ఆలేరు, కామారెడ్డి నియోజకవర్గాల్లో ఎన్నికల.ప్రచారాన్ని నిర్వహించాల్సి ఉన్నది. రోడ్ మార్గంలో వెళ్తుండడంతో సభలకు ఆలస్యమవుతున్నట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. ఇదిలా ఉండగా శుక్రవారం కామారెడ్డిలో నిర్వహించాల్సిన ప్రచార కార్యక్రమాన్ని శనివారానికి వాయిదా వేసినట్టు తెలిపారు.

కాంగ్రెస్ నుంచి ఆదిలాబాద్ నేతల బహిష్కరణ

క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడుతున్న నలుగురు నాయకులను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం క్రమశిక్షణ విభాగం చైర్మెన్ జి చిన్నారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సస్పెండైన వారిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సంజీవ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, నాయకులు భార్గవ్ దేశ్ పాండే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అబ్రహం కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎస్ఏ సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మల్లు రవి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరు సీఎం కేసీఆర్‌కు రేవంత్ లేఖ



కాంగ్రెస్ పార్టీని, నాయకులను ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా, ఎన్ని దాడులు చేసినా...ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై, కాంగ్రెస్ నేతల ఇండ్లపై ఐటీ, ఈడీ దాడులు చేయిస్తున్నారని తెలిపారు. ఆ రెండు పార్టీల్లో చేరిన వాళ్లు పవిత్రులు...ప్రతిపక్షంలో ప్రజల తరుపున కొట్లాడే వాళ్లు ద్రోహులా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు గెలుపు అవకాశాలు పెరుగుతున్న కొద్దీ అమిత్‌షా, కేసీఆర్ కలిసి కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. మీ పతనం మొదలైందని ఆయన హెచ్చరించారు.

డీప్‌ఫేక్స్ నియంత్రణకు ప్రత్యేక అధికారి

న్యూఢిల్లీ : డీప్‌ఫేక్స్ నియంత్రణకు, వాటికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక అధికారిని నియమించనుంది. ఈ విషయాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ శుక్రవారం వెల్లడించారు. అలాగే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) నిబంధనల ఉల్లంఘనలపై వినియోగదారులు తమ ఫిర్యాదులు నమోదు చేయడానికి ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను రూపొందిస్తామని కూడా మంత్రి తెలిపారు. ఐటి నిబంధనలను ఉల్లంఘించే సోషల్ మీడియా సంస్థలపై ఈ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చనని చెప్పారు. మరోవైపు, ఐటి నిబంధనలకు అనుకూలంగా తమ ప్లాట్‌ఫామ్‌లను సర్దుబాటు చేయడానికి సోషల్ మీడియా సంస్థలకు ఏడు రోజుల సమయం ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇటీవల దేశంలో డీప్ ఫేక్ వీడియోలు సంచనలం సృష్టిస్తున్నాయి. కొంతమంది నటీమణుల డీప్ ఫేక్ వీడియోలు సోషల్ మీడియా వేదికల్లో ప్రత్యక్షకావడం అనేక విమర్శలకు దారితీసింది.

భారత్‌లో మూతపడ్డ ఆఫ్ఘన్ ఎంబసీ

న్యూఢిల్లీ : భారత్‌లో తమ ఎంబసీని శాశ్వతంగా మూసివేసినట్లు ఆఫ్ఘనిస్తాన్ ప్రకటించింది. అంతర్గత ఘర్షణల కారణంగా ఈ చర్య తీసుకున్నారని కొంతమంది వ్యాఖ్యానించవచ్చని, కానీ విధానపరమైన నిర్ణయాలు, ప్రయోజనాల్లో విస్తృత మార్పుల ఫలితమే ఈ నిర్ణయమని ఎంబసీ తెలిపింది. న్యూఢిల్లీలోని దౌత్యకార్యాలయం మూతపై ఒక అధికార ప్రకటన చేస్తూ, భారత ప్రభుత్వం నుండి పదే పదే ఎదురైన సవాళ్ళ వల్ల నవంబరు 23నుండి ఇది అమల్లోకి వచ్చిందని తెలిపింది. సెప్టెంబరు 30నుండే ఎంబసీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఆ తర్వాత ఎంబసీ మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. తిరిగి ఆఫ్ఘన్ ఎంబసీ సాధారణంగా పని చేసేందుకు అనుమతించేలా భారత ప్రభుత్వ వైఖరి మారగలదని ఆశిస్తున్నట్లు ఆ ప్రకటన తెలిపింది. వనరులు, అధికారాలు పరిమితంగానే వున్నప్పటికీ, పైగా కాబూల్‌లో చట్టబద్ధమైన ప్రభుత్వమేదీ లేనప్పటికీ తాము మెరుగైన రీతిలో అవిశ్రాంతంగా పనిచేశామని ఆఫ్ఘన్ ఎంబసీ ప్రకటించింది. గత రెండేళ్ళ మూడు మాసాలుగా ఆఫ్ఘన్ శరణార్థులు, విద్యార్థులు, వ్యాపారాలు దేశాన్ని విడిచివెళుతుండడంతో భారత్‌లో ఆఫ్ఘన్ కమ్యూనిటీ బాగా తగ్గిపోయిందని ఎంబసీ తెలిపింది. 2021 ఆగస్టు నుండి ఈ సంఖ్య సగానికి సగం తగ్గింది. ఇదే కాలంలో కొత్త వీసాలు జారీ చేసిన సంఖ్య కూడా చాలా పరిమితంగా వుంది.

గిరిజన భూముల బదిలీపై
వెనక్కి తగ్గిన ఒడిశా సర్కార్

భువనేశ్వర్ : గిరిజనేతరులకు గిరిజన భూమిని బదిలీ చేసేందుకు అనుమతించేలా ఒరిస్సా షెడ్యూల్డ్ ఏరియాల స్థిరాస్తుల బదిలీ నియంత్రణ, 1956 (ఒఎస్ఎటిఐపి) చట్టాన్ని సవరించాలన్న నిర్ణయాన్ని నవీన్ పట్నాయక్ ప్రభుత్వం శుక్రవారం ఉపసంహరించుకుంది. గిరిజన భూముల బదిలీని నిషేధించడమే కాకుండా షెడ్యూల్డ్ ఏరియాల్లో బలవంతంగా స్వాధీనానికి ప్రయత్నించడాన్ని నేరంగా కూడా ఈ చట్టం పరిగణిస్తోంది. ఒఎస్ఎటిఐపికి సవరణను రద్దు చేయాలన్న ప్రతిపాదనను మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ మేరకు ఆ రాష్ట్ర రెవిన్యూ మంత్రి అసెంబ్లీలో శుక్రవారం ఒక ప్రకటన చేశారు. కేవలం పది రోజుల వ్యవధిలో రెండుసార్లు ప్రభుత్వం తాను తీసుకున్న నిర్ణయాలను తానే ఉపసంహరించుకుంది. ఈ నెల 14న నిర్ణయం తీసుకున్నారు కానీ రెండు రోజుల్లోనే ఆ ప్రతిపాదనను నిలుపుచేశామంటూ మంత్రి సోషల్ మీడియాలో పెట్టారు. అయినా ప్రతిపక్షాలు, గిరిజన కార్యకర్తలు శాంతించలేదు. ఒక్కసారి గనుక దీన్ని అనుమతించినట్లైతే ఇక గిరిజనుల నుండి భూమిని లాక్కుంటారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్‌నెట్ షట్‌డౌన్‌ల్లోనూ
డిజిటల్ ఇండియా నెంబర్ వన్ !

- నిషేధాలతో లక్షలాదిమందికి ఇబ్బందులు



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ ఐడి డేటాబేస్‌తో, రోజువారీ లావాదేవీలకు విస్తృత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ కలిగిన, రోదసీ, ఉపగ్రహ కార్యకలాపాల్లో పేరెన్నికగన్న భారత్‌కు అనుసంథానంతో కూడిన సాంకేతికత శక్తి గురించి బాగా తెలుసు. కానీ, ఎక్కడైనా రాజకీయ అశాంతి లేదా వర్గ హింస చోటు చేసుకుంటే చాలు వెంటనే అధికారులు తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా నిరోధించే పేరుతో ఇంటర్‌నెట్ సేవలను కట్ చేస్తారు. కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్, బిజినెస్‌ల కోసం వెబ్‌పై ఆధారపడే లక్షలాదిమంది ప్రజలు దీంతో ఇబ్బందుల్లో పడతారు. అధికారులకు సంబంధించినంతవరకు ఇంటర్‌నెట్ నిషేధమన్నది వారి మొదటి సాధనంగా వుంటుందని భారత్‌లో ఆన్‌లైన్ పౌర హక్కుల కార్యకర్త మిషి చౌదరి వ్యాఖ్యానించారు. ఇలా ఇంటర్నెట్‌పై విధించే నిషేధం గంటలు, రోజులు, కొన్నిసార్లు నెలల తరబడి కూడా కొనసాగుతుంది.

మణిపూర్‌లో ఘర్షణలు తలెత్తిన మే మాసం నుండి 30లక్షలమందికి పైగా ప్రజలకు మొబైల్ ఇంటర్‌నెట్‌తో సంబంధాలు తెగిపోయాయి. ఈ కారణంగా హింసాకాండ సందర్భంగా ఆచూకీ తెలియకుండా పోయిన తన కొడుకు గురించి తెలుసుకోవడానికి ఆ తల్లికి రెండు మాసాలు పట్టింది. సెప్టెంబరులో నెట్‌ను కొద్దిసేపు పునరుద్ధరించినపుడు ఒక యువకుని శవం ఫోటోలు సామాజికమాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అప్పుడు మాత్రమే తన కుమారుడి శవాన్నైనా చూడగలిగానని ఆ తల్లి వాపోయింది.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఇంటర్‌నెట్ షట్‌డౌన్‌ల్లో కూడా అంతర్జాతీయంగా అగ్రగామిగా వుందని న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఆన్‌లైన్ ఫ్రీడమ్ మోనిటర్స్ యాక్సెస్ నౌ పేర్కొంది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా 187సార్లు ఇంటర్‌నెట్ షట్‌డౌన్‌లు నమోదవగా, అందులో 84 భారత్‌లోనే చోటు చేసుకున్నాయి. వరుసగా ఐదేళ్ళ నుండీ భారత్ ఈ విషయంలో టాప్‌లో వుందని పేర్కొంది. నిరసనలు, పరీక్షల సమయంలో మోసాలను నివారించడానికి ఇలా నెట్‌ను నిషేధించడం ప్రధాన కారణాలుగా వున్నాయని ఒక విశ్లేషణలో తేలింది. 2020 నుండి 2022 వరకు ఇంటర్‌నెట్ నిషేధాలపై ఇంటర్‌నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ జరిపిన విశ్లేషణలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ప్రతికూల వాణి వినిపించకుండా వుండేందుకు ప్రభుత్వం దీన్ని ఒక ఎత్తుగడగా అమలు చేస్తున్నా, ఇది కలగచేసే ప్రభావం ఎలా వుంటుందో అధికారులు అర్థం చేసుకోలేకపోతున్నారని సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్ వ్యవస్థాపకురాలైన మిషి చౌదరి వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ ఆన్‌లైన్ సోషల్ సపోర్ట్ వ్యవస్థలపై ఆధారపడే నిరుపేదలు దీనివల్ల తీవ్రంగా ఇబ్బందుల పాలవుతారని మానవ హక్కుల పర్యవేక్షణా సంస్థ విమర్శించింది. మొత్తంగా గతేడాది ఇంటర్‌నెట్ షట్‌డౌన్‌ల వల్ల దాదాపు 12.1కోట్ల మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమయ్యారని తెలిపింది.

ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఆన్‌లైన్‌పై ఆధారపడే వాణిజ్య కార్యకలాపాలన్నీ తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అలాగే జర్నలిస్టులు కూడా తమ విధి నిర్వహణలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇలా ఇంటర్‌నెట్‌ను నిషేధించడం వల్ల విద్వేష ప్రచారం కాస్తంత నెమ్మదిస్తుందేమో కానీ సమస్యలు, ఘర్షణలకు మూల కారణాలు పరిష్కారం కావని అన్నారు.

పరికరాల పనితీరు తనిఖీకి విదేశీ బృందం

- జర్మనీకి సాగునీటి శాఖ అధికారులు సీమెన్స్ కంపెనీ సందర్శన : రజత్‌కుమార్ ఆధ్వర్యంలో పర్యటన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టుల అవసరార్థం ఆ శాఖ ఉన్నతాధికారులు జర్మనీ దేశం న్యూరెంబర్గ్‌కు వెళ్లారు. వెలిజాల పంపుహౌజ్‌లోని ఫ్యాకేజీ నెంబరు ఒకటి, తుక్కాపూర్ పంపుహౌజ్‌లోని ఫ్యాకేజీ నెంబరు నాలుగుకు అవసరమైన ఆయా పరికరాల తయారీ. వాటి పనితీరును తనిఖీ చేశారు. వీటి కోసం సాగునీటి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు అధికారులు సీమెన్ ఫ్యాక్టరీలో తయారుచేసే ఎస్ఎఫ్‌సీ యంత్రాల పనితీరును శుక్రవారం పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎస్ఎఫ్‌సీ యంత్రాలనే ఎక్కువగా వాడినట్టు ఆ శాఖ ఇంజినీర్లు చెబుతున్నారు. సీమన్స్ కంపెనీ ప్రతిష్టాత్మకమైనదనీ, ఆ యంత్రాలు నాణ్యంగా ఉంటాయని సమాచారం. రజత్‌కుమార్ వెంట గజ్వేల్ ఈఎన్‌సీ బి.హరిరామ్, సలహాదారు కె.పెంటారెడ్డి, ప్రతిమ కంపెనీ ప్రతినిధి కెవి రమణ, నవయుగ కంపెనీ ప్రతినిధి బి.రమేశ్ తదితరులు ఉన్నారు. వీరికి సీమన్స్ కంపెనీ ప్రతినిధి ఎస్ఎఫ్‌సీ యంత్రాల పనితీరును వివరించారు. కాగా రజత్‌కుమార్ తన కుటుంబంతో వెళ్లారు. ఈనెలాఖరున ఉద్యోగవిరమణ చేస్తున్న నేపథ్యంలో జర్మనీ వెళ్లడం విమర్శలకు దారితీసిన విషయం విదితమే.

గడపగడపకు సంక్షేమ పథకాలు

- 'ప్రగతి ప్రస్థానం..ఎట్లుండే తెలంగాణ ఎట్లైంది'పుస్తకావిష్కరణలో కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గడపగడపకు చేరుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాహారంగా రూపొందించిన 'ప్రగతి ప్రస్థానం..ఎట్లుండే తెలంగాణ ఎట్లైంది' పుస్తకాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు యావత్ దేశానికి మార్గదర్శనంగా నిలిచాయని తెలిపారు. సంక్షేమంలో స్వర్ణయుగాన్ని సృష్టించామన్నారు. ఫలితంగానే రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గినట్టు సాక్షాత్తు నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.ప్రభుత్వ పనితీరును ఇలాంటి నివేదికలెన్నో తేల్చిచెప్పాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపడతారని కేటీఆర్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలుచేసిన పథకాలు ప్రజలకు చేరువైన తీరును గణాంకాలతో సహా తన సంపాదకత్వంలో పుస్తకంగా వెలువరించిన సీనియర్ జర్నలిస్టు, సీఎం పీఆర్ఓ రమేష్ హజారీ కృషిని మంత్రి కేటీఆర్ అభినందించారు.

ఎలక్ట్రానిక్ వేస్ట్‌పైనా డిస్కౌంట్ ఓచర్

- ఐటి కారిడార్‌లో సెలెక్ట్ మొబైల్స్ ఇ-వేస్ట్ బిన్ ఏర్పాటు : ఇ-వేస్ట్‌లోనూ విలువైన లోహాలు జయేష్ రంజన్ వెల్లడి



హైదరాబాద్ : ఎలక్ట్రానిక్ వేస్ట్‌తోనూ డిస్కౌంట్ ఓచర్లను పొందేలా ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ సెలెక్ట్ మొబైల్స్ ఇ-వేస్ట్ బిన్‌లను అందుబాటులోకి తెచ్చింది. శుక్రవారం హైదరాబాద్‌లోని రహేజా ఐటి పార్క్ మైండ్‌స్పేస్‌లో ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ సెలెక్ట్ మొబైల్స్ ఇ-వేస్ట్ సేకరణ బిన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి హాజరైన తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ వేస్ట్‌లో విలువైన లోహాలు ఉన్నాయన్నారు. స్టోర్ మోడల్‌లో మాత్రమే కాకుండా పబ్లిక్ ప్రాంతంలో ఇ-వేస్ట్ సేకరణ బిన్‌ను ఏర్పాటు చేయడం స్వాగతించాల్సిన విషయమన్నారు. ఇ-వేస్ట్‌లో అనేక వస్తువులు, పరికరాలు, రసాయనాలు చాలా విలువైనవి ఉన్నాయన్నారు. ఇ-వేస్ట్‌ను జాగ్రత్తగా ఉపయోగించుకోలేకపోతే మానవాళికి, జంతుజీవం, ప్రకృతి విలువలకు హాని జరగనుందని హెచ్చరించారు. గతంలో కొన్ని మాసాల క్రితం సెలెక్ట్ సంస్థ మిషన్ ఇ-వేస్ట్ సమీకరణను ప్రారంభించిందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు వరంగల్, విజయవాడ, తిరుపతి, గుంటూరుకు కూడా విస్తరించడం గొప్ప విషయమన్నారు. ప్రతీ ఐటి బిల్డింగ్‌లోనూ ఇలాంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. సైబరాబాద్‌లో దాదాపు 350పైనా ఐటి బిల్డింగ్‌లు ఉన్నాయని.. వీటన్నిటిలోనూ క్రమంగా ఇ-వేస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా సంస్థలను మేము కూడా ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెలెక్ట్ మొబైల్స్ సిఎండి వై గురు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేని పాల్గొన్నారు.

రూ. 10,000 వరకు డిస్కౌంట్..

ఈ-వేస్ట్ బిన్‌తో పాటు ఒక క్యూఆర్ కోడ్ ఉంటుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన మొబైల్ నెంబర్, వారి పేరును నమోదు చేయవలెను. ఈ వేస్ట్ యొక్క వివరాలను నమోదు చేయవలసి ఉంటుంది. వెంటనే వర్చ్యువల్‌గా రూ.10,000 వరకు విలువ గల డిస్కౌంట్ కూపన్ పొందవచ్చు. ఆ డిస్కౌంట్ కూపన్‌ను దగ్గరలో ఉన్న సెలెక్ట్ మొబైల్ స్టోర్‌కు వెళ్లి ఏదైనా వస్తువు కొనుగోలుపై రిడీమ్ చేసుకోవచ్చని వై గురు తెలిపారు. మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాలు, మౌస్, కీబోర్డ్ తదితర అనేక రకాల ఎలక్ట్రానిక్ పరికరాలను ఈ-వేస్ట్‌గా పరిగణిస్తామన్నారు. ఈ-వేస్ట్ నిర్మూలన దిశగా సెలెక్ట్ మొబైల్స్ ఈ-వేస్ట్ రంగంలోని మూడు ప్రముఖ సంస్థలతో కలిసి పనిచేస్తుందని గురు వెల్లడించారు.

7న డాక్ అదాలత్

- సర్వీస్ మేటర్స్ పంపొద్దు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పోస్టల్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 7వ తేదీ డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఎన్ రంగారావు తెలిపారు. వినియోగదారుల సేవలకు సంబంధించిన సమస్యలు మాత్రమే ఈ అదాలత్‌లో స్వీకరిస్తారనీ, సంస్థ ఉద్యోగులు తమ సర్వీస్ మేటర్స్, పెండింగ్ సమస్యలు, కోర్టు కేసుల్ని దీనిలో స్వీకరించబోరని స్పష్టం చేశారు. అదాలత్‌లో పాల్గొనే వినియోగదారులు ఈనెల 1వ తేదీ లోపు తమ సమస్యల్ని హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు. ఫిర్యాదుదారులు తమ ఫోన్ నెంబర్, ఈ-మెయిల్, చిరునామాలు తప్పక రాయాలనీ, వర్చువల్ పద్ధతిలో జరిగే అదాలత్‌కు సంబంధించిన లింక్‌ను వారికి పంపుతామన్నారు.

ఊడలమర్రిలా కల్వకుంట్ల కుటుంబ అవినీతి

- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కేసీఆర్ అవినీతి ఊడలమర్రిలా విస్తరించిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. కేసీఆర్ చీడపీడను అంతంచేసేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ మ్యానిఫెస్టోను అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. ఓట్ల కోసం ఉచితాల హామీలు కాక అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం తమ పార్టీ పనిచేస్తోందన్నారు. మాదే అసలుసిసలైన రైతాంగ మ్యానిఫెస్టో అని చెప్పారు. రూ. 2500 ఎరువులు, విత్తనాలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నామన్నారు. ఎరువుల సబ్సిడీ కింద రూ. 18,630రూపాయల భారాన్ని తగ్గిస్తున్నామన్నారు.

అదానీ కేసులో తీర్పు రిజర్వు



న్యూఢిల్లీ : తీవ్ర అకౌంటింగ్ మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ కేసులో సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. అదానీ గ్రూపు కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయని.. హిండెన్ బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌తో ఆ కంపెనీల సూచీలు భారీ పతనాన్ని చవి చూడటంతో ఇన్వెస్టర్లు లక్షల కోట్ల రూపాయలు నష్టపోయిన విషయం తెలిసిందే. అదానీపై వచ్చిన ఆరోపణలపై అత్యున్నత న్యాయస్థానం సెబీని విచారణకు ఆదేశించింది. కాగా దీనిపై శుక్రవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించడంతో పాటుగా తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసు విషయంలో సెబీ ప్రవర్తన విశ్వసనీయంగా లేదని పిటిషనర్ తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. సెబి విచారణ నమ్మదగినది కాదని.. 13 నుండి 14 సంస్థలతో అదానీకి సంబంధాలు ఉన్నాయన్నారు. ఫారిన్ పోర్టుపోలియో ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిఐ) మార్గదర్శకాలను విచారణ కమిటీ పరిశీలించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

కాగా.. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంలో విచారణను పూర్తి చేసేందుకు ఇకపై పొడిగింపును కోరబోమని సుప్రీంకోర్టుకు సెబీ తెలిపింది. పెట్టుబడిదారుల విలువపై మార్కెట్ రెగ్యులేటర్ ఏమి చేస్తోందంటూ ధర్మాసనం ప్రశ్నించింది. వారి సొమ్ము రక్షణకు భరోసా ఇస్తున్నారా అంటూ సెబీని అడిగింది. స్టాక్ మార్కెట్‌లో తీవ్ర అస్థిరత ఉందని.. ఇన్వెస్టర్ల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించింది. ఈ షార్ట్ సెల్లింగ్ సందర్భాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ధర్మాసనం సూచించింది.

రెగ్యులేటరీ మెకానిజమ్‌ను బలోపేతం చేసేందుకు నిపుణుల కమిటీ సిఫార్సులు పరిశీలనలో ఉన్నాయని, వాటికి సెబీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని ఆ రెగ్యులేటరీ సంస్థ తరపు న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. అదానీ గ్రూపునపై 24 ఆరోపణలు రాగా.. వాటిలో 22 కేసుల దర్యాప్తును ముగించామన్నారు. మిగిలిన రెండింటి విషయంలో విదేశీ నియంత్రణ సంస్థల నుండి ప్రతిస్పందన కోసం ఎదురు చూస్తున్నా మన్నారు. ఈ కేసులో దాదాపు విచారణ పూర్తి అయ్యిందని సెబీ కోర్టుకు తెలిపింది. భవిష్యత్తులో మొత్తం 24 కేసుల్లో విచారణను పూర్తి చేసి, నిపుణుల కమిటీ సిఫారసులతో చట్ట ప్రకారం కొనసాగాలని సెబీకి కోర్టు సూచించింది. హిండెన్ బర్గ్ నివేదికలోని ఆరోపణలను నిజమని తాము అంగీకరించాల్సిన అవసరం లేదని సీజేఐ అన్నారు. వార్తా పత్రికలో ప్రచురితమైన దానిని సత్యంగా పరిగణించాలని.. చట్టబద్ధమైన సంస్థను అడగ లేమని పేర్కొన్నారు. సెబీని అనుమానించడానికి తమ ముందు ఎలాంటి ఆధారాలు లేవన్నారు.

ఈ ఏడాది డబ్ల్యూబిఎఫ్ ప్రతిష్టాత్మక పురస్కారం రేసులో నిలిచిన సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ.. ఆ ఉత్సాహం చైనా మాస్టర్స్‌లో చూపిస్తోంది. ప్రత్యర్థికి ఒక్క గేమ్ సైతం కోల్పోకుండా చెలరేగుతున్న సాత్విక్, చిరాగ్‌లు చైనా మాస్టర్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్స్‌లో ఇండోనేషియా జోడీని చిత్తు చేసిన మనోళ్లు నేడు చైనా షట్లర్లతో తలపడనున్నారు. మెన్స్ సింగిల్స్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ పోరాటానికి క్వార్టర్స్‌లోనే తెరపడింది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్

● నేడు చైనా జోడీతో అమీతుమీ ● చైనా మాస్టర్స్ సూపర్ 750



షెంజెన్ (చైనా)

భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్, మాజీ వరల్డ్ నం.1 సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోరు కొనసాగుతోంది. చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీలో వరుసగా మరో విజయం సాధించిన సాత్విక్, చిరాగ్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్, చిరాగ్‌లు 21-16, 21-14తో ఇండోనేషియా షట్లర్లపై వరుస గేముల్లో గెలుపొందారు. పురుషుల సింగిల్స్‌లో సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ నిరాశపరిచాడు. మూడో సీడ్, జపాన్ స్టార్ కొడాయ్ నరొక చేతిలో వరుస గేముల్లో పరాజయం పాలయ్యాడు. పురుషుల డబుల్స్ విభాగం టైటిల్ రేసులో సాత్విక్, చిరాగ్ జోడీ నిలువగా.. ఇతర విభాగాల్లో భారత షట్లర్ల పోరాటానికి తెరపడింది.

ఎదురులేదు

మెన్స్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో మనోళ్లకు ఎదురులేదు. ఇండోనేషియా జోడీ లియో, డానియల్‌లపై వరుస గేముల్లో అలవోక విజయం సాధించారు. 46 నిమిషాల్లోనే ముగిసిన క్వార్టర్స్ పోరులో సాత్విక్, చిరాగ్ చెలరేగారు. తొలి గేమ్ విరామ సమయానికి 11-9తో ముందంజ వేసిన టాప్ సీడ్ జోడీ.. ఆ తర్వాత కాస్త కష్టపడింది!. 13-13, 14-14 వద్ద ఇండోనేషియా షట్లర్లు స్కోరు సమం చేశారు. కానీ ఆ తర్వాత వరుస పాయింట్లతో మెరిసిన మనోళ్లు 21-16తో పైచేయి సాధించారు. ఇక రెండో గేమ్‌లో సాత్విక్, చిరాగ్‌లకు అడ్డు లేదు. ఆరంభం నుంచీ ఆధిక్యంలో నిలిచిన మన స్టార్స్.. విరామ సమయానికి 11-7తో తిరుగులేని పట్టు సాధించింది. ద్వితీయార్థంలోనూ జోరు కొనసాగటంతో ఇండోనేషియా షట్లర్లు చిన్నబోయారు. 21-14తో రెండో గేమ్‌నూ నెగ్గిన భారత స్టార్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. నేడు జరిగే సెమీఫైనల్లో లోకల్ బాయ్స్, చైనా జోడీతో మనోళ్లు తలపడనున్నారు. హీ జి టింగ్, రెన్ షియాంగ్ యు జోడీ సాత్విక్, చిరాగ్‌లకు సవాల్ విసిరేందుకు సిద్ధమవగా.. టాప్ సీడ్ భారత జోడీ ఫైనల్స్‌పై కన్నేసి బరిలోకి దిగనుంది.

ఇక మెన్స్ సింగిల్స్ విభాగంలో హెచ్.ఎస్ ప్రణయ్‌కి పరాజయం ఎదురైంది. ఈ ఏడాది మంచి ఫామ్‌లో ఉన్న ప్రణయ్ క్వార్టర్‌ఫైనల్లో మూడో సీడ్ కొడాయ్ నరొక చేతిలో ఓటమి చెందాడు. 9-21, 14-21తో వరుస గేముల్లో పెద్దగా ప్రతిఘటన లేకుండానే ప్రణయ్ సెమీస్ బెర్త్‌ను కోల్పోయాడు. 43 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ప్రణయ్ ఆశించిన ప్రదర్శన చేయలేదు. ప్రణయ్‌పై జపాన్ షట్లర్‌కు ఇది ఐదో విజయం కావటం గమనార్హం.

ఎల్ఐసీ షేర్లు జిగేల్..

ఒక్క పూటలోనే 10 శాతం వృద్ధి



ముంబయి : దిగ్గజ బీమా సంస్థ ఎల్ఐసీ షేర్లు వారాంతం సెషన్‌లో జిగేల్‌మన్నాయి. శుక్రవారం రికార్డ్ స్థాయిలో 10 శాతం ఎగిసి.. రెండు నెలల గరిష్ట స్థాయికి చేరింది. లిస్టింగ్ తర్వాత ఒక్క పూటలోనే ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. మరో రెండు ప్రభుత్వ రంగ బీమా సంస్థల షేర్లు భారీగా లాభపడ్డాయి. జనరల్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా షేరు విలువ 18 శాతం పెరిగింది. న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ షేరు 20 శాతం మేర ర్యాలీ చేసింది. ఎల్ఐసి షేర్ 9.69 శాతం పెరిగి రూ.677.65 వద్ద ముగిసింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని ఎల్ఐసీ చైర్మెన్ సిద్ధార్థ మొహంతి ప్రకటించారు. కొత్త వ్యాపార ప్రీమియంలో వృద్ధి సాధించటంలో భాగంగా రానున్న నెలల్లో 3-4 కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ ప్రకటన ఆ సంస్థ సూచీ ర్యాలీకి దోహదం చేసింది. జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ 16.70 శాతం పెరిగి రూ.307.55 వద్ద ముగిసింది. మరో పిఎస్‌యు న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ షేర్ 20 శాతం లాభపడి రూ.209.40 వద్ద ముగిసింది.



కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా

● రిస్కు వద్దు.. కారుకు గుద్దు ● మున్సిపాలిటీలో టాక్స్ తగ్గిస్తాం : మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ నారాయణఖేడ్ రూరల్

'కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా? రిస్కు వద్దు.. కారుకు గుద్దు.. మున్సిపాలిటీలో టాక్స్ తగ్గిస్తాం' అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ ర్యాలీని చూసి కాంగ్రెస్ వాళ్ల గుండెలు జారిపోయాయని చెప్పారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. పట్టణంలోని రెహమాన్ ఫంక్షన్ హాల్ నుంచి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ ఖతమవుతుందని, మీ ఊపు ఉత్సాహం చూస్తుంటే మన భూపాల్ అన్న 50 వేల మెజార్టీతో గెలుస్తారని దీమా వ్యక్తం చేశారు. మొన్న మూడు గంటల కరెంటోడు వచ్చిండు సగం రాకపాయె.. మనోళ్లు ఇసుకేస్తే రాలనంత జనమని రేవంత్‌రెడ్డికి సెటైర్లు వేశారు. ఆరు గ్యారంటీలని మోసం చేయడానికి వస్తున్నారని, పక్కనే ఉన్న కర్నాటకలో కాంగ్రెస్ మోసం తెలుస్తుందని ఆరోపించారు. ఖర్గే తెలంగాణ మేం పెట్టిన భిక్ష అంటుండు.. పొంగపొంగ బ్రిటీషోడు స్వాతంత్రం ఇచ్చి పోయిండు.. మీకు పెట్టిన భిక్షేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో మీరందరూ చదివినరా? సంవత్సరానికి రైతుబంధు రూ.15 వేలంట.. మన కేసీఆర్ ఇప్పుడు రూ.16 వేలు ఇవ్వనున్నారని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు అసైన్‌మెంట్ భూములకు పక్కా పట్టాలిస్తామని తెలిపారు. రెవెన్యూ డివిజన్, డీఎస్పీ ఇస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మహారెడ్డి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెసోళ్లు రామాలయ భూములు కబ్జాలు చేశారని అన్నారు. కాశీనాథ్ మందిరం భూములు కబ్జాలు చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పటేల్, మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రుబ్బిన నజీబ్, శ్రీనివాస్ గౌడ్, పరశు రాం పాల్గొన్నారు.

డిసెంబర్ 9న డబ్ల్యూపీఎల్ వేలం

ముంబయి : మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2024 ప్లేయర్స్ వేలం డిసెంబర్ 9న ముంబయిలో జరుగనుంది. ఈ మేరకు బీసీసీఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్లేయర్స్ వేలానికి ముందు ఫ్రాంచైజీల కొనుగోలు మనీని బోర్డు పెంచింది. ప్రతి ఫ్రాంచైజీ వేలంలో ఓవరాల్‌గా రూ.13.5 కోట్లు ఖర్చు చేయవచ్చు. ఇప్పటికే అట్టిపెట్టుకున్న ప్లేయర్స్ మనీ మినహాయించి.. మిగిలిన సొమ్ముతో రానున్న వేలంలో ప్లేయర్లను తీసుకోవాల్సి ఉంటుంది. ఢిల్లీకి రూ.2.25 కోట్లు, గుజరాత్ జెయింట్స్‌కు రూ.5.95 కోట్లు, ముంబయి ఇండియన్స్‌కు రూ.2.1 కోట్లు, ఆర్‌సీబీకి రూ.3.35 కోట్లు, యూపీ వారియర్స్‌కు రూ.4 కోట్ల వేలం మనీ అందు బాటులో ఉంది. 2024 డబ్ల్యూపీఎల్ ఫిబ్రవరిలో ఆరంభం కానుంది.

హైదరాబాద్ 284/5

హైదరాబాద్ : కూచ్ బెహర్ (యూత్ ఫస్ట్ క్లాస్) ట్రోఫీ రెండో రౌండ్‌లో చత్తీశ్‌గఢ్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఉప్పల్ వేదికగా శుక్రవారం మొదలైన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ తొలి రోజు 90 ఓవర్లలో 284/5 పరుగులు చేసింది. అలంకృత్ రాపోల్ (96 నాటౌట్, 210 బంతుల్లో 7 ఫోర్లు), అర్బాజ్ బేగ్ (70, 115 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), సిద్ధార్థ్ రావు (54, 102 బంతుల్లో 9 ఫోర్లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. అరోన్ జార్జ్ (20), ప్రణవ్ వర్మ (17) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. చిరాగ్ యాదవ్ (1) విఫలమయ్యాడు. అలంకృత్‌కు తోడుగా ధీరజ్ గౌడ్ (13 నాటౌట్) అజేయంగా ఆడుతున్నాడు.

పవర్‌లిఫ్ట్‌లో సుకన్యకు మెడల్



హైదరాబాద్ : తెలంగాణ పవర్‌లిఫ్టర్ తేజావత్ సుకన్య జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్స్‌లో పతకం సాధించింది. బెంగళూర్‌లో జరిగిన ఈవెంట్‌లో మహిళల 76 కేజీల విభాగంలో సుకన్య కాంస్య పతకం సాధించింది. కోచ్ వి.ఎస్ రాజశేఖర్, ఏస్ ఇంజనీరింగ్ కాలేజ్ సీఎండీ గోపాలకృష్ణ మూర్తీలు సుకన్యను అభినందించారు.

ఆ ఊపిరి మీద ఒట్టేసి చెబుతున్నా..



చెరుకూరి మోహన్, నాని, శౌర్యువ్, డా.విజయేందర్‌రెడ్డి

నాని నటిస్తున్న పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్న'. వైర ఎంటర్‌టైన్‌మెంట్ మొదటి ప్రొడక్షన్ వెంచర్‌గా రూపొందిన ఈ చిత్రం ద్వారా శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లేటెస్ట్‌గా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ని మేకర్స్ గ్రాండ్‌గా లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ, 'ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో నన్ను నేను తెరపై చూసుకున్నపుడు 'వీడెవడో బావున్నాడు' అని అనిపించింది ఈ సినిమాకే (నవ్వుతూ). శౌర్యువ్ రాసుకున్న కథలో సాన్ జాన్ చూపించిన విజివల్స్‌లో చాలా బావుంటాను. టీజర్, పాటలు ఇప్పుడు ట్రైలర్ చూశారు. కానీ మీరు ఇంకా చూడనిది, ఊహించనిది సినిమాలో బోలెడంత ఉంది. మీరంతా సినిమాతో ప్రేమలో పడిపోవడం ఖాయం. సినిమా అనేది నాకు ఆక్సిజన్‌తో సమానం. సినిమా అనేది నిజంగా నా ఊపిరి. ఆ ఊపిరి మీద ఒట్టేసి చెబుతున్నా. డిసెంబర్ 7కి మీరంతా ప్రేమలో పడిపోయే సినిమా వస్తుంది. ఆ భాధ్యత నాది, మా టీం అందరిది. బాక్సాఫీసు బాధ్యత మీది. ఓ మంచి సినిమాతో మీముందుకు వస్తున్నందుకు చాలా ఆనందంగా, గర్వంగా ఉంది' అని తెలిపారు. ఈ వేడుకలో రైటర్ కాశి, దర్శకుడు శౌర్యువ్, నిర్మాత మోహన్ చెరుకూరి, విజయేందర్ రెడ్డితోపాటు చిత్ర యూనిట్ సభ్యులు కూడా పాల్గొన్నారు. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. నాని, మృణాల్ ఠాకూర్, బేబీ కియారా ఖన్నా ముఖ్య పాత్రధారులుగా నటించిన ఈ చిత్రానికి డీవోపీ: సాను జాన్ వరుగుస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, ఎడిటర్: ప్రవీణ్ ఆంటోని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - సతీష్ ఈవీవీ.

విక్రమ్ రాథోడ్ రిలీజ్‌కి రెడీ



విజయ్ ఆంటోని

విజయ్ ఆంటోని తెలుగు, తమిళ భాషల్లో నటిస్తున్న మరో డిఫరెంట్ కాన్సెప్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'విక్రమ్ రాథోడ్'. అపోలో ప్రొడక్షన్స్, ఎస్ఎన్ఎస్‌మూవీస్ సంయుక్త సమర్పణలో తెరకెక్కగా, బాబు యోగేశ్వరన్ దర్శకత్వం వహించారు.

రావూరి వెంకటస్వామి, ఎస్.కౌసల్య రాణి నిర్మాతలు. ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగులో ఓం శివ గంగా ఎంటర్‌ప్రైజెస్ (కె. బాబు రావు), పీఎస్ఆర్ ఫిల్మ్స్ (జీ పీఎస్ రెడ్డి) బ్యానర్లపై డిసెంబర్ 1న భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు. త్వరలోనే ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేయనున్నారు.

ఈ చిత్రంలో సురేష్ గోపి, రమ్య నంబీశన్, సోను సూద్, సంగీత ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, ఛాయా సింగ్, యోగి బాబు, రాధ రవి, కస్తూరి శంకర్, రోబో శంకర్, మనీష్ కాంత్ ఇతర పాత్రల్లో నటించారు.

నవచిత్రం

ఈగల్.. షూటింగ్ పూర్తి



రవితేజ

రవితేజ తాజాగా నటిస్తున్న చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి రవితేజ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 50 డేస్ కౌంట్‌డౌన్ పోస్టర్‌లో రవితేజ డెస్క్‌పై బోల్డెన్ని మారణాయుధాలతో కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

'టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో క్యూరియాసిటీ పెంచింది. కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో మేకర్స్ మరింత దూకుడు పెంచారు. సినిమాలో రవితేజ మల్టీ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయికగా నటిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరో కథానాయికగా నటించింది. నవదీప్, మధుబాల ఇతర ముఖ్య తారాగణం' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి ఎడిటింగ్, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని, నిర్మాత: టిజి విశ్వ ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి.

కుప్పంలో జరిగిన కథ..



సుధీర్ బాబు

హీరో సుధీర్ బాబు నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో ఎస్ఎస్ సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్నారు. ది రివోల్ట్ అనేది సినిమా ట్యాగ్‌లైన్.

తాజాగా ఈ చిత్ర టీజర్‌కి సంబంధించి మేకర్స్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్ర టీజర్ ఈనెల 27న విడుదల కానుందంటూ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో నిప్పుల కొలిమిలో ఓ ప్రత్యేకమైన ఆయుధాన్ని కాల్చుతూ ఇంటెన్స్ లుక్‌లో ఉన్న సుధీర్ బాబు అందరిలోనూ క్యూరియాసిటీ పెంచుతున్నారు. ఈ చిత్రంలో మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. సునీల్, అక్షర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఇప్పటికే విడుదలైన పోస్టర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో సుధీర్ బాబు కుప్పం యాసలో డైలాగులు చెప్పబోతున్నారు.

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం - జ్ఞానసాగర్ ద్వారక, సంగీతం - చైతన్ భరద్వాజ్, డీవోపీ - అరవింద్ విశ్వనాథన్, ఎడిటర్ - రవితేజ గిరిజాల.

అక్క.. ఎవరు?



కీర్తి సురేష్, రాధికా ఆప్టే

భారతీయ సినీ పరిశ్రమలో పవర్‌ఫుల్ కంటెంట్‌తో భారీ సినిమాలను రూపొందిస్తూ తనదైన గుర్తింపును సంపాదించుకున్న ప్రొడక్షన్ హౌస్ యష్ రాజ్ ఫిలిమ్స్. ఈ సంస్థ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కి శ్రీకారం చుట్టింది.

సీట్ ఎడ్జ్ రివేంజ్ థ్రిల్లర్ జోనర్‌లో పీరియాడిక్ థ్రిల్లర్‌గా ఓ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించనుంది. చిత్ర పరిశ్రమలో విలక్షణమైన పాత్రలతో మెప్పిస్తున్న నటీమణులు కీర్తి సురేష్, రాధికా ఆప్టే ఇందులో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

'మన చిత్ర పరిశ్రమలో కీర్తి సురేష్, రాధికా ఆప్టే వంటి నటీమణులు ఉండటం అనేది మనకు ఓ బహుమానంగా చెప్పొచ్చు. వారు సహజ సిద్ధమైన నటనతో మెప్పిస్తారు. వారి అద్భుతమైన నటనతో ప్రశంసలను పొంది తద్వారా తమదైన క్రేజ్‌ను వారు సంపాదించుకున్న సంగతి తెలిసిందే. పోటా పోటీగా నటించే వీరిద్దరూ కలిసి 'అక్క' అనే స్ట్రీమింగ్ ప్రాజెక్ట్‌తో అలరించబోతున్నారు. ఇదే ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది' అని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. ఆదిత్య చోప్రా నిర్మాతగా ధర్మరాజ్ శెట్టి అనే డెబ్యూ డైరెక్టర్ ఈ ప్రాజెక్ట్‌ని రూపొందిస్తున్నారు. 'అక్క' ప్రాజెక్ట్‌పై డైరెక్టర్ విజన్‌ని గుర్తించిన ఆదిత్య చోప్రా భారీ బడ్జెట్‌తో ఈ సిరీస్‌ను వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

భిన్న కాన్సెప్ట్‌తో కలశ



చంద్రజ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై బిగ్‌బాస్ ఫేమ్ భానుశ్రీ, సోనాక్షి వర్మ అనురాగ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కలశ'.

కొండ రాంబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని డాక్టర్ రాజేశ్వరి చంద్రజ వాడవల్లి నిర్మించారు. షూటింగ్ పూర్తి పూర్తి చేసుకొని రిలీజ్‌కు రెడీ అయ్యింది.

ఈ సందర్భంగా ఈ చిత్ర టీజర్ ఆవిష్కరణ వేడుక ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. 'కలశ' టీజర్‌ను డైరెక్టర్ సాగర్ చంద్ర ఆవిష్కరించారు. బ్యానర్ లోగోను వి.ఎన్. ఆదిత్య లాంచ్ చేయగా, టైటిల్ లోగోను యాట సత్యన్నారాయణ, మోషన్‌పోస్టర్‌ను వీరశంకర్‌లు లాంచ్ చేశారు.

అలాగే ఈ చిత్రంలోని సాంగ్‌ను వి.ఎన్. ఆదిత్య, వీరశంకర్, సాగర్‌చంద్ర, యాట సత్యన్నారాయణ సంయుక్తంగా విడుదల లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు కొండా రాంబాబు మాట్లాడుతూ,"కలశ' అనే టైటిల్ ఈ సినిమాలోని ఒక క్యారెక్టర్. కలశం ఎంత పవిత్రంగా ఉంటుందో.. ఈ క్యారెక్టర్ కూడా అంతే పవిత్రంగా ఉంటుంది. బ్రెయిన్‌కి, హార్ట్‌కి లింక్ చేస్తూ రాసుకున్న సినిమా ఇది. అందరినీ ఆకట్టుకునే మంచి కథ, కథనం ఉన్న సినిమా' అని అన్నారు.

నిర్మాత రాజేశ్వరి చంద్రజ మాట్లాడుతూ, 'దర్శకుడు రాంబాబు చెప్పిన కథ నన్ను చాలా ఆకట్టుకుంది. ఈ కథకు కావాల్సిన కమర్షియల్ హంగులను అన్నింటినీ సమకూర్చి తెరకెక్కించాం. సెన్సార్ సభ్యులు ఒక కట్ లేకుండా సర్టిఫికెట్ ఇవ్వడం మా తొలి విజయంగా భావిస్తున్నాను. ప్రేక్షకులు కూడా ఆదరిస్తారని నమ్ముతున్నాను. మా తొలి ప్రయత్నంగా చేసిన ఈ సినిమా మిమ్మల్ని తప్పకుండా అలరిస్తుంది' అని చెప్పారు. 'దర్శకుడు రాంబాబు ఈ సినిమా విషయంలో చాలా డీప్‌గా ఇన్వాల్వ్ అయ్యారు. ముఖ్యంగా సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ల విషయంలో మరింత కేర్ తీసుకున్నారు. సినిమా మంచి హిట్ అవుతుంది' అని సంగీత దర్శకుడు విజయ్ కూరాకుల చెప్పారు.

ఘనంగా ఉక్కు సత్యాగ్రహం ట్రైలర్, పాటలు ఆవిష్కరణ




సత్యారెడ్డి నటిస్తూ, దర్శకత్వం వహిస్తూ నిర్మించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. ఈ సినిమా ట్రైలర్, సాంగ్స్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు త్రినాధ రావు నక్కిన, ఎమ్మెల్యే ధర్మశ్రీ, గద్దర్ వెన్నెల, ఫిలిం ఛాంబర్ మాజీ చైర్మన్ బీవి రెడ్డి, పారిశ్రామికవేత్త రాజీవ్, ప్రొడ్యూసర్ దాసరి కిరణణ్, గాయని ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ, 'మా నాన్న గద్దర్ ప్రజల కోసం ఎంతో పాటు పడేవారు. ఆయన రాసిన పాటలు, గేయాలు ..అన్ని ప్రజల కోసం, ప్రజల సమస్యల మీదనే ఉండేవి. కరోనా సమయంలో కూడా ఆంధ్ర, తెలంగాణ ఇరు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలు తిరిగి ప్రజల కోసం ఎంతో సేవ చేశారు అలాగే వారి సమస్యలను ఉద్దేశిస్తూ ఎన్నో పాటలను కూడా ఆయన రాసి, పాడారు. అలాగే ప్రజా సమస్యల పైన పోరాడే చిత్రాల్లో ఎక్కువగా నటించిన నాన్న ఈ సినిమాలోనూ పాటలు రాయడంతోపాటు నటించారు' అని తెలిపారు.

'ఈ సినిమా నేను చేయడానికి ముఖ్య కారణం గద్దర్. ఆయన నాకు తండ్రితో సమానం. ఆయన ఈ రోజున మన మధ్య లేక పోవడం చాలా బాధాకరం. అయితే ఆయన కూతురు వెన్నెలని ఆయన రూపంలో మాకు బహుమతిగా అందించారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి సంబంధించిన సమస్యల్ని తెలియజేస్తూ ఈ సినిమా తీశాం' అని దర్శకుడు సత్యా రెడ్డి చెప్పారు.

ఈచిత్రానికి సంగీతం : కోటి, ఎడిటర్ : మేనగ శ్రీను, కథ, స్క్రీన్ ప్లే, నిర్మాత, దర్శకత్వం : పి.సత్యా రెడ్డి.

నవతెలంగాణ మానవి
హైదరాబాద్
శనివారం
25 నవంబర్ 2023
www.navatelangana.com



అతనిది ప్రేమ కాదు

ప్రేమ పేరుతో మోసపోతున్న అమ్మాయిల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. పైగా ఈ ఆధునిక సమాజంలో సహజీవనం పేరుతో మరిన్ని మోసాలు జరుగుతున్నాయి. పెండ్లికి ముందే కలిసి బతుకుతూ ఒకరినొకరు అర్థం చేసుకున్న తర్వాత పెండ్లి చేసుకోవాలని కొందరు భావిస్తున్నారు. కానీ ఇలాంటి రిలేషన్ షిప్స్ వల్ల కొంత మంది అమ్మాయిలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి సమస్యతోనే రోషిని ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

రోషినికి 28 ఏండ్లు ఉంటాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. తల్లిదండ్రులు గ్రామంలో ఉంటారు. ఆమె ఉద్యోగ రీత్యా సిటీలో ఉంటుంది. ఆఫీస్‌లో తన కోలిగ్ రాజుతో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం, చనువు ఏర్పడింది. తమ బంధాన్ని వాళ్ళు ముందుకు తీసుకెళ్ళాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆఫీసుకు దగ్గర్లో ఇద్దరూ కలిసి ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకున్న తర్వాత ఈ సహజీవనాన్ని పెండ్లి వరకు తీసుకెళ్ళాలని రోషిని భావించింది.

కానీ ఆరు నెలల తర్వాత రాజు వేరే అమ్మాయిలతో మాట్లాడం, కలిసి తిరగుతుండేవాడు. అది చూసి ఆమెకు చాలా కోపం వచ్చింది. తనతో రిలేషన్‌షిప్‌లో ఉంటూ ఇతర అమ్మాయిలతో మాట్లాడటం ఏంటని అతన్ని నిలదీసింది. దానికి అతను 'నా జీవితం నా ఇష్టం, నాకు నచ్చినట్టుగా నేను ఉంటాను. నన్ను అడిగే హక్కు నీకు లేదు. నీకు నచ్చితే నాతో ఉండు లేకపోతే వెళ్ళిపోవచ్చు. నేను నిన్ను బలవంతంగా ఇక్కడికి తీసుకురాలేదు. నీకు నాతో ఉండాలనిపించింది కాబట్టి వచ్చావు. అంతే గానీ నన్ను ప్రశ్నించే హక్కు నీకు లేదు' అన్నాడు.

తల్లిదండ్రులకు తెలియకుండా ఒక అబ్బాయితో లివింగ్ రిలేషన్‌షిప్‌లో ఉంటున్న తన సమస్య ఎవరి చెప్పుకోవాలో ఆమెకు అర్థం కాలేదు. రోషిని రాజును మనస్ఫూర్తిగా ప్రేమించింది. తాను అంతగా ప్రేమించిన వ్యక్తి వేరే అమ్మాయిలతో చనువుగా ఉంటే చూడలేక పోయింది. చివరకు బాధ భరించలేక ఆత్మహత్యాయత్నానికి సిద్ధపడింది. దాంతో స్నేహితులు ఆమెను తీసుకుని సలహా కోసం ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చారు.

రోషిని సమస్య గురించి తెలుసుకున్న మేము వెంటనే రాజును పిలిపించి మాట్లాడితే తెలిసింది ఏమిటంటే... రాజుకు రోషినిని పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదు. కలిసి సహజీవనం చేయడానికి, ప్రేమ, స్నేహం లాంటివి కూడా అవసరం లేదన్నట్టు మాట్లాడాడు. 'అప్పట్లో ఏదో అలా అనిపించింది కాబట్టి కలిసి ఉన్నాము' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు. అతనికి రోషిని అంటే ఇష్టం లేదు. ఆమెపై ప్రేమ అసలే లేదు. పైగా 'సహజీవనం చేసినంత మాత్రానా తనపై ప్రేమ కలగాలని ఏమీ లేదు. ఒకరితో కలిసి ఉంటూనే వేరొకరితో సంబంధం పెట్టుకుంటున్న రోజులివి. నేనేమీ ఆమెను పెండ్లి చేసుకోలేదు. నచ్చితే జీవితాంతం కలిసి ఉంటాను, లేదంటే వేరే అమ్మాయిని పెండ్లి చేసుకుంటాను. ఈ ఉద్దేశంతోనే రోషినితో సహజీవనానికి ఒప్పుకున్నాను. ఇప్పుడు ఆమెపై నాకు ఎలాంటి ఫీలింగ్ లేదు. ఆమెకు ఇష్టం అయితే నాతో ఉంటుంది. లేదంటే లేదు. అంతే కాని బలవంతంగా తనతో కలిసి ఉండమనే హక్కు ఆమెకు లేదు. నాపై ప్రేమ పెంచుకోమని నేను ఆమెకు చెప్పలేదు. ఆమెనే నాపై ఫీలింగ్స్ పెంచుకుంది. మేము సహజీవనంలోకి రాకముందే ఇలాంటి విషయాల గురించి మాట్లాడుకున్నాము. ఎవరు, ఎవరితో అయినా మాట్లాడుకోవచ్చు, ఎవరితోనైనా స్నేహం చేయవచ్చు. ఎవరినైనా ప్రేమించ వచ్చు. ఈ విషయాల్లో ఒకరిని ఒకరు ప్రశ్నిచకూడదు అని ముందే అనుకున్నాం. అప్పుడు సరే అని చెప్పి ఇప్పుడు నువ్వు నాకే కావాలి, నీపై నేను ప్రేమ పెంచుకున్నాను అంటే అది నా తప్పు కాదు. ఏది ఏమైనా నాకు ఆమెపై ప్రేమలేదు. పెండ్లి చేసుకోవాలనే ఆలోచన అసలే లేదు. ఇక ఈ విషయంలో ఎలాంటి మార్పు లేదు' అని కచ్చితంగా చెప్పాడు.


రాజు మాటలు విన్న తర్వాత కూడా రోషిని 'రాజు అంటే నాకు చాలా ఇష్టం. నేను అతన్ని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. అతనితో ఈ జర్నీ ప్రారంభించిందే మా బంధం పెండ్లి వరకు వెళుతుందని. కానీ ఇప్పుడు రాజు వేరే అమ్మాయి కోసం నన్ను వద్దు అనుకోవడం ఎంత వరకు సరైనది మీరే నాకు న్యాయం చెప్పండి' అంది.

దానికి మేము 'రాజు నీ విషయంలో చాలా క్లారిటీగా ఉన్నాడు. నీపై ఏ మాత్రం ప్రేమ లేకుండా మాట్లాడుతున్నాడు. పైగా మీరిద్దరు ముందే అన్ని విషయాల గురించి చర్చించుకున్నామని చెబుతున్నాడు. ఏ మాత్రం ప్రేమ, అభిమానం లేని వ్యక్తితో నువ్వు ఎలా కలిసుండగలవు. అతన్ని పెండ్లి చేసుకుని జీవితాంతం ఎలా ఉంటావు. తన అవసరాల కోసం నీతో కలిసి ఉన్న అతనితో సంతోషంగా ఎలా ఉండగలవు? అందుకే లివింగ్ రిలేషన్‌షిప్‌లోకి వెళ్ళడానికి ముందే ఇవన్నీ జాగ్రత్తగా ఆలోచించుకోవాలి. మనిషి ఆలోచనలు ఎలాగైనా మారిపోవచ్చు. ప్రస్తుతం చుట్టూ ఉన్న సమాజం కూడా ఇలాగే ఉంది.

నువ్వే కాదు ఇలాంటి రిలేషన్‌షిప్‌తో చాలా మంది అమ్మాయిలు ఇలాగే నష్టపోతున్నారు. నీలాంటి వాళ్ళు ప్రస్తుతం మన చుట్టూ ఎంతోమంది ఉన్నారు. ఇప్పటికైనా నువ్వు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో. అతని గురించి ఆలోచించి అనవసరంగా నీ జీవితాన్ని నాశనం చేసుకోకు. మంచి ఉద్యోగం ఉంది. నీకు మంచి భవిష్యత్ ఉంది. కాబట్టి అతన్ని మర్చిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభించు. ఇద్దరూ అర్థం చేసుకున్న తర్వాత పెండ్లి చేసుకోవాలనుకోవడం మంచి విషయమే. కానీ ఎంపిక చేసుకునే మనిషినీ, విధానం గురించి కాస్త ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి' అని చెప్పాము.

అంతా విన్న తర్వాత రోషిని 'అవును మేడమ్ మీరు చెప్పింది నిజమే. నేనంటే ఇష్టం లేని అతనితో నేను ఎలా ఉండగలను. రాజును నమ్మి మోసపోయాను. ఇకపై అతని గురించి ఆలోచించను. నా భవిష్యత్‌పై దృష్టి పెడతాను' అని చెప్పి వెళ్ళిపోయింది.

- వై. వరలక్ష్మి, 9948794051



ఇలాంటి రిలేషన్‌షిప్‌తో చాలా మంది అమ్మాయిలు ఇలాగే నష్టపోతున్నారు. నీలాంటి వాళ్ళు ప్రస్తుతం మన చుట్టూ ఎంతోమంది ఉన్నారు. ఇప్పటికైనా నువ్వు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో. అతని గురించి ఆలోచించి అనవసరంగా నీ జీవితాన్ని నాశనం చేసుకోకు. మంచి ఉద్యోగం ఉంది. నీకు మంచి భవిష్యత్ ఉంది. కాబట్టి అతన్ని మర్చిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభించు.

అంజీరతో అద్భుత ప్రయోజనాలు



ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండే అంజీరా పండ్లు మనకు ఎన్నో రకాలుగా మేలు చేస్తాయి. వాటితో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలుసుకుందాం.

- బరువు తగ్గాలనుకునేవారు అంజీర తింటే... చక్కగా తగ్గుతారు. అలాగని మరీ ఎక్కువ అంజీరలు తింటే బరువు పెరుగుతారు. అందువల్ల రోజుకు నాలుగైదుకి మించకుండా తింటే మంచిదే.
- శరీరంలో పొటాషియం తక్కువగా, సోడియం ఎక్కువగా ఉంటే బీపీ పెరుగుతుంది. అంజీరలో పొటాషియం ఎక్కువ, సోడియం తక్కువ. అందువల్ల వీటిని తింటే బీపీ తగ్గుతుంది.
- షుగర్ వ్యాధిని కంట్రోల్ చెయ్యడానికి అంజీరలు పనికొస్తాయి. ఎందుకంటే వీటిలో ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువ కాబట్టి. అంజీరలోని పొటాషియం మన శరీరంలోని షుగర్ లెవెల్స్‌ని కంట్రోల్ చేస్తుంది.
- పైల్స్ సమస్య వేధిస్తుంటే... రాత్రంతా నీటిలో నానబెట్టిన డ్రై అంజీరలను వాటర్‌తో సహా తీసుకుంటే సరి. పైల్స్ సమస్య పరిష్కారమవుతుంది.
- లైంగిక సమస్యలు, సంతానలేమితో బాధపడేవారికి అంజీరలు అద్భుతంగా పని చేస్తాయి. స్పెర్మ్ కౌంట్ పెంచేందుకు ఇవి దోహదపడతాయి.
- మన శరీరంలోకి విషవ్యర్థాలు, సూక్ష్మ క్రిములు, బ్యాక్టీరియా లాంటివి రాకుండా చేసే పాలీఫెనాల్స్, యాంటీఆక్సిడెంట్స్ వంటివి అంజీరలో చాలా ఉంటాయి. కాబట్టి వాటిని తినాలి.

పిల్లల కోసం ఇలా ప్రయత్నిద్దామా...

ఇప్పటి పిల్లల తిండి మారిపోయింది. ఐదేండ్లకే నూడిల్సూ, పిజ్జాలు అంటున్నారు. రోజూ వేపుళ్లు, బేకరీ పదార్థాలు లేనిదే ముద్ద దిగదని మారం చేస్తున్నారు. ఇదేమంత మంచి అలవాటు కాదని అందరికీ తెలుసు. కానీ ఏం చేస్తాం! గారాల పిల్లలు కదా! కాకపోతే ఆ పనికి మాలిన తిండి తిని వారు లావైపోతున్నారనీ, డయాబెటిస్ వంటి రోగాలకు సిద్ధపడుతున్నారనీ తెగ బాధపడిపోతుంటాం. పిల్లలతో మంచి పోషకాహారాన్ని తినిపించే చిట్కా ఒకటి కనుక్కొన్నామని చెబుతున్నారు పరిశోధకులు. అదేమిటో మీరే చూడండి...

- పిల్లలకి ఇష్టమైన ఆహారాన్ని అందిస్తూనే, వాటిలో ఉడికించిన కూరగాయల ముక్కలు కలిపితే ఎలా ఉంటుంది అన్న ఆలోచన వచ్చింది నిపుణులకి. అయితే ఇలా చేయడం వల్ల పిల్లలు ఆహారం రుచి మారిపోతుందనీ, పిల్లలు ఆ కాస్త ఆహారాన్ని కూడా తినరని కొందరు వాదించారు. దాంతో ఈ చిట్కా పిల్లల మీద ఏ మేరకు పని చేస్తుందో తెలుసుకోవాలనుకున్నారు.
- 39 మంది పిల్లలకి మూడు రోజుల పాటు వారికి ఇష్టమైన ఆహారంలో కాయగూరలను ఉడికించి అందించారు. ఈ పిల్లలంతా కూడా 3 నుంచి 6 ఏండ్ల లోపువారే. వీరికి ఇష్టమైన బ్రెడ్డు, పాస్తా, చికెన్ నూడుల్స్ లాంటి పదార్థాలలో కూరగాయలను కలిపి ఇచ్చారు. ఆశ్చర్యంగా పిల్లలు ఎలాంటి తేడా లేకుండా ఎప్పటిలాగే శుభ్రంగా ఆ పదార్థాలని తినేశారు. ఇలా పిల్లలకి ఇష్టమైన ఆహారంలో ఉడికిన కూరలను కలపడం వల్ల, వారి రోజువారీ ఆహారంలో కూరగాయల శాతం రెట్టింపు అయ్యిందట. అంతేకాదు! ఇలా కూరగాయలు తినడం వల్ల వాళ్లు చిరుతిళ్ల జోలికి పోవడం కూడా తగ్గిపోయిందట.
- పిల్లలు కేవలం కాలరీలు మాత్రమే అందించే తిండి తింటున్నారు అని వాపోయే కంటే ఇలాంటి చిట్కాలు పాటించమని సూచిస్తున్నారు నిపుణులు. వారికి స్నాక్స్‌తో పాటుగా కూరగాయల ముక్కలు పెట్టడం, ఇష్టమైన ఆహారంలో కూరలు వేయడం, ఉడికించిన కూరల తోనే రుచికరమైన పదార్థాలు వండే ప్రయత్నం చేయడం... లాంటి ఉపాయాలతో ఎలాగోలా పిల్లలకి తగినన్ని కూరలు అందేలా చూడమని హెచ్చరిస్తున్నారు.



సింగరేణి ప్రయివేటీకరణకు యత్నం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చి ఇక్కడ యువతకు ఉపాధి, ఉద్యోగాలు పెంచుతామన్నారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణి కారుణ్యనియామకాలను అటెక్కించి ఆగం చేశారని, తమ ప్రభుత్వం వచ్చాక 22వేల మంది యువతకు వారసత్వ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. మాయమాటలు చెప్పి రైతులను, కార్మికులను ఆగం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, దాన్ని తిప్పకొట్టాలని పిలుపునిచ్చారు. రైతులకు తమ భూములపై సర్వహక్కులు ఉండేలా ధరణిని తీసుకొస్తే.. దాన్ని బంగాళఖాతంలో వేస్తామని అంటున్నారని, మళ్లీ గతంలోలా వీఆర్ఓ వ్యవస్థను తీసుకొచ్చి పైరవీల రాజ్యానికి ఆజ్యం పోస్తామంటున్నారని ఆరోపించారు. ఓ క్రమపద్ధతిలో రాష్ట్రాన్ని బాగు చేసుకున్నామని, అలాంటి పదేండ్ల కష్టాన్ని బుడిదలోపోసిన పన్నీరు చేయెుద్దని కోరారు.

బీజేపీకి ఓటేస్తే బురదలో వేసినట్లే..!

మంచిర్యాల జిల్లా నస్పూర్ సభలో మాట్లాడుతూ.. సింగరేణి ప్రయివేటీకరణకు ప్రాధాన్యమిస్తున్న బీజేపీకి ఓటేస్తే మోరీ (మురికికాల్వ)లో వేసినట్టేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తుందని, దళారుల రాజ్యం వస్తుందని చెప్పారు. సింగరేణి చైతన్యం కలిగిన ప్రాంతమని, ఇక్కడ 45వేల మందికి ఇండ్ల స్థలాలకు పట్టాలు జారీ చేశామన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజా బలం ఉందని, తెలంగాణకు ప్రజలే బాస్‌లు అని.. ఢిల్లీలో ఉండరని వ్యాఖ్యానించారు. గల్లీకో పేకాట క్లబ్ ఏర్పాటు చేసే కాంగ్రెస్ నాయకులకు ఓటేస్తారా.. లేక నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించే బీఆర్ఎస్‌కు వేస్తారా ఆలోచించాలని సూచించారు.

గిరిజనేతరులకూ పోడు పట్టాలు ఇప్పిస్తాం

ములుగు, భూపాలపల్లిల్లో నిర్వహించిన సభల్లో.. గిరిజనేతరులకు సైతం పోడు భూముల పట్టాలు ఇప్పిస్తామని ప్రకటించారు. సమ్మక్క సారలమ్మ జాతరకు తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ప్రతేడాది రూ.80కోట్ల నుంచి రూ.100కోట్లు ఖర్చుపెడుతూ నిర్వహించుకుంటున్నామన్నారు. పోడు భూములు పంపిణీ చేశామని, గిరిజనులపై ఉన్న కేసులను ఎత్తివేశామని తెలిపారు. పోడు భూములకు రైతుబంధు, బీమా చేయించామని, గిరిజన ప్రాంతాల్లో త్రీ ఫేజ్ కనెక్షన్లు ఇస్తున్నట్టు చెప్పారు. వరదల సమయంలో రామన్నపేట ప్రాంతం అంతా పర్యటించి డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. సింగరేణి ప్రాంతమైన భూపాలపల్లి చిన్న గ్రామంలా ఉండేదని, నేడు జిల్లా కేంద్రంగా రూపాంతరం చెంది, అత్యంత అభివృద్ధి చెందిన పట్టణాల్లో ఒకటని అన్నారు. భూపాలపల్లిలో ఐటీ టవర్, ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

తుది దశలో రెస్క్యూ ఆపరేషన్

- ఉత్తరాఖండ్ సీఎం ధమీ వెల్లడి

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ టన్నెల్ కుప్పకూలి అందులో చిక్కుకుపోయిన కార్మికులను రక్షించే చర్యలు తుది దశలో ఉన్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధమీ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలు కలిసి పని చేస్తున్నాయని చెప్పారు. ఈనెల 12న సొరంగం కూలిపోయి 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి 13 రోజుల పాటు కార్మికులు అందులోనే భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఉంటున్నారు. అయితే, కార్మికులను రక్షించే క్రమంలో అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. డ్రిల్లింగ్ పనులకు గుర్తు తెలియని ఇనుప పట్టీ తాకటం, దానిని గ్యాస్ కట్టర్‌తో తొలగించాక పనులు మళ్లీ మొదలు కావటం జరిగాయి. ఇలాంటి అవాంతరాలు, అంతరాయాల నేపథ్యంలో కార్మికుల కోసం బోర్డ్ గేమ్స్, పేక ముక్కలను రెస్క్యూ టీమ్‌లు అందిస్తున్నాయి. "లూడో, చెస్ బోర్డు, పేకముక్కలు వంటి వాటిని చిక్కుకున్న కార్మికులకు అందించాలనుకుంటున్నాం.

దీంతో వారికి ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆపరేషన్ ఆలస్యమవుతున్నది. ఇందుకు ఇంకా సమయం పట్టేలా కనిపిస్తున్నది" అని ఘటనా స్థలం వద్ద ఉన్న ఒక మానసిక వైద్యులు డాక్టర్ రోహిత్ గోన్‌డ్వాల్ తెలిపారు. కాగా, అంతకముందు మధ్యాహ్నం సమయంలో సిల్క్యారా టన్నెల్ సైట్ వద్ద కొనసాగుతున్న రక్షణ చర్యలను పర్యవేక్షించటానికి కేంద్ర మంత్రి వి.కె సింగ్ అక్కడకు చేరుకున్నారు.

ఆ మూడు పార్టీలకు బుద్ధి చెప్పండి

- ఓట్ల కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లు
- అసెంబ్లీ, పార్లమెంట్‌లో కమ్యూనిస్టులకు బలమివ్వండి
- కనకారెడ్డితోనే జనగామ నియోజకవర్గ అభివృద్ధి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ సుభాషిణి అలీ

నవతెలంగాణ-జనగామ

ప్రజా వ్యతిరేక పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పి ప్రజా పక్షపాతి సీపీఐ(ఎం)ను ఆదరించాలని ఆపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ సుభాషిణి అలీ కోరారు. జనగామ నియోజకవర్గ సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి మోకు కనకారెడ్డి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం జనగామ జిల్లాలోని ప్రెస్టన్ గ్రౌండ్ నుంచి ఆర్టీసీ చౌరస్తా, నెహ్రూ పార్కు మీదుగా ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ పక్కనున్న ధర్మ కొండల్‌రెడ్డి గ్రౌండ్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిద్దిపేట జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు మరింత తీవ్రమయ్యాయని ఆరోపించారు. రైతు వ్యతిరేక చట్టాలు బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయగా, రైతుల వ్యతిరేకతతో వాటిని బీజేపీ ప్రభుత్వం వెనక్కి తీసుకున్నదని తెలిపారు. మోడీ ప్రభుత్వ విధానాల వల్ల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. మోడీ పాలనలో దేశ చరిత్రలో ఎప్పుడూలేని స్థాయికి నిరుద్యోగం, మహిళలపై దాడులు, కుల దురహంకార దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మాట నిలబెట్టుకోకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టిందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలు, వనరులను గుప్పిట్లో పెట్టుకుని నియంతృత్వం అమలు చేస్తూ వారి హక్కులను హరిస్తున్నదని తెలిపారు. ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలనూ అమలుచేయలేదని, సమస్యలు పరిష్కరించలేదని చెప్పారు. ఓట్ల కోసం మహిళా రిజర్వేషన్ బిల్లు తెచ్చారని, అమలు మాత్రం ఇప్పుడు జరగదని తేల్చి చెప్పేశారని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడి చేస్తున్నారన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం ఇసుమంత కూడా పని చేయకుండా సంక్షేమ పథకాలతో ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. చదువుకున్న యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే నీతి నిజాయితీగా ప్రజల కోసం పని చేసే సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి మోకు కనకారెడ్డిని అత్యధిక మెజారిటీతో ఆదరించాలని కోరారు. సభలో రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్, కాసు మాధవి, ఆర్ఎల్ మూర్తి, హన్మకొండ జిల్లా కార్యదర్శి బోట్ల చక్రపాణి, జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య, రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, సింగారాపు రమేష్, రాపర్తి సోమయ్య, సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ళబండి శశిధర్, సత్తిరెడ్డి, జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జనగామ, సిద్దిపేట జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపండి

(మొదటిపేజీ తరువాయి)

పోరాడుతున్న యర్రా శ్రీకాంత్‌ను గెలిపించాల్సిందిగా పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) ప్రజలను నమ్మితే.. ఇతరులు డబ్బులను నమ్ముకున్నారు : పోతినేని సుదర్శన్

సీపీఐ(ఎం) ప్రజలను నమ్మితే ఇతర పార్టీలు డబ్బును నమ్ముకున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. రూ. రెండు, మూడు వేల చొప్పున పంపకాలు మొదలయ్యాయని, అదంతా కష్టజీవుల సంపదేనని తెలిపారు. ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, మార్కెట్ తరలింపు.. ఇతర ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర సీపీఐ(ఎం) అభ్యర్థికి మాత్రమే ఉందని గుర్తు చేశారు. పార్టీలు మారే వాళ్లకు ఓట్లు వెయ్యాలా.. మారని వాళ్లకు వేయాలా ఆలోచించాలని అభ్యర్థి యర్రా శ్రీకాంత్ కోరారు.

రోడ్ షోలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై. విక్రమ్, కార్పొరేటర్లు యల్లంపల్లి వెంకట్రావు, యర్రా గోపి, జిల్లా నాయకులు యర్రా శ్రీనివాస్, ఎస్. నవీన్ రెడ్డి, తుమ్మా విష్ణు, పి.రమ్య, భూక్యా శ్రీనివాస్, బండారు యాకయ్య, రమేష్, వజినేపల్లి శ్రీనివాస్, యర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనా..? జాగ్రత్తా...?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఓట్ల పండగకు ఆరంటే ఆర్రోజులే సమయముంది. ఈ కొద్ది రోజులను సద్వినియోగం చేసుకునేందుకు పార్టీలన్నీ ఉవ్విళ్లూరుతున్నాయి. పోటా పోటీగా సభలు, సమావేశాలు, రోడ్ షోలు నిర్వహిస్తూ నేతలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయితే వివిధ నివేదికలు, సర్వేల సారాంశమో.. లేక జనం మూడును గ్రహించారో తెలియదుగానీ... అధికార బీఆర్ఎస్ నేతలు తమ ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ఇందులో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ముందు వరుసలో ఉన్నారు. తనదైన శైలిలో క్యాంపెయిన్‌ను రక్తి కట్టిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకూ యూట్యూబ్‌లో తమ మాటలు, పాటలు, యాసల ద్వారా ఫేమస్ అయిన గంగవ్వతో ఆడి పాడటం, ఛాయ్ కేఫ్‌ల్లో సరాదాగా గడపటం, బిర్యానీ సెంటర్లలో యువతతో కలిసి ఆహారాన్ని ఆస్వాదించటం తదితరాంశాలతో అందరి దృష్టినీ తన వైపునకు తిప్పుకున్న ఆయన... తాజాగా శుక్రవారం సైతం అదే ఒరవడిని కొనసాగించారు. మెట్రోరైల్‌లో రాయదుర్గం నుంచి బేగంపేట వరకూ ప్రయాణించటం ద్వారా ప్రయాణీకులతో ముచ్చటించారు. ఐటీ ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు, యువతీ యువకులతో ఆయన మాటా మంతీ జరిపారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో ఆటో యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం వివిధ పత్రికాధిపతులు, సంపాదకులతో ఆయన ఇష్టాగోష్ఠి నిర్వహించారు. తద్వారా ప్రస్తుత ఎన్నికలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సూచనలు, సలహాలను స్వీకరించారు. వీటన్నింటికంటే ముందు ఉదయం క్రెడాయ్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో రియల్ ఎస్టేటర్లతో ఆయన భేటీ అయ్యారు.

ఈ రకంగా కేటీఆర్... పాశ్చాత్య దేశాల శైలిలో ప్రచారంలో కొత్త ఒరవడి సృష్టించటం గులాబీ శ్రేణుల్లో జోష్ నింపుతోంది. అదే సమయంలో ప్రస్తుత ఎన్నికల్లో కారుకు ప్రతికూల పరిస్థితులు ఎదురు కాబోతున్నాయన్న సంకేతాల నేపథ్యంలోనే ఆయన ఈ రకంగా అందరితోనూ సమాలోచనలు, సంప్రదింపులు జరుపుతున్నారనే అభిప్రాయాలూ వినబడుతున్నాయి. ఇలాంటి భేటీలు నిర్వహించటం ద్వారా తమ ప్రభుత్వ వైఫల్యాలను, పార్టీ బలహీనతలను తెలుసుకునేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారనేది కొందరి వాదన. తద్వారా ఉన్న ఈ కొద్దిపాటి సమయాన్ని వినియోగించుకుని... లోపాలు, లోటుపాట్లను సరి చేసుకుని ముందుకు పోవాలన్నది ఆయన వ్యూహంగా కనబడుతున్నది. మరోవైపు కేటీఆర్ మాట్లాడినట్టుగా వైరలవుతున్న ఆడియోలు సైతం బీఆర్ఎస్‌కు ఎదురవుతున్న ఎదురుగాలికి నిదర్శనాలుగా కనబడుతున్నాయి. 'కాంగ్రెస్ అభ్యర్థుల్లో 30 మంది మనవాళ్లే. వారందరూ గెలిస్తే మన పార్టీలోకే వస్తారు..' 'ప్రస్తుత ఎన్నికల్లో ఏమరుపాటుగా ఉండొద్దు. సీరియస్‌గా తీసుకోండి. ఏ చిన్న అవకాశాన్నీ వదలొద్దు...' లాంటి ఆడియోలు ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. దీంతోపాటు బీఆర్ఎస్ నుంచే అత్యధికంగా ఫేక్ వీడియోలు రిలీజవుతున్నాయనే విమర్శలు ఒకవైపు కొనసాగుతుండగా... 'కాంగ్రెస్ వాళ్లు విడుదల చేసే ఫేక్ వీడియోల పట్ల జాగ్రత్తగా ఉండండి...' అంటూ కేటీఆర్ ట్వీట్ చేయటం సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. ఈ క్రమంలో తమకెదురవుతున్న ప్రతికూల పరిస్థితుల్లోంచి వచ్చిన ఆందోళనను తట్టుకునేందుకు, ఆ రకంగా క్యాడర్‌ను అప్రమత్తం చేసేందుకే ఆయన ఇలాంటి పద్ధతులను ఎంచుకుంటున్నారని వినికిడి.

సుప్రీంకోర్టు తీర్పును చదవండి

(మొదటిపేజీ తరువాయి)

జాప్యానికి వ్యతిరేకంగా కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది.

కేరళ రాష్ట్రం తరపున సీనియర్ న్యాయవాది, మాజీ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ గవర్నర్ ఆమోదం కోసం పంపిన అనేక బిల్లులు గత రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేరళలోనూ పంజాబ్ పరిస్థితి నెలకొందన్నారు. బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని మంత్రులందరూ గవర్నర్‌ను కలిశారని, ముఖ్యమంత్రి కూడా చాలాసార్లు కలిశారని అన్నారు. అయినప్పటికీ ఫలితం లేదని తెలిపారు. ఎనిమిది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వేణుగోపాల్ అన్నారు. కోర్టు జోక్యం చేసుకుని గవర్నర్‌కు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కెకె వేణుగోపాల్ డిమాండ్ చేశారు. 'మేం గురువారం రాత్రి పంజాబ్ గవర్నర్ కేసులో ఆర్డర్‌ను అప్‌లోడ్ చేసాం. ఆర్డర్‌ని చూడమని గవర్నర్ సెక్రటరీకి చెప్పండి. మీ ప్రతిస్పందన ఏమిటో మంగళవారం మాకు తెలపండి" అని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణికి సీజేఐ చంద్రచూడ్ సూచించారు. అయితే అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి మాట్లాడుతూ మంగళవారం తాను హాజరు కావడం కష్టమని, కేసును శుక్రవారానికి వాయిదా వేయాలని అభ్యర్థించారు. అయితే దీన్ని కెకె వేణుగోపాల్ వ్యతిరేకించారు. కేసు తీవ్రత దృష్ట్యా వీలైనంత త్వరగా ఈ పిటిషన్‌ను విచారించాలని కోరారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ స్పందిస్తూ.. పిటిషన్‌ను బుధవారం పరిశీలిస్తామని చెప్పారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్, పంజాబ్ గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ఉంచారని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో తీవ్రంగా విమర్శించింది.

మన సంపద మనకే దక్కాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆ అమ్మాయి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అవమానించిందన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతలు అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తే కేసులు పెట్టడం, ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారిందన్నారు. మోడీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను తీవ్రంగా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని, ఇక్కడ కొట్లాడుకుంటున్నట్టు నటిస్తూ అంతర్గతంగా మిలాఖతై పనిచేస్తున్నారని తెలిపారు. ఈ రెండు పార్టీలతో ఎంఐఎం జతకట్టిందన్నారు. రాహుల్‌ను ఎంఐఎం నాయకులు అసదుద్దీన్ ఒవైసీ విమర్శిస్తున్నారని, రాహుల్ దేశ సమైక్యత కోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 4 వేల కిలోమీటర్లు భారత్ జోడో పాదయాత్ర చేశారన్నారు. సభలో కర్నాటక మంత్రి దీపక్ గుండురావు, టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి, డాక్టర్ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి, ఝాన్సీరెడ్డి, మహబూబాబాద్, వరంగల్ డీసీసీ అధ్యక్షులు భరత్‌చందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సభలో ప్రియాంక మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాదంలో కూరుకుపోయి దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు చేస్తోందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాల్లో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారని, ఆయన అవినీతి పాలనను అంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. 'మార్పు రావాలి.. కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రుణమాఫీ చేశామన్నారు. హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజ్ ఏర్పాటుతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ మహిళలను తమ కాళ్లపై నిలబడేలా చేస్తుందన్నారు.



నా హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి

ప్రజల గొంతుకగా అసెంబ్లీలో అడుగుపెడతా.. మిర్యాలగూడ సీపీఐ(ఎం) అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి

"పోరాటాల గడ్డగా నిలిచిన మిర్యాలగూడలో ఎర్రజెండా ఎగరడం ఖాయం.. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలోనే నియోజవర్గ అభివృద్ధి జరిగింది" అని సీపీఐ(ఎం) అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జిల్లా సాధిస్తానని హామీ ఇస్తున్నాను. ప్రజల నుంచి తనకు విశేష ఆదరణ లభిస్తున్నదని, తన గెలుపు ఖాయమని జూలకంటి రంగన్న నవతెలంగాణకు వివరించారు.

మీ హయాంలో ఎలాంటి అభివృద్ధి చేశారు?

మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి 1994, 2004, 2009 ఎన్నికల్లో గెలుపొంది ఎమ్మెల్యేగా పనిచేశాను. 1999, 2004లో పాత మిర్యాలగూడ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. నియోజవర్గం మొత్తం ఆయకట్టు కింద ఉండటం వల్ల ప్రతి ఎకరాకు నీరు అందేలా ఎడమ కాలువ మేజర్లు, మైనర్లు మరమ్మతులు చేయించా. 2009లో కొత్తగా ఏర్పడిన నియోజకవర్గంలో ఆలగడప, భీమవరం బ్రిడ్జిలను నిర్మించాను. దీనివల్ల ప్రజలకు రాకపోకల సౌకర్యం ఏర్పడింది. అడివిదేవులపల్లిలో లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు, మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారించేందుకు హనుమాన్ పేట వద్ద బ్రిడ్జి నిర్మించాం.ఎన్ఎస్‌పీ క్యాంపులో సుందరయ్య పార్కుతో పాటు నిరుద్యోగుల కోసం లైబ్రరీని ఏర్పాటుచేయించాం. చైతన్య నగర్‌లో బోటింగ్ పార్కు ఏర్పాటు చేయించాను. కార్మికుల కోసం ఈఎస్ఐ ఆస్పత్రి, ఏరియాస్పత్రిని వంద పడకల హాస్పటల్‌గా పెంపుదల, పట్టణ నడిబొడ్డులో రైతు బజార్ తదితర ప్రజలకు అవసరమైన పనుల చేయించాను.

ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు మీకు ఉన్న తేడా..?

బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు, కమ్యూనిస్టు అభ్యర్థినైన నాకు చాలా తేడా ఉంది. వాళ్లు డబ్బును నమ్ముకుంటే నేను ప్రజలను నమ్ముకున్నాను. బీఆర్ఎస్ అభ్యర్థి భాస్కరరావు నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేదు. కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి అన్నదానం, మజ్జిగ పంపిణీ లాంటివి చేసి సామాజిక సేవ ముసుగులో రాజకీయం చేస్తున్నారు.

అతను సీపీఐ(ఎం) మద్దతుతో వార్డు కౌన్సిలర్‌గా గెలిచి రూ.2 కోట్ల సొంత నిధులతో వార్డును అభివద్ధి చేస్తానని హామీ ఇచ్చి ముఖం చాటేసాడు. వార్డు ప్రజల బాగోగులు చూడలేని అభ్యర్థి ఎమ్మెల్యే అయితే ఏం చేస్తాడు. నేను ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని వార్డుల్లో ప్రచారాన్ని పూర్తి చేశాను. రెండో దశలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నాను. నిరంతరం


ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తా.



విద్యార్థి ఉద్యమాల ద్వారా రాజకీయాల్లోకి వచ్చి కార్మికునిగా, కార్మికోద్యమ నాయకుడిగా ప్రజా పోరాటాల్లో పాల్గొన్న సీపీఐ(ఎం) పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి జె.మల్లిఖార్జున్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. 1985లో పటాన్‌చెరులోని శాండ్విక్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేసి, అనంతరం అల్విన్ వాచ్ పరిశ్రమలో 2000 వరకు పనిచేశారు. అనంతరం సీపీఐ(ఎం) పూర్తికాలం కార్యకర్తగా ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేస్తూ కార్మికులకు కనీస వేతనాలు, హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహిం చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతనాల సవరణ సలహా మండలి సభ్యుడిగా ఉన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే పటాన్‌చెరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం పాటుపడ తానని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నవతెలంగాణ ప్రతినిధితో తెలిపారు. కనీస వేతనాల సమస్యలపై ఉద్యమిస్తానని అన్నారు.

కనీస వేతనాల సమస్యపై ఉద్యమాలు

పటాన్‌చెరు సమగ్ర అభివృద్ధికి పాటుపడతా : సీపీఐ(ఎం) అభ్యర్థి జె.మల్లిఖార్జున్

నియోజకవర్గ సమస్యలు..?

మినీ ఇండియాగా పిలవబడే పటాన్‌చెరు నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పక్కనే ఉంది. వేలాది పరిశ్రమలు విస్తరించినా నియోజకవర్గ ప్రజల జీవితాల్లో మార్పు లేదు.

గుమ్మడిదల, జిన్నారం ప్రాంతంలో ఇప్పటికీ రోడ్లులేవు. వ్యవసాయం జీవనాధారంగా ఉంది. వాణిజ్య పంటల సాగుకు అవకాశమున్నా కోల్డ్ స్టోరేజీల్లేవు. దీంతో రైతులు నష్టపోతున్నారు. చుట్టూ పరిశ్రమలున్నా స్థానికులకు ఉపాధి దొరకడం లేదు. ఈ ప్రాంతంలో అప్పటి కమ్యూనిస్టు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కట్టించిన ఇండ్లే కనిపిస్తున్నాయి.

ఆ తర్వాత చాలా ప్రభుత్వాలొచ్చినా పేదలకు ఇండ్లు, స్థలాలివ్వలేదు. కార్మిక వాడల్లో కార్మిక భవనాలు, ఆస్పత్రులు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, మంచినీటి వసతి, ప్రాంతీయ భాషలో చదువుకునేందుకు స్కూల్స్ లేవు. పారిశ్రామిక ప్రాంతమైనా పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల్లేవు. మియాపూర్- సంగారెడ్డి వరకు మెట్రోలైన్ విస్తరణ జరగకపోవడంతో నిత్యం ట్రాఫిక్‌తో తిప్పలెదురవుతున్నాయి.

మీకు సహకరించే అంశాలు..?

గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలకు ప్రత్యేకత ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల పోటీకి దీటుగా ప్రచారంలో దూసుకుపోతున్నాం. బీఆర్ఎస్ ఎమ్మెల్యే నియోజకవర్గంలో రెండు సార్లు గెలిచినా కంపెనీ యజమానులు, రియల్టర్ల ప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోలేదు. కాంగ్రెస్ అభ్యర్థి గతంలో ప్రజా ప్రతినిధిగా పనిచేసి అవినీతి అక్రమాలకు పాల్పడిన చరిత్ర ఉంది. బీజేపీ అభ్యర్థి గతంలో ఎమ్మెల్యేగా చేసినా నియోజకవర్గం గురించి పట్టించుకోలేదు. ఆ ముగ్గురు అభ్యర్థుల పట్ల ప్రజల్లో సరైన అభి ప్రాయం లేదు. పారిశ్రామికవాడగా పేరున్న పటాన్‌చెరులో కార్మికుల సమస్యలతో పాటు రైతులు, వృత్తిదారులు, మహిళలు, నిరుద్యోగ సమస్యలపై పోరాటాలు చేశాం. అవి మాకు కలిసి వచ్చే అంశాలు. సీపీఐ(ఎం) పట్ల ఊహించని ఆదరణ ఉంది. మా సతీమణి లక్ష్మికుమారి పక్కనే ఉన్న ప్రగతినగర్ సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం కార్పొరేటర్‌గా కొనసాగుతున్నారు. ప్రగతి నగర్ అభివృద్ధి రోల్‌మోడల్‌గా నిలిచింది. అక్కడ చేసిన అభివృద్ధి ప్రభావం అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీల్లోని ఓటర్లపై ఉన్నది.

కేసీఆర్‌ను జైలుకు పంపిస్తాం

అవినీతిపై విచారణ చేసి తీరుతాం కేంద్ర హెూం మంత్రి అమిత్ షా



నవతెలంగాణ-ఆర్మూర్

'త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటుంది. పదేండ్లలో రాష్ట్ర ప్రజల కోసం కేసీఆర్ ఒక్క పని చేయలేదు. కుమారుడు కేటీఆర్ కోసం లక్షల కోట్లు సంపాదించి పెట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చేసిన అక్రమాలు అవినీతిపై విచారణ జరిపి జైలుకు పంపిస్తాం' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్‌లోని బైపాస్ రోడ్డు పక్కన శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో అమిత్‌షా ప్రసంగించారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే తెలంగాణ అభివృద్ధికి కంకణ బద్ధులై ఉంటామన్నారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసి రైతుల ఆదాయం, ఎగుమతులను పెంచి నాణ్యమైన పసుపు సాగును ప్రోత్సహిస్తామన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేకంగా గల్ఫ్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామన్నారు. తాము అధికారంలోకి వస్తే బీసీ సీఎంను చేస్తామని ప్రకటించారు. పరీక్ష పత్రాలను లీకేజీ చేసిన వారిని జైలుకు పంపుతామన్నారు. కేసీఆర్ డబ్బులు ఇచ్చిన వారికే మంత్రి పదవులు కట్టబెట్టాడని ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కవిత మద్యం దందా నిర్వహించి కోట్లు సంపాదించారని చెప్పారు. ఈ సభలో ఆర్మూర్, బాల్కొండ నుంచి పోటీ చేస్తున్న పైడి రాకేష్‌రెడ్డి, ఏలేటి అన్నపూర్ణమ్మ, పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నరసయ్య, నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, లోక భూపతిరెడ్డి, పైడి రాకేష్ రెడ్డి సతీమణి రేవతి రెడ్డి, కుమార్తె సుచరిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఊపందుకున్న సీపీఐ(ఎం) అభ్యర్థుల ప్రచారం

నవతెలంగాణ- చిట్యాల టౌన్/టేకులపల్లి/వైరా టౌన్/చంద్రుగొండ

సీపీఐ(ఎం) అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన నకిరేకల్ సీపీఐ(ఎం) అభ్యర్థి బొజ్జ చిన్న వెంకులు గెలుపును కాంక్షిస్తూ నిర్వహించిన ప్రచార సభలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బులు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేసేటటువంటి నాయకులు ప్రజా సమస్యలను పట్టించుకోరని అన్నారు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి అభ్యర్థులు సంపాదనే ధ్యేయంగా ఉంటారన్నారు. నిరంతరం పేదలు రైతులు మహిళల హక్కుల కోసం అహర్నిశలు పోరాడే కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వార్థ రాజకీయాలతో ఓటర్లను మభ్య పెట్టడానికి వస్తున్నారని, ప్రజల కోసం పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలని భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు కోరారు. దుగ్గిరాల కృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ టేకులపల్లి మండలంలో ఆయన పర్యటించారు. రైతుల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య వీరభద్రంను గెలిపిస్తే కృష్ణా, గోదావరి, సాగర్ జలాలను వైరా రిజర్వాయరుకు తీసుకువచ్చి ఆయకట్టు భూములకు రెండు పంటలకు సాగునీరు అందించే బాధ్యత సీపీఐ(ఎం) తీసుకుంటుందని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రసాద్ తెలిపారు. వైరా మండలంలోని పలు గ్రామాల్లో భూక్య వీరభద్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అశ్వారావుపేట నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి పిట్టల అర్జున్ రావు గెలుపుకోరుతూ శుక్రవారం చంద్రుగొండ మండల ప్రజలు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి చేసింది శూన్యమన్నారు.

వంకర తంత్రం!

మనపార్టిలో నుండి మందిపార్టికి బోతె
నీతిగల్లోడైన రోతగాడె
అతనితో నడయాడినపుడున్న ముచ్చట్లు
ఇప్పిప్పి దూషించు తప్పు లాగ ఎదరి పార్టీ దొంగ ఎంత
కేడీయైన మన పార్టి జేరెనా ఘనచరితుడె గతములో
తిట్లన్ని గంగలో కలిపేసి ఎదురేగి దండేసి అదుముకొనుడె
ఎదుటి వెధవల దుర్మార్గ మెదురుకొనుట



తప్పుకోలేని ధర్మంబు తమదిగాన తాము చేసిన పనులెల్ల
ప్రేమ గలవి అంటు ప్రతివాడు రాజకీయాలు నడుపు

ఆ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనివ్వొద్దు

మేడిగడ్డ మతి ఉండి కట్టాడో.. మందేసి కట్టాడో ?

- **60ఏండ్లలో రూ. 69 వేల కోట్ల అప్పు... పదేండ్లలో ఆరు లక్షల కోట్ల అప్పు : ప్రజా భరోసా సభలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి**



నవతెలంగాణ-నకిరేకల్/తుంగతుర్తి/తిరుమలగిరి

కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించిన ఆ 12 మంది ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనీయొద్దని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా భరోసా సభల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి పదవి వదులుకున్నాడని, కానీ కేసీఆర్ ఏనాడూ పదవులను వదిలేయలేదని తెలిపారు. ఎలక్షన్లు, సెలక్షన్లు, కలెక్షన్ల విధానంతో కేసీఆర్ ముందుకెళ్లాడని విమర్శించారు. నకిరేకల్‌లో చిరుమర్తిని రెండుసార్లు గెలిపిస్తే నమ్ముకున్న కార్యకర్తల గుండెలపై తన్ని పార్టీ ఫిరాయించి దొర గారి గడిలో ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టాడని అన్నారు. కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజీని ఇసుకపై మతి ఉండి కట్టాడో మందేసి కట్టాడో అని అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. ఆనాడు వెంకన్న వైఎస్‌తో కొట్లాడి ఎస్ఎల్బీసీ టన్నెల్ ద్వారా 3.60 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని ప్రాజెక్టు మంజూరు చేయించి 30 కిలోమీటర్లు టన్నెల్ తవ్వారని, ఇంకో పది కిలోమీటర్లు పూర్తి చేస్తే ఈ ప్రాంతానికి నీళ్లు వచ్చేవని అన్నారు. కాంగ్రెస్‌కు పేరు వస్తుందనే కారణంతో ఎస్ఎల్బీసీని కేసీఆర్ పడావు పెట్టారన్నారు. 60 ఏండ్లలో 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.69 వేల కోట్లు అయితే పదేండ్లలో కేసీఆర్ కుటుంబం చేసిన అప్పు రూ.6 లక్షల కోట్లు అని తెలిపారు. దీన్ని బట్టి ఎవడు దొంగ.. ఎవడు గజదొంగ అన్నది తెలంగాణ ప్రజలు ఆలోచించాలన్నారు. నల్లగొండ కాంగ్రెస్ అడ్డా అని, ఉమ్మడి జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. వెంకట్ రెడ్డి, నేను ఇద్దరం అనుకుంటే.. ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ జెండా ఎక్కడా కనిపించదని చెప్పారు. 2014, 2018లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. రాష్ట్రాన్ని సాధించాక మొదటిగా దళితున్ని ముఖ్యమంత్రి చేస్తామన్న హామీని విస్మరించి వారికి తీరని అన్యాయం చేసిందన్నారు. నల్లగొండ జిల్లాలో ఇసుక, భూ మాఫియా జోరుగా సాగుతుందన్నారు.

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో నకిరేకల్‌లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కకుండా చేయాలన్నారు. అబద్ధాలు చెప్పడంలో కల్వకుంట్ల కుటుంబం నెంబర్ వన్ స్థానంలో ఉంటుందన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే, నవంబర్ నెల కరెంటు బిల్లు ఎవరూ కట్టవద్దనీ, కాంగ్రెస్ ప్రభుత్వమే చెల్లిస్తుందని ధీమాగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థులు వేముల వీరేశం, మందుల సామేలు, ఏఐసీసీ పరిశీలకులు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణస్వామి, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ నేతి విద్యాసాగర్, పీసీసీ నాయకులు అద్దంకి దయాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు డీవీ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు దుబ్బాక నరసింహారెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.